www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 18-8-2017 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 124 | విజయవాడ సిటీ

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: ఏకాదశి ఉ. 10.01 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆరుద్ర రా. 9.03 తదుపరి పునర్వసు
వర్జ్యం: ఉ. 6.42-8.10; దుర్ముహూర్తం: ఉ. 8.34-9.24, మ. 12.45-1.35; అమృతఘడియలు: ఉ. 11.52-1.20 వరకు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.36

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



సేంద్రియ, ఉద్యాన మేళాలో కూరగాయలను పరిశీలిస్తున్న సీఎం

'సంఘ'టిత సాగు

వ్యవసాయంలో డ్వాక్రా తరహా ఉద్యమం

• అన్నదాతా సుఖీభవ..

దేశంలో అందరికీ సంఘాలున్నాయి! అన్నదాతలకు మాత్రం లేవు! విత్తనం వేయడంతో మొదలైన కష్టాలు... దిగుబడులను అమ్ముకునే దాకా వెంటాడతాయి! ఎవరికి వారుగానే ఈ కష్టాలు ఎదుర్కోవాల్సిందే! అలా కాకుండా... రైతులను సంఘటితం చేయాలని సర్కారు నిర్ణయించింది. తనవంతుగా చేదోడు అందిస్తూ... వారిని ముందుకు తీసుకెళ్లాలని యోచిస్తోంది. రైతు ఉత్పత్తి సంఘాలు, రైతు ఉత్పత్తి సంస్థల ద్వారా అన్నదాతలకు కొత్త శక్తిని ఇచ్చేలా ప్రణాళిక రచించింది.



- గ్రామ స్థాయిలో రైతు సంఘాల ఏర్పాటు
- చిన్న, కౌలు రైతులకు బ్యాంకుల్లో రుణం
- వందకుపైగా సంఘాలతో 'రైతు ఉత్పత్తి సంస్థ'
- ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు రివాల్వింగ్ ఫండ్
- సంస్థ ఆధ్వర్యంలోనే ఎరువులు, మందుల షాపులు
- 640 కోట్లతో 150 మండలాల్లో అమలుకు సిద్ధం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఒక్కరుగా వెళితే... పోపొమ్మంటారు! నలుగురు కలిసి ఒక్కటిగా వెళితే... రారమ్మంటారు! ఇది... 'సంఘ'టిత శక్తి! డ్వాక్రా సంఘాల విషయంలో ఇది రుజువైంది. ఇప్పుడు... రైతులనూ ఇలాగే సంఘటితం చేయాలని, వారికి బలాన్నివ్వాలని సర్కారు నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రణాళిక సిద్ధమవుతోంది. దీని ప్రకారం... డ్వాక్రా సంఘాల్లాగే గ్రామాల్లో 10 నుంచి 15మంది అన్నదాతలతో ఒక 'రైతు ఉత్పత్తి సంఘం' ఏర్పాటు చేస్తారు. ఇలాంటి సుమారు వంద నుంచి 150 సంఘాలను కలిపి ఒక రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీవో)ను ఏర్పాటు చేస్తారు. ఒక్కో ఎఫ్‌పీవోకు ప్రభుత్వం రూ.10 లక్షలు రివాల్వింగ్ నిధి ఇస్తుంది. సంఘంగా

మిగతా 5వ పేజీలో...



పవన్ తడ'బాటు'?

నంద్యాలలో తటస్థ వైఖరిపై ప్రశ్నలు

భూమా కుటుంబంతో సాన్నిహిత్యం

ప్రభుత్వ అనుకూల ముద్ర పడుతుందన్న భయమే తటస్థ నిర్ణయానికి కారణమా?

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ రాజకీయాలకు దూరమన్నారు. ఉన్నదున్నట్లు కుండ బద్దలు కొడతానన్నారు. ఆవేశం, ఉద్వేగంతో విరుచుకుపడతారు. జనసేన అధిపతి పవన్ కల్యాణ్‌ది ఒక ప్రత్యేక శైలి! అలాంటి వ్యక్తి... నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు తడబడుతున్నారా? దాటవేతనే ఎంచుకున్నారా? నంద్యాల ఉప ఎన్నికలో జనసేనది తటస్థ వైఖరి అని పవన్ చేసిన ప్రకటనతో రాజకీయ వర్గాల్లో ఈ చర్చ మొదలైంది. నిజానికి... నంద్యాల ఉప ఎన్నికలో తమ పార్టీ వైఖరిని కొద్ది రోజుల్లో ప్రకటిస్తానని ఆయన విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చెప్పారు. దీంతో ఆయన ఏ వైఖరి తీసుకొంటారన్న దానిపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. అందరి అంచనాలకు భిన్నంగా తమది తటస్థ వైఖరని ప్రకటించారు. నంద్యాల ఉప ఎన్నికలో ఏ అభ్యర్థిని బలపరిస్తే ఏ సమస్య వస్తుందోనన్న సందేహంతోనే ఆయన తటస్థ వైఖరిని ఎంచుకొన్నారన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినవస్తున్నాయి. జనసేన పార్టీ ఏర్పాటు తర్వాత తనది

మిగతా 14వ పేజీలో...

పోలవరానికి మరో 979 కోట్లు

కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం

వెంటనే విడుదల చేయండి

నాబార్డ్‌కు ఉమాభారతి లేఖ

నేడు పార్లమెంటరీ కమిటీ రాక

• ఇప్పటికింతే..



న్యూఢిల్లీ/అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం మరో రూ.979 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర జలవనరులశాఖ మంత్రి ఉమాభారతికి కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై స్పందించిన ఉమాభారతి.. నిధులు విడుదల చేయాలంటూ నాబార్డ్‌కు గురువారం లేఖ రాశారు. అయితే.. గతంలో ఖర్చు పెట్టిన సుమారు 3 వేల కోట్ల నిధులను విడుదల చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఈ విజ్ఞప్తిని పెద్దగా పట్టించుకోని కేంద్రం కేవలం రూ.979 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. తాజాగా మంజూరు చేసిన నిధులతో కలిపి పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఇప్పటి వరకూ రూ.4328 కోట్లు మంజూరు చేసినట్లయింది. 2010 -11 ధరల ప్రకారం పోలవరం నిర్మాణానికి కేంద్రం రూ.5810.72 కోట్లు వ్యయం అవుతుందని నిర్ధారించింది. ఈ లెక్కల ప్రకారం పోలవరం నిర్మాణానికి ఇంకా రూ.1482 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉందని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. అయితే

మిగతా 5వ పేజీలో...

రాజధానికి అటవీ భూములు!



- బదిలీకి కేంద్ర పర్యావరణ శాఖ ఓకే
- ఫలించిన ముఖ్యమంత్రి ప్రయత్నాలు
- వెంకటాయపాలెంలో 1,835 హెక్టార్లు, తాడేపల్లిలో 251.77 హెక్టార్లు బదిలీ
- రాజధాని నిర్మాణానికి తొలగిన అడ్డంకి

3

జయ మృతిపై విచారణ



స్మారక మందిరంగా 'వేద నిలయం'

హైకోర్టు రిటైర్డ్ జడ్జికి విచారణ బాధ్యత

తమిళనాడు సీఎం పళనిస్వామి ప్రకటన

చిన్నమ్మకు షాక్.. విలీనానికి లైన్ క్లియర్!

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వర్గాల విలీనమే లక్ష్యంగా తమిళనాడు సీఎం పళనిస్వామి గురువారం కీలక నిర్ణయాలు ప్రకటించారు. చిన్నమ్మ, పార్టీ ప్రధాన కార్యదర్శి శశికళకు గట్టి షాకిచ్చారు. జయ మృతిపై నిజానిజాలు తేల్చేందుకు మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం సచివాలయంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన

మిగతా 2వ పేజీలో...

చికిత్స వివరాలు కమిషన్‌కు అందజేస్తాం

న్యాయ విచారణను స్వాగతించిన అపోలో

వైసీపీకి ఓటమి భయం!

నంద్యాల ఉప ఎన్నిక ఆపే కుట్ర

- శాంతిభద్రతల సమస్య తేవొచ్చు
- దీనిపై అంతర్గత సమాచారం ఉంది
- టీడీపీ సమన్వయ భేటీలో చర్చ
- అందరూ అప్రమత్తంగా ఉండండి
- నేతలకు ముఖ్యమంత్రి సూచన
- 26 నుంచి 'జలసిరికి హారతి'
- 3 నుంచి ఇంటింటికీ తెలుగుదేశం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉప ఎన్నికను ఏదో ఒక విధంగా ఆపాలని వైసీపీ కుట్ర పన్నుతోందని తెలుగుదేశం పార్టీ సందేహం వ్యక్తం చేసింది. గురువారం అమరావతిలో ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో నంద్యాల ఉప ఎన్నిక అంశం ప్రస్తావనకు వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... "నంద్యాల ఉప ఎన్నికలో వైసీపీ

మిగతా 14వ పేజీలో...

లెక్కలేస్తున్నారు!

- కుల, మతాలవారీగా వ్యూహాలు
- గ్రామీణ, పట్టణ ఓటర్లపై నజర్
- పార్టీలకందని తటస్థుల నాడి
- రెండో అంచెలోకి ఉప ఎన్నిక
- రేపు, ఎల్లుండి సీఎం ప్రచారం

14



గంగుల ప్రతాపరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రాగల 24 గంటల్లో

వర్షాలు పడొచ్చు.. పడకపోవచ్చు

- వాతావరణంపై అంచనాలు తప్పుతున్నాయ్
- వాతావరణ శాఖపై నమ్మకం కోల్పోతున్న రైతులు
- ఉష్ణ మండలం కావడం వల్లే అనూహ్య మార్పులు
- అందుబాటులో లేని అత్యాధునిక సాంకేతికత
- ఢిల్లీ, ప్రాంతీయ కేంద్రాల నడుమ సమన్వయ లేమి

• వాన రాకడ...



విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'నేడు, రేపు భారీ వర్షసూచన' అంటూ వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేస్తుంది. భారీ వర్షం సంగతి అటుంచితే చుక్క చినుకు కూడా మబ్బుల నుంచి కిందకు రాలదు. ఇటీవల కాలంలో తరచూ ఇలాంటి పరిస్థితి ఎదురవుతోంది. వాతావరణ శాఖ సూచనలను నమ్మితే మబ్బులను చూసి ముంతలో నీటిని ఒలకబోసుకున్నట్లేనని రైతులు భావిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాలు ఎందుకు తప్పుతున్నాయి? సామాన్య రైతు నుంచి ప్రభుత్వ పెద్దల వరకు ప్రతి ఒక్కరిని తొలిచేస్తున్న ప్రశ్న ఇది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ మూడు పర్యాయాలు ప్రకటించింది. వాతావరణ

మిగతా 5వ పేజీలో...



ఉగ్రదాడిలో గాయపడిన మహిళకు ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

స్పెయిన్‌లో ఉగ్రదాడి!

13 మంది దుర్మరణం

- 50 మందికి పైగా గాయాలు
- పాదచారులను వ్యాన్‌తో ఢీకొట్టిన ఉగ్రవాదులు

11

సీరియల్ కిల్లర్‌కు ఉరి

- నెల్లూరు కోర్టు సంచలన తీర్పు
- జల్సాల కోసం పైశాచిక నేరాలు

3

ఇంటర్ చేసిన వారికీ ఉద్యోగం

- 'కారుణ్యం' చూపిన సీఎం చంద్రబాబు
- ఎస్ఎస్ఏ ఉద్యోగుల జీతాలు పెంపు

14

పాడు బోరులో పుట్టెడు కన్నీరు!



కర్నూలు జిల్లా పగిద్యాలలో పైపుని తొలగించి, పూడ్చడం మరచిన దృశ్యం.

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

చీమలు పెట్టుకొన్న పుట్టలు పాములపాలయినట్టే, నీళ్ల కోసం రైతులు వేసే బోర్లలో మృత్యువు పొంచి చూస్తోంది. నీళ్ల కోసం బోరు వేయడం, పడలేదని మరింత లోతుకు పోవడం, చివరకు విసుగుపుట్టి ఆ ప్రయత్నాన్నీ, బోరునీ వదిలేసిపోతుండటంతో...పొలాల్లో ఎక్కడికక్కడ మృత్యు బావులు నోర్లు తెరుస్తున్నాయి. ఆడుకొంటూ అటుగా వచ్చిన పిల్లలను మింగేస్తున్నాయి. కొన్ని గంటలపాటు, ఒక్కోసారి రోజంతా బోరులోనే చిన్నారులు ఉండిపోతున్న పరిస్థితి! బయట తల్లులు తల్లడిల్లిపోతుంటే, ఎలాగైనా బయటకు తీసుకురావడానికి అధికారులు, ప్రభుత్వం తపనపడిపోతున్న దృశ్యాలు ఎన్నో! లోతు ఎక్కువ, వెడల్పు తక్కువగా ఉండే ఈ బోరుల్లో పెనుగులాడే పసి ఊపిర్లలో నిలుస్తున్నవి చాలాతక్కువ! అమ్మానాన్నలను ఏడిపించి, కడతేరిపోతున్నవే ఎక్కువ! సాధారణంగా బోరుని వదిలేసినప్పుడు.. కేసింగు పైపులను తొలగించి.. దానిని పూడ్చివేయాలి. అయితే, చాలా సందర్భాల్లో పైపులను అలాగే వదిలేస్తున్నారు. మరికొన్ని సార్లు ఆ పైపులనూ తీసేసి బోరుని అలాగే ఉంచేస్తున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో లోతయిన గొయ్యి మిగిలిపోతుంది. అనంతర కాలంలో అక్కడంతా గడ్డి మొలిచి, బాగా దగ్గరగా వెళితేగానీ బోరు ఉన్న విషయం తెలియదు. తీవ్రవర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌లోనే ఆరువేలకు పైగా ఇలాంటి బోర్లు కనిపించాయి. బత్తాయి, నిమ్మతోటల సాగుకు బోర్లపై ఆధారపడటం ఎక్కువయిన నేపథ్యంలో.. ప్రమాదాలూ పెరిగిపోతున్నాయి.



కనిగిరి మండలం పొనుగోడులో బోరు బావులను మూసి వేస్తున్న రెవెన్యూ అధికారులు



ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం నాగెళ్లముడుపులో నీళ్లు పడలేదని వదిలేసిపోతూ, ఓ రైతు బోరుకి అడ్డంగా చిన్నచిన్న చెట్టు కొమ్మలను, ఆ పక్కన బండరాయిని పడేసిపోయాడు.



కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికెర గ్రామంలో కేసింగు పైపుని అలాగే వదిలేసి, అటూఇటూ రెండు రాళ్లు పాతి.. బోరుకు మూతపని అయిందనిపించారు

బోరు బావుల మూసివేతకు కదిలిన యంత్రాంగం

కనిగిరి : చిన్నారుల ప్రాణాలు హరిస్తున్న బోరు బావులపై ప్రకాశం జిల్లా యంత్రాంగం కదిలింది. వాటి మూసివేతకు అధికారులు గురువారం రంగంలోకి దిగారు. కనిగిరి ప్రాంతంలో తవ్వి వదిలేసిన బోరు బావులు 10వేలు పైనే ఉంటాయని అంచనా. జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలు అధికంగా ఉండటంతో బోర్ల తవ్వకం ఎక్కువగా ఉంది. వినియోగంలో లేని బోరు బావులను మూసి వేయాలని కందుకూరు ఆర్డీవో... మండల తహసీల్దార్లను ఆదేశించారు. కనిగిరి మండలంలోని పొనుగోడు, సిద్దారెడ్డిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో తహసీల్దార్ కె.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బోరుబావులు మూసి వేస్తున్నారు. గ్రామాల్లో నీరురాక వదిలేసిన బోరు బావులను వెంటనే వీఆర్వోలు గుర్తించి మూసివేతకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పొలాల్లో బోర్లు వేసేవారు విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని వెల్లడించారు.

• కిలిమంజారోపై సిక్కోలు యువకులు



ఆఫ్రికా ఖండంలోనే అతి ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని సిక్కోలు యువకులు అధిరోహించారు. జిల్లాకు చెందిన మామిడి వెంకటరమణ, ఆర్.చిన్నమ్మలు తదితర 8 మంది బృందం బూట్స్ అండ్ క్రాంపన్స్ సంస్థ తరుపున ఈ నెల 10న బయలుదేరి.. 15వ తేదీ సాయంత్రానికి 19,341 అడుగుల ఎత్తులో ఉన్న పర్వత శిఖరాగ్రానికి చేరుకొంది. - శ్రీకాకుళం సిటీ

• 'సొర' కాదు.. 'కీర'



సొరకాయ సైజులో ఉన్న ఈ కీర దోసను చూశారా! 1.7 కిలోల బరువున్న ఈ భారీ కీర కృష్ణా జిల్లా గన్నవరం మండలం గొల్లనపల్లిలో పోరండ్ల నాగేశ్వరరావు(సుప్రీమ్) ఇంటి పెరట్లో కాసింది. సాధారణంగా కీర దోస 200 నుంచి 300 గ్రాములు ఉంటుంది. చెరువు ఒండ్రుమట్టిలోని పోషకాల వల్లనే భారీ సైజు కీరదోస కాచిందని సుప్రీం చెప్పారు. - విజయవాడ

• 'ఉన్నత' పాఠశాల!



పక్క పక్కనే బడ్డీకొట్లు... మధ్యలో చెట్టుకింద పాఠాలు వింటున్న పిల్లలు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు వద్ద శ్రీలంక కాలనీలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల ఇది. ఈ పాఠశాలలో 500 మంది విద్యార్థులున్నారు. పాఠశాల భవనం సరిపోకపోవడంతో .. ఆరో తరగతి విద్యార్థులు ఇలా చెట్ల కిందే చదివేసుకుంటున్నారు. వర్షం వస్తే మాత్రం.. ఉన్న గదుల్లోనే సర్దుబాటు చేస్తున్నారు. అందరికీ సరిపోయే భవనాలు ఎప్పటికి సమకూరుతాయో మరి! - నెల్లూరు

• నిరాడంబరంగా ఎమ్మెల్యే స్వామి వివాహం



కొండపి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కొండపి శాసనసభ్యుడు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వివాహం గురువారం వేకువజామున 3 గంటలకు తిరుమలలో నిరాడంబరంగా జరిగింది. ఉలవపాడు మండలం చాగొల్లు గ్రామానికి చెందిన లేళ్ల రాజేశ్వరిని ఆయన వివాహం చేసుకున్నారు. రాజేశ్వరి ప్రస్తుతం సింగరాయకొండ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. వధూవరుల కుటుంబ సభ్యులు, కొద్దిమంది బంధువులు మాత్రమే ఈ వేడుకకు హాజరయ్యారు. జిల్లాలోని పలువురు ప్రముఖులు, టీడీపీ నాయకులు స్వామికి ఎస్సెమ్మెస్‌లు, వాట్సప్‌ల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

బోర్లు నోర్లు తెరవొద్దు!

నిరుపయోగంగా వదిలేస్తే వేటు.. వాటి ఫొటోలను నాకు పంపండి

- సోషల్‌మీడియాలో పోస్ట్‌చేయండి
- అలా చేసినవారికి ప్రోత్సాహకాలు
- 'బోరుబావి' బాలుడితో గడిపిన సీఎం
- 2లక్షల డిపాజిట్.. 20లక్షలు అయ్యాక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

గుంటూరు, అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా ఉన్న బోరు బావులను పూడ్చనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వదిలేసిన బోరుబావులు ఎక్కడైనా కనిపిస్తే ఫొటోలు తీసి.. పంపించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. అలాగే, మూతలేని బావుల ఫొటోలను సెల్‌లో బంధించి, సోషల్ మీడియాలో పోస్టు చేయాలని సూచించారు. అలాచేస్తే, తగిన ప్రోత్సాహకం కూడా ఇస్తామని ప్రకటించారు. గుంటూరు జిల్లా వినుకొండలోని ఉమ్మిడివరంలో బోరుబావిలో పడిన చిన్నారిని ప్రాణాలతో కాపాడిన ఘటనను కేస్ స్టడీగా తీసుకుని డాక్యుమెంట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి విపత్తులు ఎదురైనప్పుడు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వ్యవహరించి సమయానుకూల వ్యూహాలను అనుసరిస్తే సానుకూల ఫలితాలు లభిస్తాయనేందుకు ఉమ్మిడివరం ఘటన నిదర్శనమన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఫైర్ సర్వీసెస్, హెల్త్, పోలీస్, జిల్లా రెవెన్యూ శాఖలను అభినందించారు. 'ఉమ్మిడివరం' బోరుబావి ఘటనలో మృత్యుంజయుడై తిరిగొచ్చిన చిన్నారి చంద్రశేఖర్‌ను జీజీహెచ్ నుంచి ప్రత్యేక వాహనంలో సచివాలయానికి తీసుకొచ్చారు. సీఎం ఆ బాలుడిని ఎత్తుకుని ముద్దాడారు. ఉజ్వల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ సీఎం రూ.2లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి రూ.20లక్షలు అయ్యాక అతనికి అందేలా ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. కాగా, బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని గురువారం రాత్రి విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో జీజీహెచ్ పేర్కొంది.



చంద్రశేఖర్‌ని ఎత్తుకొని ముద్దు చేస్తున్న సీఎం

పూడ్చేయాల్సిందే: లోకేశ్

రాష్ట్రంలోని 12,920 గ్రామ పంచాయతీల్లో నిరుపయోగ బోరుబావులను పూడ్చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ముందుగా పూడ్చని బోర్ల లెక్క తీయాలని అధికారులను కోరారు.

ఆ లోపల ఏముంది?

- వీడనున్న వేదనిలయం మిస్టరీ
- స్మారకంగా జయలలిత నివాసం!
- ఇప్పటిదాకా అది రహస్యమే!



చెన్నై, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అదో గండికోట రహస్యం! లోపల ఏముంటుంది? ఎలా ఉంటుంది? ఎక్కడ ఏముంటుంది? ఇవన్నీ అతి కొద్దిమందికి మాత్రమే సమాధానం తెలిసిన ప్రశ్నలు! దాదాపు యాభై ఏళ్లపాటు జయలలిత నివసించిన పోయెస్ గార్డెన్ (వేద నిలయం) ఒక మిస్టరీ! ఇప్పుడు... ఆ భవనం తలుపులు సామాన్యులకూ తెరుచుకోనున్నాయి. వేద నిలయాన్ని జయలలిత స్మారక భవనంగా మార్చాలని తమిళనాడు సర్కారు నిర్ణయించడమే దీనికి కారణం. ఏ చిక్కులూ ఎదురు కాకుంటే... అతి త్వరలోనే ఈ నిర్ణయం అమలులోకి రానుంది. ఇప్పటిదాకా వేద నిలయంలో అతి తక్కువ మంది మాత్రమే అడుగుపెట్టారు. జయ జీవించి ఉన్నప్పుడు అందులోకి మహామహులకు మాత్రమే ప్రవేశముండేది. ఈ భవనాన్ని జయ 1967లో 1.32 లక్షలకు కొనుగోలు చేశారు. సినిమాల్లో సంపాదించిన డబ్బుతో కొన్న ఈ ఇంటికి తన తల్లి అసలు పేరు (వేదవల్లి)తో 'వేద నిలయం' అని నామకరణం చేశారు. సుమారు 20 వేల చదరపు అడుగుల వైశాల్యంలో ఉండే ఈ వేద నిలయంలో 20 మందికి పైగా పనివాళ్లు ఉండేవారు. ప్రపంచంలో ఎవరితోనైనా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడగలిగే సదుపాయాలు, ఐసీయూను తలపించేలా వైద్య సదుపాయాలున్న పెద్దగది, మినీ సినిమా థియేటర్ ఉన్నాయని చెబుతారు. జయ వెంట శశికళ, ఆమె మరదలు ఇళవరసి, ఇరవయ్యేళ్ల వయసున్న ఇద్దరు యువతులు మాత్రమే ఉండేవారు. ఈ ఇద్దరు యువతుల్ని శశికళ వేరే ప్రాంతాల నుంచి తెప్పించారని కొందరు, నరేంద్రమోదీయే గుజరాత్ నుంచి పంపించారని ఇంకొందరు చెబుతుంటారు. జయకు అవసరమైన మందుల నుంచి ఆమెకు మేకప్ టచప్ వరకూ వీరిద్దరే చూసుకునేవారు. ఆ ఇద్దరు ఎవరన్నది ఇప్పటికీ రహస్యమే. జయ మరణం తర్వాత వారు ఎక్కడున్నారు, ఏమయ్యారన్నది ఎవ్వరికీ తెలియదు. జయ మరణానంతరం శశికళ, ఆమె కుటుంబీకులు, జయ మేనల్లుడు దీపక్ వేద నిలయంలో మకాం వేశారు. శశికళ జైలుకెళ్లిన తరువాత దీపక్ అప్పుడప్పుడూ వచ్చి వెళ్తున్నారు. ప్రస్తుతం పని వాళ్లు మాత్రమే అక్కడ ఉన్నారు.

భారీ భద్రత...

వేద నిలయాన్ని స్మారక మందిరంగా మార్చనున్నట్లు సీఎం ఎడప్పాడి ప్రకటించిన నిమిషాల్లోనే అక్కడ భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. సీఎం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దీప, దీపక్ అక్కడకు వచ్చే అవకాశముందన్న ఉద్దేశంతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. భవనం కోసం ఇటీవలే దీపక్, ఆయన అక్క దీప ఘర్షణ పడ్డారు.

కోర్టుకు వెళతా: దీప

"వేద నిలయం మా అత్త ఆస్తి. ఆమె ఆస్తులన్నీ మాకే చెందుతాయి. దానిని స్మారక మందిరంగా మార్చాలన్న నిర్ణయంపై కోర్టుకెళ్తా" అని దీప ప్రకటించారు.

జయ మృతిపై విచారణ



(మొదటి పేజీ తరువాయి)

విలేకరుల సమావేశంలో తన సీనియర్ మంత్రులు డి.జయకుమార్, దిండిగల్ శ్రీనివాసన్, పి.తంగమణిలతో కలిసి పళనిస్వామి మాట్లాడారు. రిటైర్డ్ జడ్జి ఎవరన్నది తర్వాత ప్రకటిస్తామన్నారు. ఈ కమిషన్‌లో పలువురు న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు కూడా ఉంటారని చెప్పారు. అలాగే జయ నివాసం 'వేద నిలయం' (పొయెస్‌గార్డెన్)ను స్మారక మందిరంగా రూపొందిస్తామని చెప్పారు. ఈ నివాసాన్ని ఇక నుంచి ప్రజలు సందర్శించవచ్చని, ఆ మేరకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబరు 22న అపోలో ఆస్పత్రిలో చేరిన జయ.. డిసెంబరు 5వ తేదీన కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాము విలీనం కావాలంటే దినకరన్, శశికళలకు పార్టీ నుంచి ఉద్వాసన పలకడంతో పాటు జయ మరణంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. న్యాయవిచారణకు ఆదేశిస్తే జయకు అందించిన చికిత్సలకు సంబంధించిన ఫొటోలు, వీడియో క్లిప్పింగులు ఇస్తామని శశికళ మేనల్లుడు జయానంద్ బుధవారం తెలిపారు. మర్నాడే సీఎం న్యాయవిచారణకు ఆదేశించడం గమనార్హం. అయితే తాము డిమాండ్ చేస్తున్నట్లుగా సీబీఐతోనే దర్యాప్తు జరిపించాలని ఓపీఎస్ వర్గానికి చెందిన పలువురు నేతలు డిమాండ్ చేశారు. సీనియర్ నేత కేపీ మునుస్వామి మాట్లాడుతూ.. రిటైర్డ్ జడ్జితో న్యాయవిచారణ చేయిస్తామన్న సీఎం వ్యాఖ్యలతో తాము సంతృప్తిగా లేమన్నారు. మరో నేత మాఫోయ్ పాండ్యరాజన్ మాత్రం పళనిస్వామి నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. తాము కోరిన మూడు డిమాండ్లను సీఎం నెరవేర్చారని, అయితే న్యాయవిచారణ కాకుండా సీబీఐతో విచారణ చేయిస్తే బావుండేదని వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయాలతో ఓపీఎస్, ఈపీఎస్ వర్గాల విలీనానికి మార్గం పూర్తిగా సుగమమైంది. తాజా పరిణామాలపై చర్చించేందుకు పన్నీర్ శుక్రవారం ఉదయం తన వర్గంతో భేటీ అవుతున్నారు.

స్వాగతించిన అపోలో

జయలలిత మృతిపై న్యాయవిచారణకు ఆదేశించడాన్ని అపోలో ఆస్పత్రి స్వాగతించింది. వాస్తవాలు వెల్లడవుతాయని పేర్కొంది. జయకు తాము అందించిన మేలైన చికిత్స వివరాలను కమిషన్‌కు వెల్లడిస్తామని గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. తమ ఆస్పత్రి సీనియర్ వైద్యనిపుణులు, చెన్నై నగరంలోని వైద్యులు, ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు, బ్రిటన్, అమెరికా, సింగపూర్‌లకు చెందిన సీనియర్ వైద్యులందరూ జయను రక్షించేందుకు శతవిధాలా ప్రయత్నించారని పేర్కొంది.

శశికళను దూరం చేసేందుకే: డీఎంకే, కాంగ్రెస్

శశికళను పార్టీ నుంచి దూరం చేసేందుకే ముఖ్యమంత్రి ఈ న్యాయవిచారణ డ్రామాకు తెరదీశారని డీఎంకే, కాంగ్రెస్ విమర్శించాయి. శశికళను పొమ్మన లేక పొగబెట్టిన చందంగా న్యాయవిచారణ పేరుతో పార్టీ నుంచి వెళ్లగొట్టేందుకు బీజేపీ రచించిన వ్యూహంలో భాగంగానే పళనిస్వామి ఈ ప్రకటన చేశారని డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇళంగోవన్ ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు తిరునావుక్కరసర్, కాంగ్రెస్ సీనియర్ నేత పీటర్ ఆల్ఫోన్స్ మీడియాతో మాట్లాడుతూ.. జయ మరణించిన 8 నెలలకు ఎడప్పాడికి జ్ఞానోదయం కలగడం శోచనీయమన్నారు. జయ నివాసాన్ని స్మారకమందిరంగా చేయడానికి ఆమె వారసులతో ప్రభుత్వం మాట్లాడిందో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో ఉన్న న్యాయపరమైన చిక్కులను పట్టించుకోకుండా.. ఓపీఎస్‌తో జత కట్టాలన్న హడావుడిలో ఈపీఎస్ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.

లోకం తీరు



ఇంటికి అలా ఎందుకు సార్.. కారులో వెళ్దాం రండి..!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	23.3	30.0
చిత్తూరు	23.5	33.4
గుంటూరు	25.0	32.5
కర్నూలు	25.2	33.1
విశాఖపట్నం	26.0	32.2
విజయవాడ	26.2	31.4
ఒంగోలు	29.5	32.5

48 గంటల్లో అల్పపీడనం

- తెలంగాణ, కోస్తాలకు భారీవర్షాల హెచ్చరిక

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఫలితంగా వచ్చే 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇంకా కోస్తా నుంచి రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు ద్రోణి ఆవరించింది. ఉపరితల ఆవర్తనం నైరుతి వైపునకు ఒంగి ఉండడంతో తెలంగాణ, కోస్తాపై ప్రభావం చూపే అవకాశముందని, వచ్చే 24 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.



చైనా, పాక్‌ను ఎదుర్కోవాలి.. కానీ ముప్పంతా అంతర్గతంగానే!

చైనా, పాకిస్థాన్ దేశాలను భారత్ ఎదుర్కోవాల్సిందే. దురదృష్టవశాత్తు అంతర్గతంగానే ముప్పు పొంచి ఉంది. దేశాన్ని సర్వనాశనం చేయాలని ఇంటి దొంగే కంకణం కట్టుకున్నారు. విభజన సమయంలో మేం(కశ్మీరీలు) భారత్‌వైపే మొగ్గు చూపాం. అందుకు కారణం సమానత్వం లభిస్తుందనే నమ్మకం. మా జాతీయతను ఎలా ప్రశ్నిస్తారు. నేను భారత ముస్లింనని ఎంతో గర్వంగా చెప్పుకోగలను.

- నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా

శ్రీవారి సర్వదర్శనానికి 12గంటలు

తిరుమలలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 75వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 12, దివ్యదర్శనానికి సుమారు 2గంటల సమయం పడుతోంది. శనివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శుక్రవారం లాటరీ ద్వారా జారీచేసే సేవా టికెట్లు.. సుప్రభాతం: 50, కల్యాణోత్సవం: 80 ఉన్నాయి. ఆర్జితసేవలకు సంబంధించిన టికెట్లు శుక్రవారం మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉండవచ్చు. ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

కుడివైపు గుండెకు బైపాస్



కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మనిషికి గుండె సాధారణంగా ఎడమవైపున ఉంటుంది. అయితే కుడివైపున గుండె ఉన్న ఓ వ్యక్తి కర్నూలులోని మైక్యూర్ హాస్పిటల్‌కు వచ్చాడు. చాతీ నొప్పితో బాధపడుతున్న అతడికి వైద్యులు అరుదైన బైపాస్ సర్జరీ చేసి సమస్యను చక్కదిద్దారు. కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన బన్నూరు నాగప్ప(67) 10 రోజుల క్రితం చాతీ నొప్పితో హాస్పిటల్‌కు వచ్చాడు. పరీక్షల్లో అతడికి కుడివైపు భాగంలో ఉన్న గుండెలో సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయింది. కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ లక్ష్మీనారాయణ చౌదరి బృందం దీన్ని ఓ చాలెంజ్‌గా తీసుకొని ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా బైపాస్ సర్జరీ విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గుండె కుడివైపున ఉంటే ప్రతిదీ సమస్యే అని చెప్పారు. ఇది వంశపార్యపర్యంగా రాదని, జన్యుపరమైన లోపాల వల్ల ఇలా జరిగే ఆస్కారం ఉందన్నారు. నాగప్పకు సర్జరీ చేయడానికి ఆరు గంటల సమయం పట్టిందని తెలిపారు.



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి


బాసరలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి పూజలు

బాసర/హైదరాబాద్, ఆగస్టు 17 : బాసర జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయాన్ని గురువారం కేంద్రమంత్రి సుజనా చౌదరి సందర్శించారు. కుటుంబసభ్యులతో ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ పండితులు ఘనస్వాగతం పలికారు. కుటుంబసభ్యులతో కలిసి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో తన మనవడు అర్జున్ ప్రసాద్‌కు అక్షరశ్రీకార పూజ జరిపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయం బాగుందని, సమైక్య రాష్ట్రంలో బాసర అభివృద్ధి గురించి టీడీపీ మాత్రమే పట్టించుకుందని అన్నారు. చంద్రబాబు ప్రత్యేక చొరవతోనే ప్రస్తుతం ఇక్కడున్న వసతులన్నీ ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. బాసర పర్యటన ముగించుకుని వచ్చాక గురువారం సాయంత్రం నాలుగు గంటలకు కేంద్ర శాస్త్ర,సాంకేతికశాఖ సహాయ మంత్రి సుజనాచౌదరి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. మర్యాదపూర్వకంగానే మంత్రి సుజనా గవర్నర్‌ను కలుసుకున్నారని టీడీపీవర్గాలు తెలిపాయి.

అటవీ భూముల బదిలీ!

- కేంద్ర పర్యావరణ శాఖ పచ్చజెండా
- ఫలించిన ముఖ్యమంత్రి ప్రయత్నాలు
- తాడేపల్లిలో 251.77 హెక్టార్లు..
- వెంకటాయపాలెంలో 1835.32 హెక్టార్లు
- అటవీశాఖ సలహా కమిటీ అనుమతి
- అమరావతి నిర్మాణానికి తొలగిన కీలక అడ్డంకి
- చింతలపూడికీ మరో 347.64 హెక్టార్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. రాజధాని నిర్మాణానికి అటవీ భూములను బదిలీ చేసుకునేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ కృషికి ఫలితం లభించింది. దీంతో తాడేపల్లి, వెంకటాయపాలెంలలో అటవీ భూములను రాజధాని కోసం ఉపయోగించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీసీఆర్‌డీఏ)కి మార్గం సుగమమైంది. రాజధాని నిర్మాణం కోసం అవసరమైతే నిరుపయోగంగా ఉన్న అటవీ భూములను ఉపయోగించుకోవడానికి విభజన చట్టంలో కేంద్రం వెసులుబాటు కల్పించింది. ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వం అమరావతి కోసం కావలసిన అటవీ భూములను గుర్తించి రెండేళ్ల క్రితమే కేంద్ర అటవీశాఖ అనుమతి కోసం పంపింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణ స్వీకారానికి ఇటీవల ఢిల్లీ వచ్చిన ముఖ్యమంత్రి.. అటవీ భూముల బదిలీకి అనుమతించాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రి హర్షవర్ధన్‌కు విజ్ఞప్తి చేశారు. నిజానికి అటవీ నిపుణుల కమిటీ ఈ ఏడాది జూన్ 19 నుంచి జూన్ 22 వరకూ క్షేత్రస్థాయి తనిఖీల కోసం అమరావతికి వచ్చింది. సీఆర్‌డీఏ అధికారులతో చర్చల అనంతరం సమగ్ర నివేదికను తయారు చేసింది. ఈ నివేదికను జూలై 20వ తేదీన జరిగిన అటవీశాఖ సలహా కమిటీ (ఎఫ్ఏసీ) సమావేశంలో కేంద్రం ఆమోదించింది. అయితే సలహా కమిటీ పూర్తిస్థాయి భేటీలో మరోసారి ఈ నివేదికపై చర్చించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన ఎఫ్ఏసీ సమావేశంలో అటవీభూముల బదిలీపై కూలంకషంగా చర్చించి రాష్ట్రానికి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. తాడేపల్లిలోని 251.77 హెక్టార్లు, వెంకటాయపాలెంలోని 1835.32 హెక్టార్ల అటవీభూముల బదిలీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇంతే మొత్తంలో కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో కొత్తగా అడవుల పెంపకానికి తగిన నిధులను, భూములను రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. తాజా నిర్ణయంతో మొత్తంగా 12444.89 హెక్టార్ల అటవీభూములను సీఆర్‌డీఏ వినియోగించుకోనుంది.



చింతలపూడికీ లైన్‌క్లియర్

చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం 347.64 హెక్టార్ల అటవీభూముల బదిలీకి కూడా ఎఫ్ఏసీ అనుమతించింది. 2016 చివరిలో ఈ ప్రాజెక్టు కోసం మొదట 469.18 హెక్టార్ల అటవీ భూముల బదిలీకి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకుంది. కేంద్రం కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అంచనాలను సవరించి 347.64 హెక్టార్ల అటవీ భూముల కోసం మరోసారి విజ్ఞప్తి చేసింది. ఈ ఏడాది జూలై 20వ తేదీన జరిగిన ఎఫ్ఏసీ భేటీలో చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టును మాత్రమే నిర్మిస్తారా.. లేక వేరే ఇతర అవసరాలకు ఈ భూములను వాడుకునే ఉద్దేశం ఉందా.. అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరాలు కోరింది. రాష్ట్ర ప్రభుత్వం సవివరంగా నివేదిక అందించడంతో గురువారం సమావేశంలో అనుమతులను మంజూరుచేస్తున్నట్లు ప్రకటించింది.

చింతపల్లిపాడుకు 'ఆరోగ్య రక్ష'

- ఒక్కొక్కరికి 2లక్షల బీమా
- నాట్స్ అధ్యక్షుడి ఔదార్యం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చింతపల్లిపాడు గ్రామ ప్రజలందరికీ 'ఆరోగ్య రక్ష' పథకం కింద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) అధ్యక్షుడు మన్నవ మోహనకృష్ణ వెల్లడించారు. దీనికి సంబంధించిన చెక్కును ఆయన ఏపీ ఎన్ఆర్‌టీ అధ్యక్షుడు రవి వేమూరి, సీఈవో కే సాంబశివరావుకు గురువారం అందజేశారు. తన తాత స్వగ్రామమైన చింతపల్లిపాడు వాసులందరికీ ఆరోగ్య రక్ష కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి వ్యక్తికీ రూ.2లక్షలు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు మోహనకృష్ణ వివరించారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మన్నవను ఏపీ ఎన్ఆర్‌టీ అధ్యక్షుడు, సీఈవో అభినందించారు.

పచ్చళ్ల తయారీ కేంద్రాలపై దాడులు

- కల్తీ సరుకును సీజ్ చేస్తాం
- మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పచ్చళ్ల తయారీ కేంద్రాలపై తక్షణమే దాడులు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. నాణ్యత లేని పచ్చళ్ల కేంద్రాలను సీజ్ చేస్తామన్నారు. 'నిల్వ పచ్చడి నిగ- దగ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' గురువారం నాటి ప్రధాన సంచికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై గుంటూరులో గురువారం మంత్రి అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రసాయన పదార్థాలను కలిపి నాణ్యత లేని పచ్చళ్లను ప్రజలకు అమ్ముతున్న సంస్థలను మూసివేయిస్తామన్నారు. లైసెన్సు లేకుండా తయారు చేస్తున్న పచ్చళ్ల కేంద్రాలను మూసివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కల్తీ, నకిలీ కారం, పచ్చళ్ళు, ఎరువులు, పురుగు మందులు, బయోలు, విత్తనాల వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కల్తీ, నకిలీ వ్యాపారులకు సహకరించే అధికారులపై వేటు వేస్తామని ఆయన హెచ్చరించారు.



అంగన్‌వాడిలో వంటకాలను రుచి చూస్తున్న పుల్లారావు

- **హుద్‌హుద్ పనులు వేగవంతం: సీఎస్**

అమరావతి, ఆగస్టు 17, (ఆంధ్రజ్యోతి): హుద్‌హుద్ తుఫానుకు దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. హుద్‌హుద్‌కు దెబ్బతిన్న విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన రూ.2,220కోట్ల పనులపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు.

- **జీఎస్టీపై కోర్టుకు గ్రానైట్ సంస్థలు**

హైదరాబాద్/తాండూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ సంస్థలపై 28 శాతం జీఎస్టీ విధించడం నిబంధనలకు విరుద్ధమంటూ తాండూర్‌కు చెందిన మహేశ్వరి స్టోన్ సప్లయింగ్ కంపెనీతోపాటు మరో రెండు సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ మేరకు వీరు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ వి.రామసుబ్రమణియన్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది. 5 శాతంగా పన్నును 28 శాతానికి పెంచడం చట్టవిరుద్ధమని పిటిషనర్లు నివేదించారు.

- **నీట్ కౌన్సెలింగ్‌పై హైకోర్టు స్టే**

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కాళోజీ హెల్త్ వర్సిటీల్లో పీజీ సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీ కోసం నిర్వహిస్తున్న నీట్ కౌన్సెలింగ్‌ను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు వీరు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ వి.రామసుబ్రమణియన్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది.

- **టీడీపీకి జ్యోతుల చంటిబాబు రాజీనామా**

జగ్గంపేట, 17 ఆగస్టు: ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ జ్యోతుల చంటిబాబు గురువారం టీడీపీకి, తన పదవికి రాజీనామా చేశారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం ప్రకటించారు.

- **వైసీపీలోకి ఏపీ ఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు!**

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ మాజీ చైర్మన్, ఆర్యవైశ్య నేత శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం వైసీపీలో చేరనున్నారు. నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఉన్న జగన్‌ను కలవడానికి ఆయన రాజమహేంద్రవరం నుంచి గురువారం బయలుదేరివెళ్లారు.

కాకినాడ మున్సి'పోల్స్'కు గ్రీన్‌సిగ్నల్

- అనుబంధ పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో మధ్యంతర స్టే ఆదేశాలు జారీచేయడానికి నిరాకరించింది. ఈ వ్యాజ్యాల్లో అనుబంధ పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు... ప్రధాన పిటిషన్ల విచారణను వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాల తుది విచారణలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు లోబడే ఎన్నికల ఫలితాలు ఉంటాయని తేల్చిచెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. నవీన్‌రావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, అందుకు నిబంధనలు అనుమతించవని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ చేసిన వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కోసం రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్ విభజనకు సంబంధించి ప్రభుత్వం ఈ నెల 2న జారీచేసిన జీవో, దానికి అనుగుణంగా ఎన్నికల కమిషన్ జారీచేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని కోరుతూ పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే.

- **గంజాయి తరలిస్తున్న ముగ్గురు మహిళల అరెస్టు**

అనకాపల్లి టౌన్ (విశాఖపట్నం), ఆగస్టు 17: గంజాయి తరలిస్తూ గురువారం ముగ్గురు మహిళలు పట్టుబడ్డారు. వివరాల్లోకెళితే... తమిళనాడులోని సేలం సమీప గ్రామం బుదసందకు చెందిన వేములపాప (45), వేముల కళ(50), అంబిగ(35) విశాఖ ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేశారు. చెన్నై వెళ్లేందుకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చా రు. ఈ విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు అక్కడికి చేరుకుని వారి బ్యాగులు సోదా చేయగా గంజాయి బయటపడింది. 60 కిలోలు వున్న ఈ గంజాయి విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని సమాచారం.

మంత్రిగారికి ఖాళీ లేదయ్యా!

- ప్రమాదంలో కాళ్లు దెబ్బతిన్న విద్యార్థి
- 3నెలలుగా ఆగిన పరిహారం పంపిణీ

బుట్టాయగూడెం, ఆగస్టు 17: ప్రభుత్వం స్పందించింది. నష్ట పరిహారం ప్రకటించింది. ఆ వెంటనే ఉత్తర్వులు వెలువడ్డాయి. అందించడానికి అధికారులూ సిద్ధంగా ఉన్నారు. అయినా, మూడునెలలుగా బాధితుడి కుటుంబానికి ఎదురుచూపులే మిగిలాయి. ఎందుకని అడిగితే 'మంత్రిగారికి ఖాళీ లేదయ్యా' అని సమాధానం! పశ్చిమగోదావరి జిల్లా కేఆర్‌పురంలో మూడునెలల క్రితం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల వద్ద బోర్డుని ఏర్పాటు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయి ప్రిన్సిపాల్ మారుమూడి రవికిరణ్, విద్యార్థులు బక్కా సందీప్, సోయం రామ్మూర్తి చనిపోగా, మరో విద్యార్థి తామా వీర్రాజు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రుడికి ప్రభుత్వం నష్ట పరిహారం ప్రకటించింది. వీర్రాజుకు రెండు లక్షల రూపాయలను మంజూరు చేస్తూ.. వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ శాఖ మంత్రి చేతుల మీదుగా వీర్రాజుకు పరిహారం అందించాలని అధికారులు భావించారు. పరిహారం గురించి ఎప్పుడు అడిగినా.. 'మంత్రిగారికి ఖాళీ లేదయ్యా! ఆయన రాగానే అందిస్తాం' అని అధికారులు చెబుతున్నారని వీర్రాజు తండ్రి తామా వెంకటేశ్వరరావు వాపోయాడు. ప్రమాదంలో కాలిపై నరానికి గాయం కావడంతో వీర్రాజుకు సర్జరీ అవసరమని వైద్యులు చెబుతున్నారు. పేదకుటుంబం కావడంతో, అంత పెట్టుకొనే స్తోమత లేదు. ప్రభుత్వం మంజూరుచేసిన సాయం చేతికి అందితే.. ఆపరేషన్ చేయించాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. గురువారం ఐటీడీఏ ఏపీవోను వెంకటేశ్వరావు కలిసి వినతిపత్రం ఇచ్చి, గోడు వెళ్లబోసుకొన్నాడు.




ఐటీడీఏ ఏపీవో శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని ఇస్తున్న వీర్రాజు తండ్రి తామా వెంకటేశ్వరావు

వరుస హత్యల కేసులో యువకుడికి మరణశిక్ష

- 37 ఏళ్ల జైలు దండన కూడా..
- నెల్లూరు కోర్టు సంచలన తీర్పు

నెల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటుపడి, డబ్బుల కోసం హత్యలు చేయడానికి వెనుదీయని ఓ యువకుడికి నెల్లూరు కోర్టు ఉరిశిక్ష విధించింది. అలాగే, 37 సంవత్సరాల జైలు దండననీ ప్రకటించింది. ఓ ఆడిటర్ భార్యను బంగారు నగల కోసం హత్య చేసిన దారుణం ఏడాది క్రితం నెల్లూరు నగరంలో కలకలం రేపింది. ఈ కేసులో కుక్కపల్లి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్‌ని నెల్లూరు నాల్గో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బీశ్రీనివాసరావు దోషిగా నిర్ధారించారు. గురువారం ఉదయం మరణశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. పోలీసుల కథనం ప్రకారం, నెల్లూరు జిల్లా కొండాపురం మండలం ఎర్రగుట్ల పల్లికి చెందిన కుక్కలపల్లి వెంకటేశ్వర్లు నాలుగేళ్ల క్రితం నెల్లూరుజిల్లా కావలిలో న్యూడిల్స్ బండి పెట్టుకొన్నాడు. తన అవసరాలకు సరిపడా ఆదాయం అందులో కనిపించలేదు. దీంతో నేరాలబాట పట్టాడు. కావలిలో ఓ మహిళను హత్య చేసి బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. అల్లీపురం సమీపంలోని పెద్దచెరుకూరులో వృద్ధ పూజారి దంపతులను హత్య చేసి, ఇంట్లోని బంగారం ఎత్తుకెళ్లాడు. గతేడాది జూలై 9వ తేదీన నెల్లూరులోని ఆడిటర్ రామరాజునాగేశ్వరావు భార్యనుహత్యచేసి పారిపోయే క్రమంలో దొరికిపోయాడు. అప్పటి నుంచి నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్నాడు. ఈ కేసులో నెల్లూరు కోర్టు 302 కింద వెంకటేశ్వర్లుకు మరణశిక్ష విధించింది.



వెంకటేశ్వర్లు

విలీనం దిశగా...

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతిపై విచారణ కమిషన్ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి పళనిస్వామి నిర్ణయించడముతో, పన్నీర్ వర్గం విలీనానికి ముందడుగు బలంగా పడినట్టే. విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని ఈ కమిషన్, జయ మరణ రహస్యాలను ఏమి తవ్వితీస్తుందో తెలియదు కానీ, ఆమె పార్టీని మాత్రం ఏకం చేయబోతున్నది. పోయెస్ గార్డెన్‌లోని వేదనిలయాన్ని అమ్మ స్మారక కేంద్రంగా మార్చి ప్రజాసందర్శనకు అనుమతించాలన్న ముఖ్యమంత్రి మరో నిర్ణయం కూడా విశేషమైనదే. ఈ చర్యతో జయలలిత తరువాత వేదనిలయాన్ని తన అధికారిక నివాసంగా మార్చేసుకున్న శశికళను అక్కడ నుంచి గెంటివేస్తున్నట్టు లెక్క. పార్టీలో దినకరన్ హోదానూ, అధికారాలను తిరస్కరిస్తూ ఇటీవలే ఓ తీర్మానం చేసిన పళనివర్గం, ఈ కీలకమైన నిర్ణయాలతో శశికళ కుటుంబం నుంచి బాగా దూరం జరిగిపోయినట్టు లెక్క. ఇకపై మన్నార్‌గుడి కుటుంబం వేయబోయే ఎత్తులను బట్టి తమిళనాడు రాజకీయం కొత్త మలుపులు తీసుకుంటుంది.

జయలలిత మరణం చుట్టూనే తమిళనాడు రాజకీయం తిరుగుతున్నది కనుక పళని నిర్ణయం కీలకమైనదే. 75 రోజుల పాటు ఆసుపత్రిలో ఉండి కూడా, అమ్మ అనూహ్యంగా కన్నుమూయడంలో తెలియని కుట్రలు అనేకం పనిచేశాయని, శశికళ అధికారదాహం అందుకు కారణమని ఆరోపణలు, అనుమానాలు అనేకం ఉన్నందున ఈ విచారణ ప్రధానంగా శశికళ మీద ఎక్కుపెట్టినదే. మోదీ–అమిత్ షాల ఒత్తిడిమేరకు ఓపీఎస్, ఈపీఎస్ వర్గాల విలీనం ప్రక్రియ వేగంగా సాగుతున్న నేపథ్యంలో, అమ్మకు సంబంధించిన ఉద్వేగపూరితమైన ఈ నిర్ణయంతో అది సుఖాంతం కావాల్సిందే. ఈ చిట్టచివరి బాణం ఎలాగూ తప్పదని శశికళ కుటుంబానికి కూడా తెలుసు. నాలుగురోజుల క్రితమే ఎంజీ రామచంద్రన్ శత జయంతి వేడుకలను పురస్కరించుకొని టీటీవీ దినకరన్ మేలూర్‌లో ఓ పాతిక వేలమందితో భారీ బహిరంగ సభ నిర్వహించారు. వేదికమీద 20మందికి పైగా ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు కూర్చున్న ఈ సభ శశికళ కుటుంబం ఇప్పటికీ బలంగా ఉన్నదని చాటిచెప్పేందుకు ఉపకరించింది. జయలలిత మరణంపై విచారణ కమిషన్ ఏర్పాటుచేయాలని పన్నీర్ అంటున్నారని, తాను కూడా ఇప్పుడు అదే డిమాండ్ చేస్తున్నానని దినకరన్ ప్రకటించారు. అమ్మ మరణం వెనుక ఏ కుట్రలూ లేవన్నదే తమవాదనని, కమిషన్ ఏర్పాటు చేస్తే తమకు తెలియని రహస్యాలు ఏమైనా ఉంటే అవి కూడా బయటకు వస్తాయని దినకరన్ తెలివిగా వ్యాఖ్యానించారు. అమ్మ మరణించినప్పుడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్నది పన్నీర్ సెల్వమే కనుక, ఈ కమిషన్ ముందుగా విచారించాల్సింది ఆయననే అంటూ దినకరన్ మార్గదర్శనం కూడా చేశారు. పన్నీర్‌ను తీవ్రంగా కడిగిపారేసిన దినకరన్ ముఖ్యమంత్రి పళనిస్వామికి ఆ హోదా తమ భిక్షేనని గుర్తుచేశారు. తాను తలచుకుంటే ఏ క్షణంలోనైనా పళని ప్రభుత్వాన్ని కుప్ప కూల్చగలనని గతంలో హెచ్చరించిన దినకరన్, ఈ సభలో ఆ మాట అనకపోయినా, తాజా పరిణామాల నేపథ్యంలో వేగంగా పావులు కదిపే అవకాశాలున్నాయి. అమ్మ మృతిపై విచారణ, వేద నిలయాన్ని స్మారకకేంద్రంగా మార్చడంతో పాటు, రెండు వర్గాలు ఏకం కావాలంటే శశికళను పార్టీనుంచి సస్పెండ్ చేయాలన్న నిబంధన కూడా పళనివర్గం నుంచి ఉన్నది. ఈ మలి అడుగు పడేలోగా శశికళవర్గం నుంచి ఎదురుదాడి ఏ రూపంలోనైనా ఉండవచ్చు.

ఆగస్టు పదిహేనులోగా లెక్కలు తేల్చేసుకొని, ఒక్కటైపోవాలన్నది మోదీ, అమిత్‌షాల ఆదేశమని పత్రికలు గతంలో రాశాయి. అయితే, పాలన ఎవరిది, పార్టీ ఎవరిదన్న లెక్క కుదరకపోవడం వల్లనే ఈ గడువులోగా అది సాధ్యం కాలేదని అంటున్నారు. ఇప్పుడు పళని నిర్ణయాలను చూస్తే రెండువర్గాల మధ్య ఏదో ఒక ఒప్పందం కుదిరినట్టే కనిపిస్తున్నది. మొన్నటి ఢిల్లీ పర్యటనలో పళని, పన్నీర్ బీజేపీ పెద్దల సమక్షంలో పంపకాలు చేసుకొని ఉంటారు. ఎంజీఆర్ శత జయంతి వేడుకల సందర్భంగా ఈ నెలాఖరులో చెన్నైలో ఓ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి, అక్కడ ఈ విలీనాన్ని ప్రకటించడం, ఈ సభకు అమిత్‌షా హాజరుకావడం ఇప్పటికైతే ఉన్న ఆలోచన. దినకరన్ వెంట పాతికమందికి పైగానే ఎమ్మెల్యేలు ఉన్నారన్న మాట నిజమైన పక్షంలో, ఆయన తలచుకుంటే ఈ ప్రక్రియను సునాయాసంగా అడ్డుకోగలరు. పళని ప్రభుత్వాన్ని కూల్చడానికి దినకరన్ సిద్ధపడిన పక్షంలో పన్నీర్ వర్గం ఏ మేరకు ఆదుకుంటుందన్నది కీలకమవుతుంది. ఈ తరహా మరిన్ని సభలతో మరింత బలపడే ప్రయత్నాల్లో ఉన్నారు దినకరన్. పళని ప్రభుత్వంతో అమ్మ ప్రభుత్వమని, దానిని కూల్చబోమని, అది కేంద్రంతో సఖ్యంగా ఉంటూ రాష్ట్రాన్ని చక్కగా పాలించాలని కోరుకుంటున్నామంటూ, తాను కూడా మోదీ పక్షపాతినేనన్న సంకేతాలు దినకరన్ ఇస్తున్నప్పటికీ, తమను రాజకీయంగా గుంట నాశనం చేసే ప్రయత్నాలు ప్రతిఘటించకుండా ఆ కుటుంబం ఊరుకోదు. ఎదురుగాలి వీస్తున్నప్పటికీ, ప్రస్తుతానికి పార్టీలో ఎంతోకొంత జాగా మిగుల్చుకుంటే కాలం కలిసొచ్చినప్పుడు చక్రం తిప్పవచ్చునన్నది వారి ఆలోచన. ఆ అవకాశం వారికి ఏమాత్రం ఇవ్వకూడదు అన్నదే నుంచీ పెకిలించి వేయాలన్నది బీజేపీ వ్యూహం. శశికళ ప్రభావం పార్టీపై ఏమాత్రం ఉన్నా, ఇప్పుడు భాగస్వాములు, మద్దతులు ముప్పు రాకపోవచ్చు కానీ తమిళనాడులో ఇలా పరోక్షంగా అడుగుపెట్టి అనంతరం ప్రత్యక్షంగా ఎదగాలన్న బీజేపీ వ్యూహానికి అది అడ్డంకి. ఈపీఎస్, ఓపీఎస్ వర్గాల విలీనం, శశికళ కుటుంబాన్ని పార్టీ నుంచి తరిమివేయడం, అనంతరం ఆ పార్టీ ఎన్డీయేలో చేరడం తద్వారా బీజేపీ రాష్ట్ర పాలనలోనూ భాగస్వామి కావడం ప్రస్తుతం వేగంగా పూర్తికావాల్సిన లక్ష్యం. మరో మూడేళ్ళ ఎన్నికలకు సమయం ఉన్నందున, మధ్యంతర ఎన్నికలు రావాలని ఏ పార్టీ కోరుకోవడం లేదు కనుక, తమిళనాడులో రాజకీయం అంత త్వరగా ఒక కొలిక్కివచ్చే అవకాశాలు కూడా కనిపించడం లేదు. జయలలిత మరణం తరువాత బీజేపీ రాజేసిన నిప్పు ఆ రాష్ట్రాన్ని ఎప్పటికీ ఒద్దునవదనీయడం లేదు.

నేతాజీ 'మిస్టరీ' ఎంతకాలం?

నిరంకుశ బ్రిటిష్ సామ్రాజ్య ఆధిపత్యంపై, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సుప్రీం కమాండర్‌గా సమర శంఖం పూరించారు. మాతృభూమి స్వేచ్ఛా స్వాతంత్ర్య సాధనలో దేశభక్తి, ధైర్యం, త్యాగ సాహసాలు సమాయత్తపరిచిన ఇండియన్ నేషనల్ ఆర్మీ 'జైహింద్', 'చలో ఢిల్లీ' నినాదంతో జైత్రయాత్ర సాగించింది. 1941–1945లలో వీరోచిత సాహసిక సంగ్రామంలో చరిత్ర సృష్టించింది. ద్వితీయప్రపంచ సంగ్రామంలో జర్మనీ, జపాన్, ఇటలీ, క్రొయేషియా, మంచుకో, నాన్‌కింగ్, ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్, బర్మా దేశాలు ఆజాద్ హింద్ తాత్కాలిక ప్రభుత్వాన్ని గుర్తించాయి. రణరంగంలో సింగపూర్, జపాన్ ప్రభుత్వానికి స్వాధీనంతో 1943 జూలై 2న సుభాష్ చంద్రబోస్ సింగపూర్ ఆగమనంతో ఐఎన్ఏ ఉజ్జ్వలశకం ఆరంభమైంది. రణరంగ విజేతగా జపాన్ స్వాధీనం చేసుకొన్న అండమాన్, నికోబార్ దీవులను ఆ దేశ ప్రధాని హిడెకి టోజో, స్వేచ్ఛా భారత తాత్కాలిక ప్రభుత్వానికి స్వాధీనం చేయటం, 1943 డిసెంబర్‌లో షహీద్, స్వరాజ్ దీవులుగా, పోర్ట్ బ్లెయిర్ సెల్యులర్ జైలుపై నేతాజీ, భారత జాతీయపతాకం ఎగురవేయటం స్వతంత్ర పోరాటచరిత్రలో తొలి విజయకేతనమైంది. 1945 జూలైలో సింగపూర్‌లో ఐఎన్ఏ స్మారక చిహ్నానికి నేతాజీ శంకుస్థాపన భారతజాతి విస్మరించలేని సన్నివేశం. అంతకు ముందే 1944



1945 ఆగస్టు 18. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విషాద నిష్క్రమణ కథనం చరిత్ర పుటలలో మిస్టరీ అయింది. జపాన్ ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ భౌతిక అవశేషాలు పదిలపరిచిన కీలక అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా విశ్వసించి, బోస్ కుమార్తె, కుటుంబసభ్యులతో సంప్రదించి, ఆ మహానేత వర్ధంతి సందర్భాన్ని అధికారయుతంగా ప్రకటించటం ఎంతైనా సముచితం.

అక్టోబర్‌లో జపాన్ ప్రధాని జనరల్ టోజో, టోక్యోలో నేతాజీని 'స్వోర్డ్ ఆఫ్ ఆనర్' అత్యున్నత గౌరవంతో సత్కరించారు. ప్రపంచ సంగ్రామ నేపథ్యంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ, ఇంఫాల్–కోహిమా రణరంగంలో మాతృదేశం వరకు పురోగమించి, భారత విముక్తి లక్ష్యంతో ప్రాణాలను పణంగా సమర్పించే రక్తతర్పణకు అంకితమైంది. 1944 జూలై 26 నాటికి జపాన్ తిరోగమనంతో 1945 ఆగస్టు నాటికి ఐఎన్ఏకు మృత్యువేదన సంక్రమించింది.

1945 ఆగస్టు 18. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విషాద నిష్క్రమణ కథనం చరిత్ర పుటల్లో మిస్టరీ అయింది. 72 సంవత్సరాలైనా నేటికీ 'తాయ్ హో'కు విమానదుర్ఘటనలో నేతాజీ మరణం వివాదాస్పదం అవుతూనే వుంది. టోక్యోలోని రెంకోజీ బౌద్ధ దేవాలయంలో జపాన్ ప్రభుత్వం పదిలపరిచిన చితాభస్మ కలశంను ప్రధానమంత్రులు పి.వి., వాజపేయి, ఎందరో ప్రముఖులు సందర్శించి నివాళి ఘటించటం తప్ప భారత్‌కు ప్రభుత్వపరంగా తీసుకురాలేకపోయారు. ఐఎన్ఏ మేజర్ జనరల్ షానవాజ్ ఖాన్ సారథ్యంలో 1956 నాటి కమిషన్ నివేదిక, నేతాజీ సోదరుడు సురేష్ అంగీకరించలేదు. నేతాజీ సహచరి ఆస్ట్రియన్ ఎమిలీ షెంక్ల్, ఇతర కుటుంబ సభ్యులు విమాన ప్రమాద మరణాన్ని విశ్వసించలేదు. 1970 నాటి ఖోస్లా దర్యాప్తు నివేదిక సంతృప్తి ఇవ్వలేదు. 1998 జస్టిస్ ముఖర్జీ మూడవ కమిషన్ విమాన ప్రమాదాన్నే ధ్రువీకరించలేదు. సుభాష్ చంద్ర బోస్ 119వ జయంతి సందర్భంగా నేతాజీ అదృశ్య సంఘటన బహిర్గతం చేయటానికి ప్రధాని మోదీ 100 రహస్య ఫైళ్ళను, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 64 ఫైళ్ళు బహిర్గతం చేసినా కీలక సమాచారం లభించలేదు. బోస్ కుమార్తె అనితా బోస్ ఫాఫ్ ప్రస్తుతం జర్మనీ లగ్సంబర్గ్‌లో వున్నారు. తండ్రి మరణధ్రువీకరణకు, చితాభస్మ కలశంలోని అవశేషాన్ని డీఎన్ఏ పరీక్షలద్వారా ధృవీకరించాలని ఆమె సూచించినా భారతప్రభుత్వం పట్టించుకోవటం లేదు.

ఇటీవల నేతాజీ ఫైల్స్ ఇన్ఫో వెబ్‌సైట్ సృష్టికర్త అశిష్‌రాయ్ అత్యంత కీలక ఆసక్తికర సమాచారం అందించారు. చితాభస్మ కలశంలో సుభాష్‌చంద్రబోస్‌కు చెందిన బంగారపు పూత వున్న పన్ను, బోస్ సన్నిహిత సహచరుడు కల్నల్ హబీబుర్ రహ్మాన్, మరణానంతరం సేకరించి కలశంలో పదిలపరిచారట. ఆ విషయం రహ్మాన్ కుమారుడు నీమోర్‌కు తండ్రి స్వయంగా చెప్పారట. అశిష్‌రాయ్, పన్ను ఉదంతాన్ని 1995లో నాటి ప్రధాని పి.వి., ప్రతిపక్ష నేత వాజపేయి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు, జనతాదళ్ అధ్యక్షుడు బొమ్మయ్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యదర్శి చిత్తబసుకు లేఖల ద్వారా తెలిపారు. అయినా స్పందన లేదు.

జపాన్ ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ భౌతిక శరీర అవశేషాలు పదిలపరిచిన కీలక అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా విశ్వసించి, బోస్ కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులతో సంప్రదించి, ఆ మహానేత వర్ధంతి సందర్భాన్ని అధికారయుతంగా ప్రకటించటం ఎంతైనా సముచితం.

■ జయసూర్య

నవభారత్ : స్వప్నం, సత్యం!

■ రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

గొప్ప సందేశకులే గొప్పమార్పులు సాధిస్తారు. మాటల మాంత్రికుడైన ప్రధాని మోదీ, ఈ సత్యానంతర ప్రపంచపు రాజకీయ సందేశకులలో అగ్రగామి. మనసుకు హత్తుకుపోయే ఊత పదాలు లేదా నినాదాలు సృష్టించడం మోదీ భావ ప్రసార నైపుణ్యాలలో ఒకటి. ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో జాతికి ఆయనిచ్చిన నినాదాలు 'మేక్ ఇన్ ఇండియా', 'స్వచ్ఛ భారత్'; అధికారంలో వున్న రెండో సంవత్సరం –2015–లో 'స్టార్టప్ అండ్ స్టాండ్ అప్ ఇండియా' అంటూ యువ భారతీయులకు ఆయన ఒక కొత్త వ్యవస్థాపనా సామర్థ్య స్ఫూర్తిని కలిగించారు. మూడో సంవత్సరం–2016–లో 'డిజిటల్ ఇండియా' స్వప్నాన్ని ఆవిష్కరించారు; ఇక నాలుగో సంవత్సరమైన ఈ ఏడాది, ఐదేళ్ళలో అంటే 2022 నాటికి కలసికట్టుగా 'నవ భారత్'ను నిర్మించుకుందామనే ఉత్తేజకరమైన లక్ష్యాన్ని జాతికి మోదీ నిర్దేశించారు. నాలుగేళ్ళుగా ఎర్రకోట బురుజుపై త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించి మోదీ ఎలుగెత్తిన ఈ మాటలు దేశ ప్రజల మనసులను మంత్రిస్తున్నాయి. మంత్రముగ్ధులను చేసే మోదీ సందేశాలు, ఆయన సదుద్దేశాలను అటుంచితే అసలు 'నవ భారత్' అనే స్ఫూర్తిదాయక భావన సూచించేదేమిటి?

గోరఖ్‌పూర్ ప్రభుత్వాసుపత్రిలో ఆక్సిజన్ కొరతతో డజన్ల సంఖ్యలో బాలలు మరణించారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ఒకటైన గోరఖ్‌పూర్ జిల్లాలో ఏటా వర్షాకాలంలో మెదడువాపు వ్యాధి ప్రబలడం దశాబ్దాలుగా పరిపాటిగా వస్తోంది. మరి ఇటువంటి విపత్కర పరిస్థితి ఎదురవుతుందని ముందుగా తెలిసివుండి కూడా రోగగ్రస్తులకు సరైన వైద్యం అందించడానికి వైద్యాధికారులు సన్నద్ధంగా ఉండకపోవడమే 'కొత్త భారతదేశ' లక్షణమా? మెదడువాపు వ్యాధిని నిర్మూలిస్తామని, ఆరోగ్యభద్రత రంగంలో ప్రభుత్వ వ్యయాలను మరింతగా పెంచుతామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్ఠ పరుస్తామని ప్రధానమంత్రి మనకు హామీ ఇస్తున్నారా? నిజమేమిటంటే ఈ దేశంలో ప్రజారోగ్య వ్యవస్థ ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఉన్నది.

ఈశాన్య భారత రాష్ట్రమైన అస్సోం ఏటా బ్రహ్మపుత్ర వరదలతో అతలాకుతలమవుతూ వుంటోంది. 'నూతన భారతదేశం'లో కూడా, ఈ వార్షిక ప్రాకృతిక విపత్తు మరోసారి సంభవించినప్పుడు సైతం వేలాది కుటుంబాలు యథావిధిగా నిర్వాసితులవ్వడం జరుగుతుందా? నదీతీరాల దురాక్రమణను నిరోధిస్తామని, వరద నీరు స్వేచ్ఛగా సాగిపోయేందుకు కొరవడిన సదుపాయాలు కల్పిస్తామని, అడవుల నిర్మూలనను అరికడతామని ప్రభుత్వం మనకు హామీనిస్తుందా?

దేశవ్యాప్తంగా లక్షలాది బాలలకు నాణ్యమైన విద్యను సమకూర్చడంలో ప్రభుత్వ పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న దుస్థితిని 'కొత్త భారత్' ప్రతిబింబిస్తుందా? ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రాథమిక పాఠశాలల్లో 18 శాతం, మాధ్యమిక పాఠశాలల్లో 15 శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయని 2016 డిసెంబర్‌లో పార్లమెంటులో మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి ఒక ప్రకటనలో అంగీకరించారు. సమీప భవిష్యత్తులో ఈ ఉపాధ్యాయుల కొరతను పూర్తిగా తొలగిస్తామని ప్రభుత్వం ఖచ్చితమైన హామీ ఇవ్వగలదా?

వ్యవసాయ భూములు అంతకంతకూ తగ్గిపోతున్న, సన్న, చిన్నకారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారస్తులకు రుణగ్రస్తులవుతున్న, పంట పుష్కలంగా పండిన సంవత్సరాల్లోనూ తమ ఫలసాయానికి తగు మద్దతు ధర లభించక రైతులు నష్టపోతోన్న దేశం 'నవ భారత్' అవుతుందా? ఈ ఏడాది మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో పప్పుధాన్యాలు రికార్డుస్థాయిలో దిగుబడి అయ్యాయి. అయినా వందలాది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ దుస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి?

విద్యాభ్యాసం ముగించుకున్న యువజనులు ఏటా లక్షల సంఖ్యలో ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్నారు. అయితే చాలా కొద్దిమందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయి. అసలు ఉద్యోగం లభించకపోవడం, లభించినా తమ అర్హతలకు తగిన ఉద్యోగం లభించకపోవడంపై లక్షలాది యువ విద్యావంతులు తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. యువజనులు ఇటువంటి నిరుత్సాహానికి లోను కావల్సిన పరిస్థితులు 'కొత్త భారతదేశంలో' కన్పించకుండాపోతాయా? మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్న మాట నిజమే గానీ, అయితే అది ఉపాధి అవకాశాలు కల్పించని అభివృద్ధి అని, మరీ ముఖ్యంగా పెద్దనోట్ల రద్దు అనంతరం ఈ పరిస్థితి మరీ పెరిగిపోయిందన్న వాస్తవాన్ని ప్రభుత్వం అంగీకరిస్తుందా? పెద్దనోట్ల రద్దు పర్యవసానంగా 2017 సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ 15



లక్షల ఉద్యోగాలను కోల్పోయిందని 'సెంటర్ ఫర్ మానిటొరింగ్ ది ఇండియన్ ఎకానమీ' (సీఎమ్ఐఈ) తాజా అధ్యయనం వెల్లడించింది.

గుంటలు, గోతులు లేని రోడ్లను సమకూర్చడంలో మునిసిపల్ అధికారులు విఫలమవుతున్నారు. ఇటువంటి దుర్భర రోడ్లపై ప్రమాదాలకు లోనై ఏటా వందలాది మంది మరణిస్తున్నారు. మెరుగైన రోడ్లను నిర్మించడం ద్వారా అటువంటి ప్రమాదాలను 'నవ భారత్' నివారించగలదా? రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టు తీసుకున్న వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయినందుకు శిక్షకు గురవ్వడం చివరిసారి జరిగిందెప్పుడు? మునిసిపాలిటీల పాలకులు, అధికారుల్లో జవాబుదారీదనం లోపించిడం వల్లే పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పరిస్థితి అంతకంతకూ క్షీణించిపోతోంది. ఈ పరిస్థితుల కారణంగానే 'స్మార్ట్ సిటీ' భావన ప్రజలకు ఆకర్షణీయంగా వున్నది. అయితే 'స్మార్ట్ సిటీ'లతో పట్టణప్రాంతాల సమస్యలన్నీ పరిష్కారమవుతాయనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని చెప్పక తప్పదు. న్యాయస్థానాల్లో లక్షల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇటువంటి పరిస్థితిని నివారించి న్యాయాన్ని శీఘ్రగతిన ప్రసాదించడం 'నవ భారత్'లో సుసాధ్యమవుతుందా? వివిధ న్యాయస్థానాల్లో మూడు కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారిక గణాంకాలే సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కింది స్థాయి న్యాయస్థానాల్లో అవసరమైన మొత్తం న్యాయమూర్తుల కంటే 20 నుంచి 25 శాతం మంది తక్కువగా వున్నారు.

మతపరమైన మైనారిటీలు నిత్యం 'దేశభక్తి' పరీక్షలకు గురవుతున్నారు. సంప్రదాయబద్ధంగా గడ్డం పెంచుకొనేవారు, మదర్సాల్లో చదువుకొనేవారు, ఆజాన్ చదివేవారు లేదా వందేమాతరం పాడడానికి నిరాకరించేవారు 'జాతి–వ్యతిరేకులు'గా నిందపడుతున్నారు. కాలంచెల్లిన, ప్రజాస్వామ్య వ్యతిరేకమైన ఇలాంటి ఆలోచనా ధోరణులు సమసిపోకుండా 'నవ భారత్' ఎలా సాధ్యమవుతుంది? పశు వధకు సంబంధించి కొత్తగా జారీ అయిన నియమనిబంధనలు పశువ్యాపారులపై తమ కండబలాన్ని ప్రదర్శించడానికి గోరక్షకులను ప్రోత్సహించేవిగా వున్నాయి. ద్వంద్వ స్వభావంతో కూడిన ఇటువంటి నిబంధనల ప్రాతిపదికన కొత్త భారత్‌ను నిర్మించగలమా? 2010 నుంచి చోటుచేసుకున్న గోరక్షకుల హింసాకాండ సంఘటనల్లో చనిపోయిన 23 మందిలో అత్యధికులు (86 శాతం మంది) ముస్లింలేనని, ఈ సంఘటనలలో 97 శాతం 2014 మే అనంతరమే సంభవించాయని 'ఇండియా స్పెండ్' అనే డేటా వెబ్‌సైట్ వెల్లడించింది.

ప్రభుత్వాధికారుల, రాజకీయ నాయకుల అవినీతికి తావులేని 'నూతన భారత దేశాన్ని' నిర్మిస్తానని ప్రధాని మోదీ దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. కేంద్రంలో ఉన్నతస్థాయి అధికారులు అవినీతిని అదుపుచేసినప్పటికీ, 'స్థానిక' అవినీతి, ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన పనుల పూర్తిలో అకాల జాప్యం ఇంకా సామాన్య పౌరులను పలువిధాల వేధిస్తున్నాయి. డబ్బు తీసుకొని రక్షణ కల్పించడం (హఫ్తా సంస్కృతి) ఇంకా మన నిత్య జీవితాల్లో భాగంగా వుండేది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ కరప్షన్ పెర్సప్షన్స్ ఇండెక్స్‌లో మనదేశం మొత్తం 175దేశాల్లో 79వ స్థానంలో వుండడం గమనార్హం. మంత్రుల స్థాయిలో అవినీతి అంతమైందని మీరు భావిస్తున్నారా? అయితే మీరు నా సొంత రాష్ట్రమైన గోవాకు వెళ్ళండి. ఒక కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకై మద్దతు ఇచ్చేందుకు తమ 'రేటు' ఎంతో శాసనసభ్యులు స్వేచ్ఛగా చర్చించుకోవడాన్ని మీరు గమనించగలరు.

సత్యమేమిటంటే, 'నవ' భారత్, కనీసం ప్రస్తుతానికి, సాకారం సాధ్యం కాని స్వప్నం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చాలా నైపుణ్యంగా అల్లిన స్వప్నమది. 'అచ్ఛేదిన్' హామీ 2014 సార్వత్రిక ఎన్నికల్లో తనకు విజయం సమకూర్చిందని, అయితే అది ప్రజల అంచనాలకు అనుగుణంగా నెరవేరలేదనే సత్యం ఆయనకు బాగాతెలుసు. మొదటి మూడు సంవత్సరాల్లో నెరవేరని హామీల ఫలితంగా తన పాలనపై ప్రజలుపెట్టుకున్న నమ్మకం తొలగిపోవడం ప్రారంభమవ్వడంతో వారిని ఆకట్టుకోవడంలో కొత్త మార్గం అనుసరించడం ఆవశ్యకమయింది. కనుకనే 'నవ భారత్'అనే కొత్త స్ఫూర్తిదాయక లక్ష్యాన్ని ప్రధాని మోదీ దేశప్రజలకు నిర్దేశించారు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

జనవాక్యం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్: editpage@andhrajyothy.com

మన భవిష్యత్ మన చేతిలో

అనంతమైన శూన్యం. ఇదే పరలోకం. అందులో నుంచి తాత్కాలికంగా పుట్టిందే అనంత విశ్వం. ఇదే ఇహ లోకం. ఉన్నవి ఈ రెండు లోకాలు మాత్రమే. నిర్జీవ రాశులు, జీవరాశులు (మానవులు) ఈ రెండు లోకాల్లో ఏదో ఒకదానిలో తప్పక ఉండి తీరవలసిందే. అయితే ఆ ఉండటంలోనే ఉంది అంతా. ఇహ లోకంలో అయితే పదార్థం (Matter) రూపంలో/ముసుగులో అనేక నామరూపాలతో ఒక గుర్తింపుతో విడివిడిగా ఉంటాము తాత్కాలికంగా, ఆయుష్కాలం పాటు. పరలోకంలో అయితే సముద్రంలో నీటి బొట్లన్నీ కలిసి ఉన్నట్లు చీకటి శక్తి సముద్రంలో శక్తి (Energy) రూపంలో కలివిడిగా ఉంటాము, శాశ్వతంగా. అంటే మన శాశ్వత నివాసం పరలోకం, తాత్కాలిక నివాసం మాత్రం ఇహ లోకం. అయితే ఈ రెండు లోకాల్లో ఎక్కడ ఉండాలి అని నిర్ణయించేది అమలుపర్చేది 'కాలం' మాత్రమే. ఇహ, పరలోకాలకు మధ్య వారధి 'కాలం' దాని సంకల్పం (free will) కారణంగానే సృష్టి, స్థితి, లయల ప్రక్రియ అంతా సృష్ట్యాది నుంచీ సజావుగా సాగిపోతున్నది.

కానీ మానవజాతి అంతా ఇక్కడే పొరబడుతున్నది. ఇహ, పర లోకాల మధ్యలో మా మతానికి చెందిన దేవుడే ఉన్నాడు. ఆయనే ఈ సృష్టి కంతటికీ కారణం అని అన్ని మతాల వారు ఏవేవో కృత్రిమ సృష్టి సిద్ధాంతాల గురించి కృత్రిమ దేవుళ్ళను గురించి నొక్కి వక్కాణిస్తుంటారు. మానవ జాతి ఆ లేని దేవుళ్ళను నిజమని నమ్ముతూ అనవసర వ్యయ, ప్రయాసలకు లోనౌతుంటుంది. వారి దయాదాక్షిణ్యాల కోసం వెంపర్లాడుతుంటుంది. పూజలు, మొక్కులు, వ్రతాలు, నోములు అంటూ. ఇంకా ఆ లేని దేవుళ్ళకు నిత్యం తన స్వజాతినే 'బలి'గా కూడా ఇస్తుంటుంది. కానీ ఈ కృత్రిమ దేవుళ్ళు అంతా మానవజాతికి చేసే మేలు కంటే కీడే ఎక్కువ. మనకు మానవజాతికి ఏమాత్రం మేలు చేయని ఈ దేవుళ్ళు, మతాలు మనకెందుకు? ప్రస్తుతం మనం డిజిటల్ యుగంలో ఉన్నాం. వేదయుగం నాటి దేవుళ్ళు, యజ్ఞాలు, యాగాలు, పూజలు, నైవేద్యాలు ఇంకా పితృదేవతలు, పిండప్రదానాలు వంటి ఆచారాలు, సాంప్రదాయాలు వగైరా ప్రస్తుత కాలమాన పరిస్థితులకు ఏమాత్రం అనువైనవి కావు. మనలను మనమే సంస్కరించుకోవాలి. వ్యక్తిగతంగాను, జాతీయంగాను, అంతర్జాతీయంగాను ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా, మన జాతిని మనమే బాగుచేసుకోవాలి. ప్రస్తుత, భవిష్యత్ తరాల సుఖశాంతులు, శ్రేయోభివృద్ధులు కాంక్షించే వారంతా దీని కోసం కృషిచేయాలి.

– ఆర్. శ్రీనివాసరావు


ఉదాసీనతే అసలైన ప్రమాదకారి

దేశంలో ఉగ్రవాదం పొట్టనపెట్టుకున్న ప్రాణాలకన్నా ఉదాసీనత బలికోరిన ప్రాణాలే అత్యధికం. వివిధ సమస్యలకు భాద్యుల నుంచి జవాబుదారీతనంతో కూడిన ప్రతిస్పందన కన్నా తప్పునెట్టివేసే ధోరణి, తప్పించుకొనే ధోరణిలో ప్రవర్తన ఉండడం పెద్ద సామాజిక వ్యాధిగా తయారైంది. దానివల్ల సమస్య పక్కదోవ పట్టడమో, ముదిరిపోవడమో జరిగి మరింత ప్రమాదకరంగా తయారైంది. ప్రతీ సమస్యనీ రాజకీయ కోణంలో చూసే జాడ్యం విస్తరించి, ఉమ్మడి ప్రయోజనాలకు విఘాతం ఏర్పడుతుంది. ఇందుకు పెద్ద ఉదాహరణ గత వారం ఉత్తరప్రదేశ్‌లో ఒక పెద్ద ప్రభుత్వాసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా లేక చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంత హృదయవిదారక చిత్రమిది. అతి తక్కువ ధరకే దొరికే అత్యంత అవసరమూ, విలువైన ప్రాణవాయువు అందుబాటులో ఉందా లేదా అన్నది నగరంలో ఉన్న పెద్దాసుపత్రి గమనించుకోలేదా! ఆ వాయువు అందుబాటులో లేకపోతే వెంటిలేటర్ మీద ఉన్న రోగులు క్షణాల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్న విషయం సంబంధిత అధికారులకు తెలియనిదా? ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్ద నగరంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల పల్లెల్లో పరిస్థితి ఏమిటి? కరడుగట్టిన ఉదాసీనతకు ఇంతకు మించి రుజువేమిటి? పైగా ఈ ఉదంతంలో ప్రభుత్వ తప్పేమీ లేదని సాధారణ రోగాల వల్లనే మరణాలు సంభవించాయని ఆ ముఖ్యమంత్రి చెబుతున్నారు. అలా ఒక తప్పిదాన్ని వెనకేసుకురావడం వల్ల ఆ తరహా తప్పిదాల్ని ప్రోత్సహించినట్టే కదా! అయితే ఇది ఉత్తరప్రదేశ్‌కే పరిమితమైన రోగం కాదు. దేశవ్యాప్తంగా ఉంది. గతనెలలో తూర్పుగోదావరి జిల్లాలో ఒకే ఊరిలో పదిహేను మంది మరణించినప్పుడు, సరైన కారణాలు తెలుసుకోకుండానే ప్రభుత్వం ప్రకటించింది 'అవి కలుషితాహారం వల్ల జరిగిన మరణా'లని. అయితే వాస్తవానికి మన్యప్రాంతంలో విషజ్వరాలు ప్రబలడం, రక్షిత నీరు, ఆహారం, వైద్యసేవలు అందుబాటులో లేక పరిస్థితి తీవ్రరూపం దాల్చడం నిత్యకృత్యమైంది. ప్రాథమిక ఆరోగ్య రంగం పటిష్ఠం కానంత వరకూ పరిస్థితిలో మార్పురాదు. అది రాత్రికిరాత్రి జరిగే పని కాదు. నిధులూ, ప్రణాళికలూ, వాటివెనక చిత్తశుద్ధీ అవసరం. ముందుగా ప్రజల ప్రాణాల్ని విలువైనవిగా గుర్తిస్తే ప్రజారోగ్యం పట్ల ఉదాసీనత తగ్గుతుంది. ఇది దేశవ్యాప్తంగా రావాల్సిన మార్పు.

– డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

న్యూ ఇండియా వచ్చేసిందోచ్..!


■ వి. శ్రీనివాస్



సారాంశం

ఇంతకూ కొత్త భారత్ (న్యూ ఇండియా) అచ్ఛేదిన్‌కు కొనసాగింపా లేక ఈ రెండు వేరువేరు లక్ష్యాలా? అచ్ఛేదిన్‌తో సంబంధం లేకుండా కొత్త భారత్ సాధిస్తారా లేక అచ్ఛేదిన్ ఇప్పటికే వచ్చేశాయన్న విశ్వాసంతో కొత్త భారత్‌ను ప్రతిపాదిస్తున్నారా? మోదీ ప్రభుత్వం వివరించకున్నా, వారిదృష్టిలో అచ్ఛేదిన్ ఏమై ఉంటాయో ప్రజాస్వామికవాదులకు ఇప్పటికే అవగాహనలోకి వచ్చింది. ఒకవేళ "న్యూ ఇండియా" దాని కొనసాగింపే అయితే అదీ వచ్చినట్టేనని భావించాలి. సామాజిక, సాంస్కృతిక క్షేత్రాల్లోనూ ఆర్థికరంగంలోనూ ఈ "కొత్తదనం" ఇప్పటికే కనిపిస్తోంది మరి. ఒక కొత్త సాధారణ పరిస్థితిని (న్యూ నార్మల్)ను మన ప్రమేయం లేకుండానే మనకు అలవాటుచేసిన ఘనత మోదీ ప్రభుత్వానిది.

ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలు ఉద్వేగభరితంగానే ఉంటాయి. ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ ముందుకు తెచ్చిన కొత్త ప్రతిపాదన న్యూఇండియా. తమ వైఫల్యాలను కప్పిపెట్టుకునేందుకు, రాజకీయంగా లబ్ధిపొందేందుకు అధికారపీఠంపై ఉన్న రాజకీయపార్టీలు ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టే సామాజిక, సాంస్కృతిక పరమైన సున్నిత అంశాలను భగ్గుమనించడం సాధారణ వ్యూహమే. మోదీ ప్రభుత్వం ప్రజాహితానికి విరుద్ధమైన ఆర్థిక నిర్ణయాలను కూడా ప్రజల భావోద్వేగ సమస్యలుగా మార్చి ప్రయోగిస్తోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ ఈ రెండూ ఇందుకు ఉదాహరణ. దేశ ఆర్థికరంగంలో మొగ్గను బడా కార్పొరేట్ సంస్థలవైపు మళ్లించిన ఈ కీలక నిర్ణయాలు పెద్ద ప్రతిఘటన లేకుండానే అమల్లోకి వచ్చాయి. పెద్ద నోట్ల రద్దును నల్లధన ఆసాముల కొమ్ములు విరిచేందుకే అన్న ప్రచారంతో ఊదరగొట్టారు. ఒకే దేశం ఒకే పన్ను పేరుతో ముందుకు తెచ్చిన జీఎస్టీ విషయంలోనూ అదే వ్యూహం పాటించారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ... దేశంలో కొన్ని వందల సంవత్సరాలుగా వేళ్లూనుకొని ఉన్న అసంఘటిత రంగాన్ని చావుదెబ్బతీసిన జోడుగుళ్లు. వాణిజ్యం, ఉత్పత్తుల రంగంపై బడా కార్పొరేట్ సంస్థలకు పూర్తిస్థాయి పట్టు కోసం ఉద్దేశించిన సంస్కరణలు. వీటి పర్యవసానాలు, ప్రభావాలపై అంచనాలు ఇంకా కొనసాగుతున్నాయి. చిన్న వ్యాపారుల మనుగడకే ఇబ్బందికరంగా జీఎస్టీని తయారు చేశారు. చిరువ్యాపారులు దుకాణాలు కట్టేసి బడా మాల్స్‌లో సేల్స్ టీమ్‌లో చేరేలా ఒత్తిడి చేస్తున్నాయి. వినియోగదారులనూ జీఎస్టీ దెబ్బతీసింది. లగ్జరీ వస్తువులు, డీమెరిట్ ఉత్పత్తులకు మాత్రమే పరిమితమని ప్రవేశపెట్టిన 28 శాతం గరిష్ఠ పన్ను రేటు పరిధిలోకి 30 శాతం వస్తువులను చేర్చారు.



ఆర్థిక రంగంపై బడా కార్పొరేట్ సంస్థలు, విదేశీ ఇన్వెస్టర్లకు పూర్తి పట్టును కల్పించి, అవ్యవస్థీకృత రంగం పాత్రను తుడిచిపెట్టే ప్రయత్నాలు కూడా విప్లవంగా రాణిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలన్నీ ఫర్‌సేల్ టాగ్‌తో మార్కెట్లోకి పోతున్నాయి. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌ల్లో సుశిక్షితులైన వారు, సబాటికల్ లీవ్‌తో తర్ఫీదు పొందివచ్చిన వారు అన్ని కీలక విభాగాలను ఆక్రమిస్తున్నారు. దేశాన్ని విజయవంతంగా ఈ స్థితికి తీసుకువెళ్లడం 'న్యూ ఇండియా'కు సంకేతమైతే మోదీ లక్ష్యాన్ని సాధించినట్టే.

ప్రాతిపదిక సంవత్సరాలను మార్చడం ద్వారా పెరిగిన జీడీపీ వృద్ధి రేట్లు, గణాంకాల మోళీతో చతికిలబడిన ద్రవ్యోల్బణం వాస్తవ పరిస్థితిలను దాచిపెట్టలేవు. గత మూడేళ్ల కాలంలో జీవనవ్యయం అనూహ్యంగా పెరిగింది. సాధారణ ప్రజల నిత్యావసరాల ధరలన్నీ భగ్గుమంటున్నాయి. ద్రవ్యోల్బణం మాత్రం 12 శాతం లోపే ఉంది. తాజా గణాంకాలు మాత్రం ద్రవ్యోల్బణంలో చలనాన్ని సూచిస్తున్నాయి. మౌలికవసతుల కల్పనలో కూడా మోదీ ప్రభుత్వం కొత్త ఘనత ఏమీ సాధించలేదు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, డిజిటల్ ఇండియా ఆవిష్కరించిన కలలను విద్యుత్‌కు నోచుకోని వేలాది గ్రామాలు ఎద్దేవా చేస్తున్నాయి. వ్యవసాయ రంగంలో సంక్షోభం కొనసాగుతూనే ఉంది. రైతుల రాబడులు రెట్టింపు కాకుండానే ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. అస్మదీయులు అక్రమ మార్గాల్లో కోట్లకు పడగెత్తుతున్నా అవినీతిపై రణన్నినాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రధాని సన్నిహితునిగా పేరున్న గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్‌పై అనేక ఆరోపణలున్నాయి. రేవులు, విద్యుత్ వ్యాపారంలో విస్తరించి ఉన్న ఈ సంస్థ ఓవర్ ఇన్వాయిసింగ్‌తో (కొనుగోలు ధరను కృత్రిమంగా పెంచడం) వేల కోట్ల రూపాయలను విదేశాలకు తరలించినట్టుగా ఆరోపణలున్నాయి. తాజాగా గార్డియన్ పత్రిక ఈ ఆరోపణలను ధ్రువీకరించే నివేదికను బయటపెట్టింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ నివేదిక ఇది. ఈ అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా పరిశోధనాత్మక కథనాలు ప్రచురించిన కారణంగా సుప్రసిద్ధ పత్రిక ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఇపిడబ్ల్యు) ఎడిటర్, సుప్రసిద్ధ జర్నలిస్ట్ పరంజయ్ గుహ ఠాకుర్తా ఉద్యోగం పోయింది. కేసులు పెట్టడం ద్వారా ఇపిడబ్ల్యు యాజమాన్యాన్ని భయపెట్టి అదానీ గ్రూప్ ఈ విజయం సాధించింది. ప్రజల తరఫున నిలబడేవారి నోరునొక్కేందుకు వ్యూహాత్మక వ్యాజ్యాలను ప్రయోగించడం రివాజుగా మారింది. ప్రజాసంఘాలు, పౌరహక్కుల నాయకులు, కార్మికనేతలు అందరి నోళ్లను ఈ విధంగానే మూయిస్తున్నారు. న్యాయస్థానంలో కేసులో ఐటి శాఖ దాడులు, సీబీఐ దర్యాప్తులు.. ఇలా అన్నిసాధనాలను విపక్షాల నోరుమూసేందుకు ప్రయోగిస్తున్నారు. సుప్రసిద్ధ మరాఠీ జర్నలిస్టు, 90ల్లో మహానగర్ పత్రికతో సంచలనం సృష్టించి పలుమార్లు శివసేన దాడికి గురైన నిఖిల్ వాఘ్లేను ఇప్పుడు ఓ మరాఠీ చానల్ రాజకీయ కారణాలతో అర్ధంతరంగా తొలగించింది. రెండు మూడు నెలలుగా ఆయన నిర్వహిస్తున్న షోను రద్దు చేయించారు. బ్యాంకుల ఎన్‌పీఏలపై హడావుడి చేస్తున్నా బకాయిలు రాబట్టడానికి చిత్తశుద్ధితో చేస్తున్నప్రయత్నాలు మాత్రం లేవు. రుణాలు తీసుకొని ఎగవేసిన పొలిటీషియన్ బిజినెస్‌మేన్‌లను బుక్ చేయగలరా? తెలుగురాష్ట్రాలకే చెందిన ఒక నాయకుని సంస్థ బ్యాంకులకు 1,000 కోట్ల రూపాయలు బకాయి పడింది. సెటిల్‌మెంట్‌లో భాగంగా కేవలం 300 కోట్ల రూపాయలను అది కూడా వాయిదాల్లో ఏడాదిలోగా చెల్లించి సెటిల్ చేసుకుందామని బ్యాంకులకు ప్రతిపాదించింది. లక్షల కోట్ల రూపాయల రుణాలను కొన్ని వేలకోట్ల రూపాయలకు బ్యాంకులు సెటిల్ చేసుకుంటే నికరంగా లబ్ధిదారులు ఎవరు? కేంద్ర మంత్రిమండలిలో ఉన్న ఒక సీనియర్ నేత డజన్ల సంఖ్యలో కంపెనీలను పెట్టి వాటి మధ్య కాగితాలపై వేలకోట్ల రూపాయల లావాదేవీలు చూపిస్తూ బ్యాంకుల నుంచి రుణాలు దండుకున్నట్టుగా ఆరోపణలున్నాయి. ఎగుమతుల ప్రమోషన్ కోసం ప్రభుత్వం కల్పించే రాయితీలను దుర్వినియోగం చేసినట్టుగా ఆరోపణలున్నాయి. వీరెవ్వరూ మోదీ అవినీతి రాడార్‌లో కనిపించరు.

ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన విలువలనే ప్రాతిపదికగా తీసుకొని సంపూర్ణ స్వేచ్ఛతో కూడిన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో మాత్రమే ఈ విలువలు రాణిస్తాయని నమ్మించేందుకు నయా ఉదారవాదం ప్రయత్నిస్తుంటుంది. నిజానికి ఆ విలువలను శాశ్వతంగా తొక్కివేసే నిర్మాణమే నయా ఉదారవాద లక్ష్యం. ప్రజల హితానికి విరుద్ధమైన అనేక విధానాలను ముందుకు తేవడంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహం కూడా ఇదే రకంగా ఉంటోంది. వైఫల్యాల నుంచి ప్రజలు దృష్టి మరల్చడం, వాటినే విజయాలుగా చెప్పుకోవడం, గణాంకాలను ఏమార్చడం, ప్రశ్నించే గొంతులను నొక్కేయడం, ప్రజలను కులాలు, మతాలు ఆధారంగా చీల్చడం, కరుడు కట్టిన మార్కెట్‌వాదులు కూడా అమలు చేసేందుకు జంకిన సంస్కరణలను అలవోకగా అమల్లోకి తేవడం.... ఇవన్నీ అందుకు సంకేతాలే. ఏటా కోటి ఉద్యోగాల కల్పన హామీలో నికరంగా ఒక శాతం కూడా ఇప్పటికీ నెరవేరలేదు. ధరలు ఆకాశంలో ఉన్నా ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయిలకు పరిమితమైంది. బ్యాంకులు లక్షల కోట్ల రూపాయల మొండిపద్దులతో అల్లాడిపోతున్నా, బడాకార్పొరేట్ల ఎగవేతలు యధేచ్ఛగా సాగుతున్నాయి. రైతుల రాబడి రెట్టింపుకావడం మాట అటుంచి ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయి. దేశంలోని వైద్య సర్వీసుల రంగం స్థితిగతులకు గోరఖ్‌పూర్ సజీవ ఉదాహరణగా నిలస్తున్నా అబద్ధపు ప్రచారాలే పైచేయిగా ఉన్నాయి. ఆర్థిక రంగంపై బడా కార్పొరేట్ సంస్థలు, విదేశీ ఇన్వెస్టర్లకు పూర్తి పట్టును కల్పించి, అవ్యవస్థీకృత రంగం పాత్రను తుడిచిపెట్టే ప్రయత్నాలు కూడా విప్లవంగా రాణిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలన్నీ ఫర్‌సేల్ టాగ్‌తో మార్కెట్లోకి పోతున్నాయి. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌ల్లో సుశిక్షితులైన వారు, సబాటికల్ లీవ్‌తో తర్ఫీదు పొందివచ్చిన వారు అన్ని కీలక విభాగాలను ఆక్రమిస్తున్నారు. దేశాన్ని విజయవంతంగా ఈ స్థితికి తీసుకువెళ్లడం 'న్యూ ఇండియా'కు సంకేతమైతే మోదీ లక్ష్యాన్ని సాధించినట్టే. ■



హజ్‌యాత్రను ప్రారంభించిన సీఎం చంద్రబాబుతో ముస్లిం మహిళ సెల్ఫీ

ముస్లింలకే 'మండలి' చైర్మన్

- స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- హజ్‌యాత్రకు వెళ్లే బస్సులను ప్రారంభించిన సీఎం

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శాసన మండలి చైర్మన్ పదవిని ముస్లిం సోదరులకే కేటాయించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ముస్లింలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. మక్కా యాత్రకు వెళ్లే యాత్రికులతో కూడిన బస్సులను గురువారం వెలగపూడి సచివాలయంలో సీఎం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. హజ్ గైడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మైనారిటీలను రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని చెప్పారు. కర్నూలులో ఉర్దూ విశ్వవిద్యాలయం మంజూరు చేయడం మైనారిటీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని అన్నారు. కడప, విజయవాడలో హజ్ భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లే వారు.. హైదరాబాద్ నుంచే నేరుగా వెళ్లేవిధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2810 మంది హజ్ యాత్రకు వెళ్లేందుకు ప్రభుత్వపరంగా సాయం అందిస్తున్నామని తెలిపారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధికి 2,840 కోట్లు కేటాయించామన్నారు. ముస్లిం యువతుల పెళ్లిళ్ల కోసం ఈ ఏడాది రూ.100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పెళ్లి రోజునే ముస్లిం మహిళలకు రూ.50 వేల సాయం అందేవిధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. తాను కూడా అదే రోజు పెళ్లి శుభాకాంక్షలు తెలుపుతూ మెసేజ్ పంపుతానని చెప్పారు. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద ముస్లిం విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించామని తెలిపారు. ముస్లింల్లో విద్యాభివృద్ధికి రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఆనందంగా ఉండేందుకు హజ్ యాత్రలో ప్రార్థనలు చేయాలని సూచించారు. హజ్ యాత్రకు వెళ్లేవారితో బస్సులోకి వెళ్లి ముచ్చటించారు. హజ్ కమిటీ చైర్మన్ మొమిన్ అహ్మద్ హుస్సేన్, డైరెక్టర్ హాజీ షేక్ హసన్ బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు ఐదు విమానాల్లో జెడ్డాకు వెళతారు.



కాంగ్రెస్‌తో ఇక జట్టుకట్టం

బెంగాల్లో పొత్తు తప్పే.. పునరావృతం కానివ్వం
మళ్లీ రాజ్యసభ నేను కోరలేదు.. కేంద్ర కమిటీ నిర్ణయం శిరోధార్యం
మోదీ విధానాలతో ప్రమాదం.. సీపీఎం అగ్ర నేత ఏచూరి స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోకూడదని వైజాగ్ మహాసభల్లో నిర్ణయం తీసుకున్నాక.. పశ్చిమ బెంగాల్‌లో ఆ పార్టీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం తప్పేనని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంగీకరించారు. ఇక ఆ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని స్పష్టం చేశారు. అయితే ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో కలిసి పోరాటం చేయడానికి అభ్యంతరం లేదన్నారు. 12 ఏళ్ల రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి ఇటీవలే పదవీవిరమణ చేసిన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలివీ..

12 ఏళ్ల రాజ్యసభ అనుభవం మీకు నేర్పిందేమిటి..?

అసలు నేను పార్లమెంటుకు వెళ్తాననే అనుకోలేదు. సోమనాథ్ చటర్జీని లోక్‌సభ స్పీకర్‌ను చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆ సమయంలో పార్లమెంటులో పార్టీ గొంతు వినిపించడానికి రాజ్యసభకు వెళ్లాలని జ్యోతిబసు కోరడంతో 2005లో సభలో అడుగుపెట్టాను. పార్టీ విధానాలను ప్రచారంలోకి తీసుకురావడమే కాకుండా నా శక్తి మేరకు ప్రజలకు మేలు చేయడానికి ప్రయత్నం చేశాను. ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేయడంపైనే ఎక్కువ దృష్టి సారించాను. పార్లమెంటు సమావేశాలు 100 రోజులు జరిపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం కొంత అసంతృప్తిని మిగిల్చింది.

మూడోసారి రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నించారన్న ప్రచారం ఉంది?

పార్టీ నియమావళి ప్రకారం రెండు సార్లుకు మించి రాజ్యసభకు వెళ్లడానికి లేదు. విశాఖ మహాసభల్లో నేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కాగానే.. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానన్నాను. కేంద్ర కమిటీ అంగీకరించలేదు. బెంగాల్ నుంచి నేను రాజ్యసభకు మళ్లీ పోటీకి దిగితే.. ఎవరూ నిలబడరని, అది ఆ రాష్ట్ర రాజకీయాలకు ఉపయోగపడుతుందని ఆ రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. కేంద్ర కమిటీ చర్చలు జరిపి ఓటింగ్ పెట్టింది. చివరకు పార్టీకి ఏది మంచిదనిపిస్తే అదే పాటిస్తున్నాం.

కాంగ్రెస్‌తో మీకు ఒప్పందం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి?

నేను పోటీచేయాలని కాంగ్రెస్ నుంచే కాదు.. బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ నుంచీ ఇదే ప్రతిపాదన వచ్చింది. అక్కడ కాంగ్రెస్, లెఫ్ట్ ఓట్లు కలిస్తేనే గెలిచే చాన్సు ఉంది. విడిగా పోటీచేస్తే గెలవరు. ఇక లోపాయకారీ ఒప్పందాలంటారా.. అణు ఒప్పందం విషయంలో కాంగ్రెస్‌ను నేను వ్యతిరేకించినంతగా ఎవరూ వ్యతిరేకించలేదు. మన్మోహన్ ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తూ షైనింగ్ ఇండియా, సఫరింగ్ ఇండియా పేరుతో రెండు భారత దేశాలను సృష్టిస్తున్నారని విమర్శిస్తూ ఆ స్లోగన్ తెచ్చిందే నేను. అలాంటిది కాంగ్రెస్‌తో కలిసిపోయాననడం సరికాదు. ఇకపై ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు గానీ, అవగాహన గానీ చేసుకోం. ఆందోళనలు, నిరసనలు మాత్రం కలసి చేస్తాం. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల మేం పోటీ చేయలేని పరిస్థితి ఉంటే అక్కడ బీజేపీయేతర, తృణమూలేతర పార్టీకి మద్దతు ఇవ్వాలనుకోవడంతో కాంగ్రెస్‌కు ఇచ్చారు తప్ప ప్రత్యేకంగా అక్కడ పొత్తు పెట్టుకునే ఉద్దేశం మాకు లేదు. అయితే అది ఉమ్మడి పోరులా ప్రచారం జరిగింది. అది తప్పని ఒప్పుకొన్నాం కూడా.. తప్పు చేశారని బెంగాల్ కమిటీకి సెంట్రల్ కమిటీ చెప్పింది. మోదీపై ఎలా పోరాడాలో మా సెంట్రల్ కమిటీ నిర్ణయిస్తుంది. ఎన్నికల తరువాత అప్పటి పరిస్థితులను బట్టి బయట నుంచి మద్దతివ్వాలో లేదో నిర్ణయిస్తాం.

తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారా?

కొత్తగా రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో మొదట విశాఖలో మహాసభలు నిర్వహించాం. ఇప్పుడు హైదరాబాద్‌లో పెట్టాలని భావిస్తున్నాం. తెలంగాణలో పార్టీని బాగా ఆదరిస్తున్నారు. ఈ మధ్య పార్టీ చేపట్టిన పాదయాత్రకు భారీ స్పందన వచ్చింది.

మీరు ప్రధాన కార్యదర్శి అయ్యాకే సీపీఎం ప్రతిష్ఠ దిగజారిందని..?

ఒక వ్యక్తి ఆధారంగా మా పార్టీ పనిచేయదు. అన్ని నిర్ణయాలూ సమష్టిగా తీసుకుంటాం తప్ప ఒక వ్యక్తి ఇష్టానుసారం నిర్ణయం తీసుకోం.

పార్టీలో అంతర్గత విభేదాలు, ప్రచ్ఛన్న యుద్ధం వాస్తవం కాదా..?

సీపీఎంలో అభిప్రాయ భేదాలుంటాయి. అంతర్గత యుద్ధాలకు తావులేదు.

మోదీ విధానాలను రాబోయే రోజుల్లో ఎలా ఎదుర్కొబోతున్నారు..?

మోదీ విధానాల వల్ల ప్రధానంగా నాలుగు అంశాల్లో నష్టం ఏర్పడబోతుంది. రాజకీయ లాభం కోసం మతోన్మాద ఘర్షణలు, దాడుల వల్ల సామాజిక ఐక్యతకు పెనుముప్పు వాటిల్లుతుంది. మన్మోహన్‌సింగ్ విధానాల కంటే దారుణమైన ఆర్థిక విధానాలను మోదీ అవలంబిస్తున్నారు. న్యూ ఇండియాలో రెండు భారత్‌లు కనిపిస్తున్నాయి. వాటిలో స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. మరోవైపు సమాఖ్య విధానాలపై దాడి జరుగుతోంది.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒక సీఎం (త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్) ప్రసంగాన్ని రికార్డు చేసి ప్రసారం చేయకుండా దాన్ని మార్చాలనడం అత్యవసర పరిస్థితిలోనూ చూడలేదు. విదేశాంగ విధానం సైతం ప్రమాదకరంగా తయారైంది. అమెరికాకు మోదీ జూనియర్ పార్టనర్‌గా మారారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకు రావడానికి ఏం ప్రయత్నాలు చేస్తున్నారు?

పూర్వవైభవం తేవాలంటే ప్రజా ఉద్యమాలను బలపరుచుకోవడం తప్పితే వేరే మార్గం లేదు. సామాజిక దాడులు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి.. ప్రజలకు చేరువవ్వాలని చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లో లాల్ జెండా.. నీల్ జెండా నినాదాలతో ముందుకెళుతున్నాం. ప్రజాసంఘాలనూ కలుపుకొని వెళ్తాం.

యూపీ ఎన్నికల తర్వాత బీజేపీ విశ్వాసంతో ఉంది..?

2014 ఎన్నికలతో పోల్చితే యూపీలో బీజేపీ ఓట్లు 3శాతం తగ్గాయి. ఉత్తరాఖండ్‌లో 10 శాతం తగ్గాయి.. పంజాబ్‌లో అధికారం కోల్పోయింది. ప్రతిపక్షాల్లో ఐక్యత లేకపోవడం వల్లే యూపీలో విజయం సాధించగలిగింది. 2014లో 31 శాతం ఓట్లు వచ్చాయి. ఎన్డీఏ పార్టీల ఓట్లు కూడా కలిపితే 37శాతమే! అంటే 63 శాతం వ్యతిరేకత ఉంది. ఆయా శక్తులను కలుపుకుని, ఐక్యత తీసుకురాగలిగితే తప్పక విజయం సాధిస్తాం. నోట్ల రద్దు అంశం, జీఎస్టీ వంటి అంశాలు వచ్చే ఎన్నికల్లో మాకు కలిసొస్తాయి.

ఏపీ, తెలంగాణలో ఇద్దరు చంద్రుల పాలన ఎలా ఉంది?

వారి పాలన ప్రజావ్యతిరేకంగానే ఉంది. ప్రజలకు ఏదో చేస్తామని డాబుగా చెప్పిన చంద్రబాబు క్షేత్రస్థాయిలో ఏమీ చేయడం లేదు. మూడేళ్ల క్రితం బీజేపీతో ఎందుకు వెళ్తున్నారని ఆయన్ను అడిగాం. రాష్ట్రంలో మేం.. కేంద్రంలో మోదీ వస్తున్నారు.. రాష్ట్రానికి మేలు జరుగుతుందని చెప్పారు. కానీ ఇంతవరకు ప్రత్యేక హోదా, ప్యాకేజీ ఏదీ రాలేదు. మరోవైపు తెలంగాణలో ఎన్నో వాగ్దానాలు చేశారు. భూమి పంచుతాం, కొలువులిస్తామని చాలా చెప్పారు. ఒక్కటీ జరగలేదు. దీంతో అక్కడ మా పార్టీ చేసే పోరాటం వల్ల కచ్చితంగా లాభపడతాం.



ఉద్యాన మేళాలో మొక్కలకు నీరు పోస్తున్న సీఎం చంద్రబాబు

కోటి ఎకరాల్లో ఉద్యాన సాగు

- సేంద్రియ, ఉద్యాన మేళాలో చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటల సాగును 40 లక్షల ఎకరాల నుంచి కోటి ఎకరాలకు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. ఇందుకోసం ప్రభుత్వం ఎంత ఖర్చయినా భరిస్తుందని, అన్నివిధాలుగా సహకరిస్తుందని స్పష్టంచేశారు. సాధారణ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటల వల్ల ఆదాయం భారీగా పెరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ఎరువులు, మందుల వాడకాన్ని తగ్గించి.. సేంద్రియ పంటల సాగును పెంచాలన్నారు. భవిష్యత్‌లో సేంద్రియ పంటలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఏపీ ఉద్యానశాఖ, సీఐఐల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో మొట్టమొదటిసారిగా ఏర్పాటుచేసిన సేంద్రియ, ఉద్యాన మేళాలో సీఎం పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసి సభలో ప్రసంగించారు. ఉద్యాన పంటల్లో గతేడాది 17% ఆదాయం పెరిగిందని, ఇకపై ఏటా 33%పెరగాలని అధికారులకు స్పష్టంచేశారు. 33% వృద్ధి వస్తే రాష్ట్రం ఉద్యాన పంటల కేంద్రంగా మారి, ప్రపంచంలోని అన్ని దేశాలకు మన పండ్లు ఎగుమతి అవుతాయని అన్నారు. బిందు, తుంపర సేద్యం కూడా పెరగాలని, దీనివల్ల దిగుబడి పెరగడంతో పాటు, నీటి వినియోగమూ తగ్గుతుందని చెప్పారు. కడియం నర్సరీ ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిందంటూ ఆ నర్సరీ రైతులను సీఎం అభినందించారు. త్వరలోనే వారితో సమావేశం ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు. రైతు ఉత్పత్తి సంఘాల సంఖ్య పెరగాలని సీఎం సూచించారు. రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మారుస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో రైతులు చితికిపోయారని, సకాలంలో కరెంటు లేక పొలాల్లో జాగారాలు చేశారని అన్నారు. తన పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి, ఎంత భారమైనా రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. గత ప్రభుత్వంలో ఎరువుల కోసం లాఠీదెబ్బలు తినాల్సి వచ్చేదని, ఇప్పుడు ఎక్కడైనా ఎరువుల కొరత ఉందా అని ప్రశ్నించారు. ఉత్తమ నర్సరీ రైతులు పళ్ల వెంకటేష్, డి.రాజ్‌కుమార్, పుల్లా వీరవెంకట్రావు, ఉత్తమ సేంద్రియ ఉత్పత్తి రైతులు ఐ.రాజేష్, ఆరుమళ్ల సాంబిరెడ్డి, కె.కృష్ణంనాయుడులను ఆయన అభినందించారు.

రైతులకు ఉచిత విత్తు!

- లక్షన్నర క్వింటాళ్లు సిద్ధం

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణం వల్ల పంట వేయలేకపోయిన రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని సీఎం చంద్రబాబు గత నెలలో ఆదేశించారు. ఉచిత విత్తనాల పంపిణీ కోసం రూ.105 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో లక్షన్నర క్వింటాళ్ల విత్తనాలను నూరుశాతం రాయితీపై ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతపురం, కర్నూలు. కడప, చిత్తూరు, ప్రకాశం, విజయనగరంతోపాటు నెల్లూరు జిల్లా రైతులకు కూడా రాయితీ విత్తనాలు అందిస్తారు.

పోలవరానికి మరో 979కోట్ల నిధులు

(మొదటి పేజీ తరువాయి)

విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించింది. జాతీయ ప్రాజెక్టులన్నింటికీ కేంద్రం 70 నుంచి 90 శాతం నిధులను అందిస్తోంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగినందున పోలవరం నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని భరించడానికి కేంద్రం ముందుకొచ్చింది. ప్రత్యేక హోదాకు బదులుగా ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా 2014 ధరల ప్రకారం పోలవరం నిర్మాణానికి అయ్యే ఖర్చును 100 శాతం తామే భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఈమేరకు సవరించిన అంచనాలను పంపాలని కేంద్రం రాష్ట్రాన్ని కోరింది. పూర్తి స్థాయిలో లెక్కలను తయారు చేయడానికి కొంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈలోగా గతంలో తాము ఖర్చు చేసిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని కోరింది. రాష్ట్రపతి ప్రమాణస్వీకారానికి ఇటీవల ఢిల్లీ వచ్చిన సీఎం చంద్రబాబు పోలవరం నిధులపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సవరించిన అంచనాలు వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తామని జైట్లీ.. సీఎంకి హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా, జాతీయ స్థాయిలో ప్రాజెక్టుల నిర్మాణంపై అధ్యయనంలో భాగంగా హుకుంసింగ్ అధ్యక్షతన పది మంది పార్లమెంటు సభ్యులతో కూడిన బృందం శుక్రవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనున్నది. ఈ బృందం పోలవరం నిర్మాణ పనులనూ సమీక్షిస్తుంది. శనివారం విజయవాడలో పోలవరంపై సమీక్షను నిర్వహించిన అనంతరం ఈ కమిటీ విశాఖకు వెళ్తుంది. అక్కడ తోటపల్లి రిజర్వాయరుతోసహా పలు ప్రాజెక్టులపై కమిటీ సమీక్షిస్తుంది.

చర్చతో చెరువొచ్చింది!

- నెరవేరిన చిత్తూరు పల్లె జలకల
- 'ఏబీఎన్ బిగ్ డిబేట్'కు సీఎం
- ముఖాముఖిలో ఊరి సమస్య
- 4నెలల్లోనే బోదగుట్టపల్లెకి జీవం

(ఆంధ్రజ్యోతి - చిత్తూరు)

బోదగుట్టపల్లె... చాలా ఏళ్లుగా తాగునీటి సమస్యతో తల్లడిల్లుతున్న గ్రామం! పొరుగునున్న తమిళనాడు నుంచి ట్యాంకర్లు తెప్పించుకుని ఊరి జనం దాహార్తి తీర్చుకొంటున్నారు. ఈ ఒక్క ఊరే కాదు.. చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని పల్లెలదీ ఇదే కథ! ఇలాకాదని, బోదగుట్టపల్లె జనమంతా కలిసి బొట్టు బొట్టుగా వర్షపు నీరుని నిల్వ చేసుకునేందుకు నడుంకట్టారు. కాకపోతే అధికారుల చేయూత లేక.. ఆ ఆలోచన రూపం తీసుకోలేదు. సరిగ్గా అదే సమయంలో (గతేడాది ఆగస్టు 25) 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి బిగ్ డిబేట్' రూపంలో బోదగుట్టపల్లెకి ఒక అవకాశం వచ్చింది. బిగ్ డిబేట్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబుతో నిర్వహించిన ముఖాముఖీలో ఊరి సర్పంచ్ కేశాని గోవిందరాజులు పాల్గొని.. తమ సమస్యని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి.. అధికారులను అప్రమత్తం చేశారు. బోదగుట్టపల్లె తాగునీటి సమస్యని తక్షణం పరిష్కరించాలని అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. ఊరందరి శ్రమతో కుంట తయారైంది. తర్వాత కురిసిన వానలకు కుంట నిండటంతో ఊరంతా సంబరం చేసుకొంది. అయితే, ఆవాన వరదవడంతో..కుంట తెగిపోయి నీరంతా వెళ్ళిపోయింది. కుంటని మరింత పక్కాగా, పెద్దదిగా చేయాలని భావించారు. దానికోసం ఏడాదికాలంగా అధికారుల సహకారం కోరుతున్నామని సీఎంకి గోవిందరాజులు మొర పెట్టుకొన్నారు. గోవిందరాజులు విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం.. కుంటను సందర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో గత నవంబరులో రూ. 12 లక్షల అంచనాతో పనులు మొదలయి.. ఈ ఏడాది ఫిబ్రవరినాటికి ఊరి అవసరాలు తీరేలా.. లోతయిన పెద్ద చెరువు సిద్ధమయిపోయింది. తమ ప్రాంతానికి కొత్తజీవం పోసిన కొత్త చెరువుని అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఏబీఎన్- ఆంధ్రజ్యోతికి గోవిందరాజులు కృతజ్ఞతలు తెలిపారు.





బోదగుట్టపల్లెలో నిర్మించిన కొత్త చెరువు; (ఇన్‌సెట్) సర్పంచ్ కేశాని గోవిందరాజులు

రాగల 24 గంటల్లో

(మొదటి పేజీ తరువాయి)

శాఖ అంచనాతో రైతులు భారీగా సాగు చేపట్టారు. వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా జూన్‌లో తెలుగు రాష్ట్రాల్లో ఆశాజనంగా వర్షాలు కురిశాయి. వాతావరణ శాఖ ముందస్తు అంచనాలపై అందరిలో సంతృప్తి వ్యక్తమైంది. తీరా జూలై రెండో వారం నుంచి అంచనాలు తల్లకిందులు కావడం మొదలైంది. జూలై రెండో వారం నుంచి ఆగస్టు తొలి వారం వరకు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షాలు కురుస్తాయని పలు మార్లు వాతావరణ శాఖ బులెటిన్లు విడుదల చేసినా ఎక్కడా చినుకు రాలింది లేదు. ఆగస్టు తొలి వారంలో నైరుతి రెండో భాగంపై ఇచ్చిన బులెటిన్‌లో కూడా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని పేర్కొన్నారు. ఒకటి రెండు చోట్ల వర్షాలు కురవడం తప్ప ఇప్పటి వరకు ఎక్కడా సాధారణ వర్షపాతం నమోదైందే లేదు. దేశంలోని 36 సబ్ డివిజన్లలో వాతావరణంపై ఢిల్లీలోని భారత వాతావరణ శాఖ రోజుకు నాలుగు పర్యాయాలు బులెటిన్లు విడుదల చేస్తోంది. అనేక దేశాల నుంచి వచ్చిన సమాచారం, పుణెలో ఐఐటీఎం, శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారం, ఐఎండీలో నిపుణుల విశ్లేషణలు పరిగణనలోకి తీసుకుని ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి బులెటిన్లు ఇస్తోంది. ఈ బులెటిన్ల పరిధి విస్తృతంగా ఉండటంతో వాతావరణం అంచనాల్లో కచ్చితత్వం కష్టమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ప్రాంతీయ వాతావరణ కేంద్రాలు తమ పరిధిలో వాతావరణ బులెటిన్లు విడుదల చేసేందుకు రాడార్ ఛాయాచిత్రాలు, ద్రోణులు, ఉపరితల ఆవర్తనాలను పరిగణనలోకి తీసుకుంటాయి. పరిమిత స్థాయిలో వాతావరణాన్ని అంచనా వేసే ప్రాంతీయ కేంద్రాల అంచనాలు చాలా వరకు కచ్చితత్వంతో ఉంటాయి. అయితే ప్రాంతీయ కేంద్రాలు ఇచ్చే బులెటిన్లు కూడా తప్పిన సందర్భాలు ఉన్నాయి. ఎవరికి వారు కాకుండా.. ఢిల్లీ, ప్రాంతీయ కేంద్రాలు సమన్వయంతో వ్యవహరిస్తే బులెటిన్లలో కచ్చితత్వం పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వాతావరణ శాఖ అంచనాలు ఎక్కువ పర్యాయాలు తప్పాయి. దీనికి కారణం.. వాతావరణంలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న అనూహ్య మార్పులేనంటున్నారు వాతావరణ నిపుణులు. భారతదేశం ఉష్ణమండల ప్రాంతం కావడంతో ఆ మార్పుల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న అనూహ్య మార్పుల కారణంగానే ఉదయం ఇచ్చే బులెటిన్‌లో ఉన్న అంశాలు మధ్యాహ్నానికి మారిపోతుంటాయని పేర్కొన్నారు. యూరప్, అమెరికా శీతలప్రాంతాలు కావడంతో అక్కడ వాతావరణ మార్పుల ప్రభావం పెద్దగా ఉండదని ఫలితంగా వాతావరణ బులెటిన్లు దాదాపు కచ్చితత్వంతో ఉంటాయని చెబుతున్నారు.

వాతావరణ సూచనల్లో మరింత కచ్చితత్వం పెరిగేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని వాతావరణ నిపుణుడు ఆచార్య భానుకుమార్ అభిప్రాయపడ్డారు. ఇటీవలి కాలంలో వాతావరణ శాఖ ఇచ్చిన బులెటిన్లు, కురిసిన వర్షాలకు మధ్య చాలా తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై వాతావరణ శాఖ పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఇస్రో అంచనాలూ తప్పుతున్నాయా!

రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం మేరకు ఈ ఏడాది నుంచి ఇస్రో కూడా ముందస్తు వాతావరణ బులెటిన్లు విడుదల చేస్తోంది. కానీ వాటిలోనూ కచ్చితత్వం లోపిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈనెల 19న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వాయుగుండంగా మారి కోస్తా, దక్షిణ ఒడిసా మధ్య తీరం దాటుతుందని ఇస్రో వారం క్రితం అంచనా వేసింది. ఈనెల 17కే వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందన్న వాతావరణ శాఖ అంచనా మేరకు గురువారానికి ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అయితే ఇస్రో అంచనా మేరకు అది వాయుగుండంగా మారుతుందా? లేదా అనేది చూడాలి.

'సంఘ'టిత సాగు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడడంతో పరపతి పెరుగుతుంది. సమష్టి బాధ్యత ఉంటుంది కాబట్టి... బ్యాంకులు కూడా రైతులను గుర్తిస్తాయి. రుణాలు ఇస్తాయి. అంతే కాదు.. రైతు ఉత్పత్తి సంస్థలే ఎరువులు, పురుగు మందుల కంపెనీల నుంచి నేరుగా డీలర్‌షిప్ తీసుకుంటాయి. కల్తీ, నాసిరకం ప్రసక్తే ఉండదు. తమ సభ్యులకు తక్కువ ధరకే వాటిని అందిస్తాయి. తాము పండించిన పంటల మార్కెటింగ్ విషయంలో మంచి ధర వచ్చేలా పనిచేస్తాయి. రైతులకు అవసరమైన విస్తరణ సేవలనూ అందిస్తాయి. రైతు సంఘాలతోపాటు... గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘాలను, కౌలు రైతుల సంఘాలను విడివిడిగా ఏర్పాటు చేస్తారు. ఈ సంఘాలలో సన్న, చిన్నకారు, కౌలు రైతులకూ అవకాశం ఉంటుంది. రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. డ్వాక్రా సంఘాలకు అవసరమైన సహకారం అందించే సెర్ప్ ఆధ్వర్యంలోనే రైతు ఉత్పత్తి సంఘాలు, సంస్థలను ఏర్పాటు చేస్తారు.

విధి విధానాలు ఇలా...

రైతులందరినీ కలిపి కాకుండా... పంటల వారీగా, పక్క పక్క సర్వే నెంబర్లలో పొలాలున్న రైతులతో ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేస్తారు. ఇది గ్రామస్థాయిలో ఉండే ప్రాథమిక సంఘం. రైతులు ప్రతి నెలా తమ వంతుగా కొంత మొత్తాన్ని పొదుపు చేయాల్సి ఉంటుంది. శనగలు, మినుములు, వేరుశనగ, జీడిపప్పు, కొబ్బరి, పప్పు ధాన్యాలు, మామిడి, మొక్కజొన్న, వరి, చింతపండు, టమాట, కూరగాయలు, చేపల పెంపకం.. ఇలా ఏ పంటకు ఆ పంటల వారీగా ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేస్తారు. 100 నుంచి 150 వరకు రైతు ఉత్పత్తి సంఘాలను కలిపి... ఒక రైతు ఉత్పత్తి సంస్థ'గా (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేస్తారు. వీటిని పరస్పర సహకార సంఘాలుగా (మ్యాక్స్ చట్టం) రిజిస్టరు చేస్తారు. ఇవి రాష్ట్రంలో 157 వరకు ఏర్పాటవుతాయి. ఇందులో మొత్తంగా మూడు లక్షల మంది రైతులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలోని 150మండలాల్లో ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు. గ్రామీణ సమ్మిళిత వృద్ధి ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు ఇచ్చే నిధుల నుంచి రూ.640కోట్లను రైతు సంఘాలకు కేటాయిస్తారు.

ఇదీ సంఘటిత శక్తి...

ప్రభుత్వం ఎన్ని చెబుతున్నా కౌలు రైతులకు అరకొరగానే బ్యాంకు రుణాలు అందుతున్నాయి. బ్యాంకులు పంటమీదే రుణం ఇస్తాయి. ఒకవేళ పంట నష్టపోతే, కౌలు రైతు రుణం తిరిగి చెల్లించరేమో అనే ఆందోళనే దీనికి కారణం. అదే సొంత భూమి ఉన్న రైతు విషయంలో ఇలాంటి ఆందోళన ఉండదు. మరి... మహిళా సంఘాలకు మాత్రం ఎలాంటి హామీ లేకుండా రుణాలు ఇస్తున్నారు. దీనికి కారణం... సమష్టి బాధ్యత. సంఘం సభ్యులు తీసుకున్న అప్పును తిరిగి చెల్లించే బాధ్యతను ఆ సంఘమే తీసుకుంటుంది. అందువల్లే ఎలాంటి ష్యూరిటీలు లేకుండా రుణాలు ఇస్తున్నారు. ఇదే సూత్రం రైతులు, కౌలు రైతుల సంఘాలకూ వర్తించనుంది. ఒక్కో రైతు ఉత్పత్తి సంస్థలో సుమారు రెండువేలమంది వరకు రైతులుంటారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్ర పరికరాలు తదితరాల విక్రయ ఏజెన్సీలను సదరు సంస్థలకే ఇప్పించేలా ప్రభుత్వం మద్దతిస్తుంది. ఎరువుల డీలర్‌షిప్‌కు సంబంధించి ఇఫ్కో తదితర సంస్థలతో మాట్లాడుతుంది. రైతులకు వ్యవసాయంలో మెలకువలు, నూతన పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు రైతు సంస్థలను ఇక్రిశాట్, కృషి విజ్ఞాన కేంద్రాలతో అనుసంధానం చేస్తారు. రైతులకు శిక్షణ ఇప్పిస్తారు. అవసరమైన సమయాల్లో వ్యవసాయ నిపుణులే రైతుల పొలాలకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తారు. ప్రభుత్వ పథకాలు, వాటితో కలిగే లబ్ధి గురించి రైతులకు వ్యక్తిగతంగా అవగాహన లేకపోవచ్చు. అదే... సంఘంలో ఉంటే అన్ని విషయాలు తెలుస్తాయి. సంస్థ సిబ్బందే ప్రభుత్వ పథకాలను రైతుల పొలాల వరకు తీసుకొస్తారు.

రైతు ఉత్పత్తి సంస్థలకు మేలు చేసేలా పని చేయడం కోసం ఒక యంత్రాంగం కూడా ఉంటుంది. ఒక్కో సంస్థ కార్యకలాపాలను నిర్వహించేందుకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ప్రభుత్వం ఇద్దరు సిబ్బందిని నియమిస్తుంది. రెండేళ్లపాటు జీతాలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఆ తర్వాత వారి జీతాలను సదరు సంస్థే చూసుకోవాలి. ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్‌షిప్ కోసం ఈ సిబ్బందికే శిక్షణ ఇస్తారు. క్రయ విక్రయాలను కూడా వీరే చూస్తారు. అదే సమయంలో ఒక్కో రైతు ఉత్పత్తి సంస్థకు ప్రభుత్వం ఇచ్చే రివాల్వింగ్ ఫండ్ రూ.15 లక్షలు కూడా... సంస్థలోనే అంతర్గత రుణాల రూపంలో ఉంటుంది.

బంధం బలంగా

డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో మహిళలో మంచి చైతన్యం వచ్చింది. వారిలో నాయకత్వ లక్షణాలు, నిర్వహణా సామర్థ్యం పెరిగింది. అయితే... సంఘంగా ఏర్పడితే కలిగే లబ్ధి గురించి మహిళలకు వివరించాకే ఇదంతా సాధ్యమైంది. ఈ నేపథ్యంలో రైతు సంఘాల ఏర్పాటుకోసం ముందుగా కమ్యూనిటీ మొబిలైజేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు సెర్ప్‌ను ఆదేశించారు. సంఘాల వల్ల కలిగే లబ్ధిని రైతులకు వివరించి, ఆ దిశగా వారిని కదిలిస్తారు. దీనికి సంబంధించిన కసరత్తు మొదలైందని, కొన్నిచోట్ల బ్యాంకు ఖాతాలను కూడా ప్రారంభిస్తున్నామని సెర్ప్ సీఈవో కృష్ణమోహన్ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఫారం నెం. VII
(చట్టం నెం. 30/2013 లోని సెక్షన్ 19(1) మరియు రూలు 25(1) ప్రకారం)
రూఢి ప్రకటన

ఆర్.సి.నెం.5801/2015/ఙ1/CRDA తేది : 14.8.2017

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామములో గల ఎ. 69.03 సెంట్ల భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా "రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్" ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు నిర్మాణము చేయుటకు అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరములను దాఖలు చేసినందున చట్టం 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారము విచారణ మీదట మరియు ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు భూసేకరణకు అవసరమగు పైకము జమ చేసి యున్నందున సంతృప్తి చెందినవారై గుంటూరు జిల్లా కలెక్టరు గారు చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013) లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

రూఢి ప్రకటన

దిగువ షెడ్యూలులో పేర్కొనిన 69.03 ఎకరముల భూమి, చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013) లోని సెక్షన్ 19(1) ప్రకారము ప్రజాహిత కార్యక్రమాలకు అనగా రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్, ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు నిర్మాణము చేయుటకు అవసరమని గుంటూరు జిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించు చున్నారు.

షెడ్యూలు

ప్రాజెక్టుపేరు : రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్

గ్రామం : నెక్కల్లు మండలం : తుళ్ళూరు జిల్లా : గుంటూరు

క్ర. నెం	సర్వే నెం.	సబ్ డివిజన్	మొత్తము విస్తీర్ణము (ఎ.లలో)	సేకరించ వలసిన విస్తీర్ణము (ఎ.లలో)	భూమి స్వభావము	తరగతి	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు మరియు చిరునామా	హద్దులు ఉత్తరం సర్వే నెం.	తూర్పు సర్వే నెం.	దక్షిణం సర్వే నెం.	పడమర సర్వే నెం.	కట్టడములు, చెట్లు, బోరు మరియు ఇతరములు
1	17	సి2	0.010	0.010	పట్టా	మెట్ట	మందలపుడి రామనుజయ్య	17-సి1	17-సి1	172	17-బి	-
2	21	1	0.170	0.170	పట్టా	మెట్ట	ఆరుదల రామయ్య ఫైనల్ గార్డియన్ వరమ్మ మరియు పీర్సు	21-2	21-2	21-2	20	-
3	23	బి2	1.150	1.150	పట్టా	మెట్ట	పాటూరి కాంతి కళ మరియుఇదుగురు	23/బి1	23/బి1	20&21	23/బి1	-
4	55	ఎ2	1.320	1.070	పట్టా	మెట్ట	జాస్తి అరుణ హృదయ బాబు	54	89	55/బి	55-ఎ1	-
				0.040	పట్టా	మెట్ట	రామినేని సుబ్బారావు					
				0.210	పట్టా	మెట్ట	కొడెంత్తిన పిచ్చయ్య					
5	55	బి	1.150	0.520	పట్టా	మెట్ట	రామినేని సుబ్బారావు	55/ఎ1 &ఎ2	89	55/సి1 &సి2	56	-
				0.400	పట్టా	మెట్ట	కొడెంత్తిన పిచ్చయ్య					బావి-1 వేప చెట్లు-4
				0.230	పట్టా	మెట్ట	రాయపాటి జితేంద్ర					
6	55	సి2	0.960	0.960	పట్టా	మెట్ట	రాయపాటి జితేంద్ర	55/బి	89	55/డి2	55/సి1	వేప చెట్లు-1 తాటి చెట్లు-1
7	55	డి2	0.990	0.260	పట్టా	మెట్ట	రామినేని రామారావు	55/సి2	89	55/ఇ1 &ఇ2	55/డి1	-
				0.330	పట్టా	మెట్ట	రామినేని సరస్వతి					
				0.400	పట్టా	మెట్ట	రామినేని పూర్ణచంద్ర రావు					
.8	55	ఇ2	0.260	0.120	పట్టా	మెట్ట	రామినేని సరస్వతి	55/డి2	89	85	55/ఇ1	-
				0.140	పట్టా	మెట్ట	రామినేని పూర్ణచంద్ర రావు					తాత్కాలిక పశువుల షెడ్డు
9	56	3	3.430	0.090	పట్టా	మెట్ట	రావెల పార్వతి	56/1	55	56/4	57	-
				0.090	పట్టా	మెట్ట	రావెల వెంకయ్య					
				0.180	పట్టా	మెట్ట	అంబటి పద్మజ					
				0.090	పట్టా	మెట్ట	రావెల కోటేశ్వరరావు					
				0.840	పట్టా	మెట్ట	రావెల శ్రీనివాసరావు					రాతి స్తంభాలు-60 పశువుల షెడ్-1 ఫెన్సింగ్
				0.890	పట్టా	మెట్ట	రావెల లలిత కుమారి					ఉత్తర భాగాన, పశ్చిమ భాగన గేట్, తాత్కాలిక షెడ్లు-2
				0.380	పట్టా	మెట్ట	రావెల రామచంద్ర రావు					ఫెన్సింగు, రాతి పిల్లర్లు-60
				0.380	పట్టా	మెట్ట	రావెల రాంబాబు					ఫెన్సింగు, రాతి పిల్లర్లు-60
				0.360	పట్టా	మెట్ట	రావెల వెంకటేశ్వర్లు					-
				0.030	పట్టా	మెట్ట	రావెల సాంబశివరావు					
				0.100	పట్టా	మెట్ట	రావెల సుమతి					
10	57	2	4.405	1.025	పట్టా	మెట్ట	అబ్బూరి రామచంద్ర రావు	57/1	57/4	76& 77	58	-
				0.900	పట్టా	మెట్ట	అబ్బూరి శంకర రావు					
				0.900	పట్టా	మెట్ట	అబ్బూరి మోహన రావు					
				1.260	పట్టా	మెట్ట	అబ్బూరి హనుమాయమ్మ					
				0.320	పట్టా	మెట్ట	అబ్బూరి కోటేశ్వరరావు					ధ్యాన పిరమిడ్
11	58	2	0.680	0.680	పట్టా	మెట్ట	అబ్బూరి వినోద్	58/1	58/1	76	58/1	-
12	59		11.450	11.450	జామా	మెట్ట	ఎండోమెంట్ మరియు అబ్బూరిరజని, రామినేని రామారావు, పూజలపర్వవారేశ్వరి, రామినేనిమల్లేశ్వరి, రామినేనిస్వామిబాబు, రామినేనిపూర్ణచంద్ర రావు, రావెలశ్రీనివాసరావు, రావెలరామచంద్రరావు, రావెలరాంబాబు	45, 54	58	60	44&61	-
13	61	1	0.040	0.040	జామా	మెట్ట	ఎండోమెంట్(ధర్మాదాయ) మరియు సొరాజు పాపమ్మ, నెక్కంటి సుబ్బయ్య మరియు నలుగురు.	44	61/2	61/2	43	-
14	64	2	0.100	0.100	పట్టా	మెట్ట	పోలేరమ్మ వారి గుడి	64/1	64/1	64/1	64/1	పోలేరమ్మ గుడి, వేప చెట్లు-2 జమ్మి చెట్లు-1
15	65	2ఎ2	0.280	0.280	పట్టా	మెట్ట	పసుపులేటి శివ శంకరరావు	65/2ఎ1	70,71	65/2బి2	65/2ఎ1	-
		2బి2	0.720	0.720	పట్టా	మెట్ట	పసుపులేటి శివ శంకరరావు	65/2ఎ2 &2ఎ1	70,71	65/2బి1	65/2బి1	-
16	77	2	3.430	0.430	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ భరతారావు	57	77/4	80	76	-
				0.290	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ లక్ష్మీ నారాయణ					
				0.340	పట్టా	మెట్ట	కొల్లి రాజేశ్వరి					
				0.230	పట్టా	మెట్ట	కొల్లి సీతారామయ్య					తాటి చెట్లు-15 వేప చెట్లు-2
				0.340	పట్టా	మెట్ట	కొల్లి నాగేశ్వరరావు					వేప చెట్లు-27 తాటి చెట్లు-1
				0.220	పట్టా	మెట్ట	కొల్లి శివరామయ్య					తాటి చెట్లు-12
				0.210	పట్టా	మెట్ట	కొల్లి రాజేష్					వేప చెట్లు-1
				0.720	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ తాతారావు					తాటి చెట్లు-14
				0.650	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ సాంబశివరావు					తాటి చెట్లు -34
17	81	1	0.700	0.700	పట్టా	మెట్ట	యడ్లపాటి సాంబ్రాజ్యం	80/బి& 81-2	84& 81-2	82	80/బి &82	తాటి చెట్లు-4
18	89	1ఎ1	0.170	0.170	పట్టా	మెట్ట	ఆలూరి వెంకట రావు	89/2	88	89/1ఎ2	55	ఫెన్సింగు, సిమెంట్ స్తంభాలు-75 వేప చెట్లు-5
19	94	1	0.290	0.290	పట్టా	మెట్ట	దాసరి బుల్లెమ్మ	93	95	94/2	88	సిమెంట్ స్తంభాలు-26
20	96	2	0.150	0.150	పట్టా	మెట్ట	రాయపాటి జితేంద్ర	96/1	102	97/2	95&97/1	-
21	97	2	0.770	0.770	పట్టా	మెట్ట	రాయపాటి జితేంద్ర	96/2	102	100	97/1	-
22	104	ఎ1	0.260	0.260	పట్టా	మెట్ట	రామినేని శివరామయ్య ఫైనల్ గార్డియన్ రామమ్మ	105	104/బి	104/ఎ2	93	-
23	112	1	1.230	1.230	పట్టా	మెట్ట	అట్లూరి చిన్నప్ప రెడ్డి	108	113	112/2	111	-
24	113	1	0.510	0.510	పట్టా	మెట్ట	అట్లూరి చిన్నప్ప రెడ్డి	108	106	113/2	112	-
25	118	బి2	1.210	1.210	పట్టా	మెట్ట	మోదుగుల సంపూర్ణమ్మ	118/బి1	188/ఎ &బి3	118/బి3	123	-
26	120	ఎ	0.710	0.710	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ వినయ్ చౌదరి	101	119	120/బి	121/ఎ	-
		బి	0.700	0.700	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ వినయ్ చౌదరి	120/ఎ	119	120/సి	121/బి	ఉసిరి చెట్లు-1
		సి1	0.330	0.330	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ వినయ్ చౌదరి	120/బి	120/సి2	122/ఎ	121/సి	-
27	121	ఎ1	0.280	0.280	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ వినయ్ చౌదరి	99&100	121/ఎ2	121/బి1 &బి2	141	-
		బి1	0.230	0.030	పట్టా	మెట్ట	అబ్బూరి సాంబశివరావు	121/ఎ1	121/బి2	121/సి	141	
				0.100	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ భరతా రావు	121/ఎ1	121/బి2	121/సి	141	
				0.100	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ లక్ష్మీ నారాయణ	121/ఎ1	121/బి2	121/సి	141	
28	122	ఎ1	1.205	1.205	పట్టా	మెట్ట	బొప్పలగడ్డ మధుసూధన రావు	120& 121	119	122/ఎ2	141	-
29	136	2	1.140	1.140	పట్టా	మెట్ట	మోదుగుల ఈశ్వర రెడ్డి	136/1	136/1	132	136/1	-
30	137	ఎ	1.580	1.580	పట్టా	మెట్ట	తాటిచంద్రమౌళేశ్వర రావు	140	141	137/బి	138	ఒక1.5 హెచ్.పి గల బోరు.
31	138	ఎ1	1.570	1.570	పట్టా	మెట్ట	మోదుగుల ఈశ్వర రెడ్డి	147& 139	138/బి1	138/ఎ2	152	-
		బి1	1.570	1.570	పట్టా	మెట్ట	మోదుగుల ఈశ్వర రెడ్డి	139	138/సి	138/బి1	138/ఎ1	-
32	143	2	1.300	0.650	పట్టా	మెట్ట	బెరిగండుల కోటేశ్వరరావు	143/1	142	143/4	145	తాటి చెట్లు-81
				0.650	పట్టా	మెట్ట	బెరిగండుల బుల్లి బాబు					తాటి చెట్లు-42
33	147	బి1	1.730	0.500	పట్టా	మెట్ట	గుమ్మా శ్రీనివాసరావు	148 &147/ఎ	147/బి2	132	147/సి	సమాధులు-2 వేప చెట్లు -1
				0.240	పట్టా	మెట్ట	గుమ్మా వీరంజనేయులు					వేప చెట్లు-1
				0.160	పట్టా	మెట్ట	గుమ్మా లక్ష్మయ్య					వేప చెట్లు-1
				0.220	పట్టా	మెట్ట	ముప్పూరి చౌడేశ్వరరావు					ఒక షెడ్డు
				0.120	పట్టా	మెట్ట	ముప్పూరి వెంకటేశ్వరరావు					సమాధులు-2 వేప చెట్లు-1 షెడ్లు-1
				0.120	పట్టా	మెట్ట	ముప్పూరి వెంకట శ్రీనివాసరావు					జమ్మి చెట్లు-1
				0.120	పట్టా	మెట్ట	ముప్పూరి సాంబశివరావు					షెడ్డు-1
				0.250	పట్టా	మెట్ట	ముప్పూరి నారాయణమ్మ					షెడ్డు-1
34	147	సి	1.080	1.070	పట్టా	మెట్ట	గుమ్మా వెంకట రత్నం	148	147/బి1	132	150	సమాధులు- 2
				0.010	పట్టా	మెట్ట	తోరటి వీరయ్య					-
35	148	2	3.160	0.150	పట్టా	మెట్ట	గుమ్మా కృష్ణయ్య	148/1	147	147	148/1	పశువుల షెడ్డు-1
				1.250	పట్టా	మెట్ట	గుమ్మా కామేశ్వరమ్మ					షెడ్డులు-2
				0.250	పట్టా	మెట్ట	గుమ్మా శ్రీనివాసరావు					-
				0.510	పట్టా	మెట్ట	గుమ్మా లక్ష్మయ్య					షెడ్డు-1
				1.000	పట్టా	మెట్ట	గుమ్మా సుబ్బారావు					వేప చెట్లు-1, షెడ్డు-1
36	152	ఎ2	0.120	0.120	పట్టా	మెట్ట	కొల్లి సీతారామయ్య	152/ఎ1	152/ఎ1	153	152/ఎ1	-
37	153	బి1	0.490	0.490	పట్టా	మెట్ట	కొల్లిసీతారామయ్య	152/ఎ2	153/బి2	158	153/బి1	-
38	158		14.070	14.070	జామా	మెట్ట	ఎండోమెంట్ మరియు పరుచూరివెంకాయి, లక్ష్మిరోలు షేక్.జమీలా, గుమ్మాశివలేల, చదలవాడ చలపతిరావు, గుర్రప్పసాలరిబ్బెమ్మ, మేదూరిపిరరాజేశ్వరమ్మ, గుమ్మాశ్రీనివాసరావు, గుమ్మాలక్ష్మినారాయణ, పొటిబిబోరయ్య, షేక్. ఉసోల్, చదలవాడలక్ష్మీనాయమ్మ, చదలవాడసుబ్బారావు, గుమ్మా వెంకట్రావు, కురుకురి వెంకటనరసమ్మ	159& 153	154	157& 161	159& 160	వేపచెట్లు-2 జమ్మిచెట్లు-2 తాటిచెట్లు-1
39	161	బి1	1.920	1.900	పట్టా	మెట్ట	పోలువెంకటప్పారావు మరియు పోలురమేష్ బాబు	161/ఎ	157	161/బి2	160	-
				0.020	పట్టా	మెట్ట	గుమ్మా ఆదెన్న	161/ఎ	157	161/బి2	160	-
40	170	బి	0.010	0.010	పట్టా	మెట్ట	దగ్గుమాటి అంకమ్మ	170/బి	170/బి	170/బి	170/బి	-
		మొత్తము		69.030								

స్పెషల్ డిప్యూటీ కలెక్టరు మరియు భూసేకరణ అధికారి, నెక్కల్లు కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించు కొనవచ్చును.

ఈ భూసేకరణ వలన పునరావాస పునర్నిర్మాణము చేయవలసి వచ్చు కుటుంబముల సంఖ్య లేదు. కనుక పునరావాస స్థలము గుర్తించనవసరము లేదు. పునరావాస మరియు పునర్నిర్మాణ పథకము సంగ్రహ నివేదిక భూసేకరణ అధికారి నెక్కల్లు వారి కార్యాలయమునందు, ఏ.పి.సి.ఆర్.డి.ఎ వెబ్ సైట్ www.crda.ap.gov.in మరియు గుంటూరు జిల్లా కలెక్టర్ వారి వెబ్ సైట్ www.guntur.ap.gov.in నందు ఉంచబడినది.

ప్రాజెక్టు నిర్మాణ దశలో అవసరమైన భాగములో గనులు మరియు ఖనిజములు త్రవ్వుట / తొలగించుట / వినియోగించుట తప్ప భూసేకరణ షెడ్యూలు మిగిలిన భూములలో ఉన్న బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజములు అవసరము లేదు.

స్థలము : గుంటూరు
తేది : 14-08-2017

సం/- కోన శశిధర్,
జిల్లా కలెక్టరు, గుంటూరు జిల్లా

'రాజధాని' జోష్!



- లాభాల్లో రాజధాని ప్రాంత ఆర్టీసీ డిపోలు
- కృష్ణా, గుంటూరుల్లో 8 డిపోలకు కాసులపంట
- మిగిలినవాటిలోనూ తగ్గుతున్న నష్టాలు

విజయవాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంతంలో ఆర్టీసీ ప్రగతి చక్రం పరుగులు పెడుతోంది. నిన్నటి వరకు నష్టాల్లో ఉన్న రాజధాని ప్రాంత బస్ డిపోల్లో ఇప్పుడు రాజధాని జోష్ కనిపిస్తోంది. విజయవాడ జోన్ పరిధిలోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పలు ఆర్టీసీ డిపోలు లాభాలబాట పడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 127 బస్ డిపోలు ఉంటే గతంలో కేవలం మూడంటే మూడు డిపోలు మాత్రమే లాభాల్లో ఉండేవి. ప్రస్తుతం 16 డిపోల వరకు లాభాల బాటలో కొనసాగుతున్నాయి. వీటిలో సగం బస్ డిపోలు రాజధాని ప్రాంతానికి చెందినవి కావటం గమనార్హం. గుంటూరు రీజియన్‌లో అత్యధికంగా ఐదు బస్‌డిపోలు లాభాలతో నడుస్తున్నాయి. రాష్ట్రంలో ఈ రీజియన్ మొదటి స్థానంలో ఉంది. మూడు డిపోలతో కృష్ణా రీజియన్ రెండోస్థానంలో ఉంది.

నవ్యాంధ్ర ప్రదేశ్‌లో కొద్ది రోజుల క్రితం వరకు రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) సంక్షోభ పరిస్థితులలో ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఈ సంక్షోభం మరింత ఎక్కువైంది. రోడ్డు రవాణా సంస్థకు సమాంతరంగా రైల్వే వ్యవస్థ పోటీగా ఉండటం, ప్రైవేటు బస్సులు జోరు ఎక్కువగా ఉండటం వంటి కారణాల వల్ల ఆర్టీసీకి లాభాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఈ తరుణంలో ఆర్టీసీ నూతన ఎండీగా మాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. సంస్థాగతంగా నిర్వహణ వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం చేయటం, అంతర్గత సంస్కరణలు తీసుకురావటం వంటి చర్యలు చేపట్టారు. అవి సత్ఫలితాలను ఇచ్చాయి. ఈ క్రమంలో భాగంగా బస్ డిపోలు లాభాల బాట పట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా జూలై నాటికి 16 డిపోలు లాభాల్లో ఉన్నాయి. వీటిలో సగం డిపోలు రాజధాని ప్రాంతానివే.

గుంటూరు రీజియన్‌లో గుంటూరు - 1, గుంటూరు - 2, పొన్నూరు, రేపల్లె, తెనాలి, బాపట్ల, మంగళగిరి, నరసారావుపేట, చిలకలూరిపేట, మాచర్ల, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల మొత్తం 13 బస్ డిపోలు ఉన్నాయి. రెండున్నరేళ్ల కిందటి వరకు గుంటూరులో ఒకే ఒక్క బస్ డిపో మాత్రమే లాభాల్లో ఉండేది. ప్రస్తుతం గుంటూరు రీజియన్ నుంచి ఐదు బస్ డిపోలు లాభాల బాట పట్టాయి. గుంటూరు - 2 రూ.1.90 కోట్లు, మాచర్ల రూ.84.15 లక్షలు, నరసారావు పేట రూ.36.15 లక్షలు, తెనాలి రూ.59.54 లక్షలు, వినుకొండ రూ.11.54 లక్షల చొప్పున లాభాల్లో ఉన్నాయి.

కృష్ణా రీజియన్‌లో విజయవాడ, మచిలీపట్నం, జగ్గయ్యపేట, నూజివీడు, తిరువూరు, గుడివాడ, అవనిగడ్డ , గవర్నర్ పేట - 1 , గవర్నర్ పేట-2, విద్యాధరపురం, ఇబ్రహీంపట్నం, గన్నవరం, ఉయ్యూరు మొత్తం 14 బస్‌డిపోలు ఉన్నాయి. వీటిలో విజయవాడ డిపో రూ.6.65 కోట్లు, ఆటోనగర్ రూ.4.29 కోట్లు, మచిలీపట్నం రూ.45.98 లక్షల చొప్పున లాభాల్లో ఉన్నాయి. రాజధాని ప్రాంతంలోని మిగిలిన డిపోలూ నష్టాలను గణనీయంగా తగ్గించుకున్నాయి. ఒకప్పుడు కోట్ల రూపాయలలో నష్టం ఉంటే ఇప్పుడు అది లక్షల్లోకి వచ్చింది. గుంటూరు రీజియన్‌లో గుంటూరు-1, పొన్నూరు, రేపల్లె, బాపట్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల డిపోలు స్వల్ప నష్టాల్లో ఉన్నాయి. కృష్ణా రీజియన్ విషయానికి వస్తే.. జగ్గయ్యపేట, గన్నవరం, విద్యాధరపురం, అవనిగడ్డ డిపోలు స్వల్ప నష్టాల్లో ఉన్నాయి. త్వరలోనే ఇవీ లాభాలబాట పడుతాయని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

నేడే టెండర్లు?

- ప్రభుత్వ గృహ సముదాయంపై సీఆర్డీయే ఫోకస్
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు 4016 ఫ్లాట్లు
- 2018లోగా పూర్తి

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు కలిపి దాదాపు 2 లక్షల మందికి నివాస వసతి కల్పించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలకు కార్యరూపమిచ్చేందుకు ఏపీసీఆర్డీయే చకచకా ముందుకు సాగుతోంది. అమరావతి పరిపాలనా నగరంలో ఆయా వర్గాలకు ఉద్దేశించిన గృహ సముదాయాలకు ఈ సంస్థ శుక్రవారం టెండర్లు ఆహ్వానించనుందని విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ గృహ సముదాయాలను నిర్దిష్ట కాలవ్యవధిలోగా, నాణ్యతా ప్రమాణాలతో నిర్మించగలిగిన కంపెనీలను గుర్తించేందుకు టెండర్లకు సిద్ధమైంది. రూ.1991 కోట్లతో మొత్తం 4,016 ఫ్లాట్లను నిర్మించాలన్నది సీఆర్డీయే ప్రణాళిక. వీటిల్లో 3,820 ఫ్లాట్లను బహుళ అంతస్థుల అపార్ట్‌మెంట్లలో, మిగిలిన వాటిని కొద్ది అంతస్థుల్లో నిర్మిస్తారు. ఈ ఫ్లాట్ల విస్తీర్ణం ఆయా వర్గాల స్థాయిని బట్టి మారుతుంది. కాగా, ఈ ఏడాదిలోనే... అంటే రానున్న కొద్ది నెలల్లోనే కోటి చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే భవనాల నిర్మాణ పనులను సీఆర్డీయే ప్రారంభించాలనుకుంటోంది. ఇందులో సుమారు 70 లక్షల చదరపు అడుగుల్లో ప్రభుత్వ గృహ సముదాయం, మిగిలిన 30 లక్షల చదరపు అడుగుల్లో వివిధ గవర్నమెంట్ ఆఫీసుల కోసం భవనాలను అది నిర్మించనుంది.



శునకాలకు సూపర్ స్పెషాలిటీ!

- 12 లక్షలతో ఆధునిక వైద్య సదుపాయాలు
- అల్ట్రాసౌండ్, ఐవెట్ స్కోప్, ఎక్స్‌రే పరికరాలు
- విజయవాడ లబ్బీపేట పశువుల ఆస్పత్రిలో ఏర్పాటు
- సెప్టెంబరు చివరి కల్లా అందుబాటులోకి

విజయవాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మనుషులకు అత్యంత 'విశ్వాస మిత్రుడు' శునకం!! సరదాకో.. స్నేహానికో ఇటీవల 'పెట్'లను పెంచుకునే వారి సంఖ్య బాగా పెరిగింది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చిన వారిలోనూ ఇలాంటి జంతు ప్రేమికులు ఎక్కువే! వాటిని ఇంటిలో సొంత మనిషి కన్నా ఎక్కువగా చూసుకునే వారు చాలామందే ఉన్నారు. మరి అంత ప్రేమగా చూసుకునే శునకానికి ఏ అనారోగ్యమో వస్తే...? అంతర్గత భాగాల్లో సమస్యలు వస్తే వాటికీ సూపర్ స్పెషాలిటీ సేవలు అవసరమే!! దీన్ని దృష్టిలో పెట్టుకుని పెంపుడు కుక్కలతోపాటు చిన్నచిన్న జంతువులకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. విజయవాడ లబ్బీపేటలో గల పశువుల ఆస్పత్రిలో చిన్న జంతువుల కోసం హైటెక్ వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురాబోతోంది. రూ.12లక్షలతో అల్ట్రా సౌండ్ స్కానర్, ఐవెట్ స్కోప్‌ను కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ తరహా పరికరాలు రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ పశువుల ఆస్పత్రిలోనూ లేవు. గన్నవరంలోని వెటర్నరీ కళాశాలలో మాత్రమే ఉన్నాయి. విద్యార్థులు చేసే పరిశోధనలకు, ప్రయోగాలకు ఇవి ఉపయోగపడుతున్నాయి. చిన్న జంతుల్లో గుండె, కిడ్నీలు, పేగులు, కాలేయం వంటి భాగాలను అల్ట్రాసౌండ్ యంత్రం ద్వారా స్కాన్ చేస్తారు. పునరుత్పత్తి వ్యవస్థలో వచ్చే సమస్యలను గుర్తించడానికి ఐవెట్ స్కోప్‌ను ఉపయోగిస్తారు. కుక్కలకూ గర్భకోశ వ్యాధులు సంభవిస్తాయి. ఒక్కోసారి గర్భసంచి తొలగించాల్సి ఉంటుంది. పునరుత్పత్తిలో గల లోపాలను ఈ ఐవెట్ స్కోప్ గుర్తించవచ్చని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. సెప్టెంబరు నెలాఖరు నాటికి ఈ పరికరాలను ఏర్పాటు చేసి, వైద్య సేవలను అందుబాటులోకి రానున్నాయి. ఆ తర్వాత ఆక్సిజన్ థెరపీ యంత్రం కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.

కాలేజీల్లో 'సెట్' అయ్యేదెప్పుడు?

- బీఎడ్, లా, పీజీఈసెట్‌ల అభ్యర్థుల నిరీక్షణ
- ఫలితాలిచ్చినా విడుదలకాని కౌన్సెలింగ్ షెడ్యూలు
- ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యంపై విద్యార్థుల ఆందోళన

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): "నిర్ణీత సమయానికే అన్ని ప్రవేశ పరీక్షలు పూర్తిచేసి ఫలితాలు విడుదలచేస్తాం. ఆమేరకు కోర్సుల్లో ప్రవేశాలు చేపడతాం"... మంత్రి గంటా శ్రీనివాసరావు మూడు నెలల క్రితం చెప్పిన మాట ఇది. మంత్రి చెప్పినట్టుగానే పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి ప్రవేశ పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేసింది. ఇంజనీరింగ్, ఫార్మశీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల ప్రక్రియను కూడా పూర్తిచేసింది. కానీ కొన్ని 'సెట్'లకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితాలు విడుదలై నెలలు గడిచినా సీట్ల భర్తీ చేపట్టకపోవడంతో బీఎడ్, లా, పీజీఈసెట్ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మూడు, ఐదేళ్ల లా కోర్సుల్లో చేరేందుకు ఏప్రిల్ 19న లాసెట్ నిర్వహించి వెంటనే ఫలితాలు విడుదల చేశారు. కానీ ఇప్పటివరకు ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించలేదు. దేశంలో న్యాయ విశ్వవిద్యాయాల్లో ప్రవేశాలకు క్లాట్ నిర్వహించిన వర్సిటీలు ప్రవేశాలు పూర్తిచేశాయి. రాష్ట్రంలో లాసెట్‌కు అంతంత మాత్రంగానే విద్యార్థులు హాజరవుతున్నారు. ఇటువంటి తరుణంలో ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహణలో జాప్యంపై ఏయూకు చెందిన రిటైర్డు ఆచార్యుడొకరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు ఒకటి నుంచి ఫస్టియర్ తరగతులు నిర్వహిస్తే తప్ప సెమిస్టర్ పరీక్షలు సరైన సమయంలో నిర్వహించలేమన్నారు. ప్రవేశాల విషయంలో ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై లాసెట్ విద్యార్థులు మండిపడుతున్నారు. ఇక పీజీఈసెట్ మే 12న నిర్వహించి వెంటనే ఫలితాలు విడుదల చేసిన అధికారులు, కౌన్సెలింగ్‌ను గాలికొదిలేశారు. ఎంటెక్‌లో ప్రవేశం కల్పించడంపై నెలలకొద్దీ ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కల్పన విషయంలో జరుగుతున్న ఆలస్యం కాలేజీలకు, విద్యార్థులకు అసలుకే మోసం తెచ్చేలా ఉంది. రాష్ట్రంలో 45 వేల వరకు ఉన్న బీఎడ్ సీట్లలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 19న ఎడ్ సెట్ నిర్వహించారు. నాలుగు రోజుల తర్వాతే ఫలితాలూ ఇచ్చేశారు. పరీక్ష హాజరైంది 10 వేల మందిలోపే. అర్హత సాధించినవారు 8 వేల మందిలోపే. సీట్లన్నీ భర్తీ అయ్యే అవకాశమే లేని తరుణంలో కౌన్సెలింగ్ నిర్వహించడానికి మరింత ఆలస్యం చేయడంతో ఉన్న కొద్దిమందీ పక్క రాష్ట్రాలకు తరలి పోతున్నారు.

ఏపీకి 'స్వచ్ఛ విద్యాలయ'

పురస్కారం

- 1న ఢిల్లీలో అవార్డు ప్రదానం

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో జాతీయ స్థాయిలో మరో పురస్కారం దక్కింది. ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత-ఆరోగ్య ప్రమాణాలను మెరుగ్గా పాటిస్తున్న రాష్ట్రాలకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'జాతీయ స్వచ్ఛ విద్యాలయ' పురస్కారానికి రాష్ట్రం ఎంపికైంది. మొత్తం 24 రాష్ట్రాలు ఈ పోటీలో పాల్గొన్నాయి. తమిళనాడు నుంచి అత్యధికంగా 25, ఏపీ నుంచి 21, రాజస్థాన్ నుంచి 15 పాఠశాలలు ఎంపికయ్యాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన రాష్ట్రాలకు 'జాతీయ స్వచ్ఛ విద్యాలయ' పురస్కారాలను సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో బహూకరిస్తారు. ఒక్కో పాఠశాలకు రూ.50వేల చొప్పున నగదు ఇస్తారు. ఈమేరకు ఆయా రాష్ట్రాల విద్యాశాఖ సెక్రటరీలకు గురువారం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ లేఖలు పంపింది.



డిమాండ్‌లతో పోస్టర్లు విడుదల చేస్తున్న కాంట్రాక్టర్లు

20నుంచి రైల్వే కాంట్రాక్టర్ల సమ్మె బాట

- పాత పనులపై జీఎస్టీకి వ్యతిరేకంగా నిర్ణయం
- రాష్ట్రంలో 20వేల కోట్ల పనులపై ప్రభావం

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్టర్లు సమ్మెకు సిద్ధపడుతున్నారు. విజయవాడ, గుంటూరు రైల్వే డివిజన్ల పరిధిలో జరుగుతున్న కాంట్రాక్ట్ పనులను ఈనెల 20నుంచి నిలిపివేయనున్నారు. జూలై 1కి ముందు జరిగిన పనుల టెండర్లపైనా జీఎస్టీ వసూలు చేయడానికి నిరసనగా ఐఆర్ఐపీఏ(ఇండియన్ రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్) ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై కేంద్రం దిగి వచ్చేవరకు మొత్తం పనులు నిలిపివేయడానికి ఈ రెండు డివిజన్ల పరిధిలోని సుమారు 150 మంది కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. జీఎస్టీ అమలు తర్వాత ఖరారైన టెండర్లకే కాకుండా దానికి ముందు ఖరారైన పనులపైనా 18శాతం జీఎస్టీ వసూలు చేయాలని కేంద్రం నుంచి అధికారులకు ఆదేశాలందాయి. దీన్ని కాంట్రాక్టర్లు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. జీఎస్టీ రాకముందు పీవే (పర్మినెంట్ వే)పనులు ట్రాక్ మరమ్మతులు, నిర్మాణం వంటి వాటిపై ఎలాంటి పన్ను లేదు. తాజాగా కేంద్రం వీటినీ జీఎస్టీ పరిధిలోకి తీసుకెళ్లింది. పీవే పనులపై 18శాతం జీఎస్టీ వసూలు చేయడం మరింత భారంగా ఉందంటున్న కాంట్రాక్టర్లు కేంద్రం దిగి వచ్చే వరకు రైల్వేలోని అన్ని పనులనూ నిలిపివేస్తామని స్పష్టం చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను డీఆర్ఎం ధనంజయులు, ఏడీఆర్ఎం వేణుగోపాల్‌తోపాటు వివిధ విభాగ అధికారులకు గురువారం అందజేశారు. కాంట్రాక్టర్లంతా మూకుమ్మడిగా సమ్మెలోకి వెళ్తే దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో రాష్ట్రంలో జరుగుతున్న దాదాపు రూ.20వేల కోట్లకు పైగా పనులపై ప్రభావం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

నవ్య
కుటుంబ కదంబం

సొగసు


మేరికే కార్ల్‌సన్

'స్వాతంత్ర్య దినోత్సవానికి ఏ చీర కట్టుకుంటే బాగుంటుంది?' - తెలుసుకోవాలనుకున్నారు మన దేశంలో అమెరికా దౌత్యవేత్తగా పనిచేస్తున్న మేరికే కార్ల్‌సన్. అదే విషయాన్ని తన ట్విట్టర్ ఖాతాలో శారీసెర్చ్ హ్యాష్‌ట్యాగ్‌తో ట్వీట్ చేశారు. జామ్‌దానీ, దుపియన్, కంజీవరం, టస్సర్ చీరలను కట్టుకున్న వీడియోలను పోస్ట్ చేసి 'వీటిలో ఏ చీర బాగుంటుంద'ని అడిగారు. కంజీవరం, టస్సర్ చీరలకు ఎక్కువ మంది ఓటేశారు. దాంతో ఎర్రకోటకు కంజీవరం చీర, 'ఎట్ హోం' వేడుకలకు టస్సర్ చీర కట్టుకుని హాజరయ్యారు. కంజీవరం, టస్సర్, దుపియన్, జాన్‌దానీ చీరలు కాటన్, పట్టు రకాల్లో లభిస్తాయి. కాంతా, పువ్వుల వర్క్‌తో, పలు ప్యాటర్న్‌లలో ఆకట్టుకునేలా ఉంటాయి.

ఈ పట్టు ఆకట్టు









క్రిస్పీ దుపియన్

- దుపియన్ చీర క్రిస్ప్‌గా ఉండే రకం సిల్క్ ఫ్యాబ్రిక్. నేత చిక్కగా ఉంటుంది. చీర కాస్త బరువుగా ఉంటుంది. దుపియన్‌లో అల్లిక, చారలు, పువ్వులు వంటి డిజైన్లు ఉంటాయి. అంతేకాదు నచ్చిన ఎంబ్రాయిడరీ చేయించుకున్నా సూపర్‌గా ఉంటుంది దీనిపైన.
- దుపియన్ చీరల్ని వారణాసి చుట్టుపక్కల గ్రామాల వాళ్లు ఎక్కువగా నేస్తారు. వారిలో అన్సారీ తెగకి చెందిన వాళ్లు ఈ ఫ్యాబ్రిక్‌ను తరతరాలుగా ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని పెళ్లిళ్లకోసం ఎక్కువగా తీసుకుంటారు. ఆ సీజన్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది.

జబర్దస్త్ జామ్‌దాని

- బెంగాల్‌కి చెందిన జామ్‌దానీ రకం ఫ్యాబ్రిక్ చాలా పలుచగా ఉంటుంది. కొన్ని శతాబ్దాలుగా బంగ్లాదేశ్ లోని ఢాకా జిల్లాలో ఇది తయారవుతోంది.
- జామ్‌దానీని ఢకాయ్ అని కూడా అంటారు. జామ్‌దానీ అనేది పర్షియన్ పదం. ఇందులో జామ్ అంటే పువ్వు, దానీ అంటే వేజ్ లేదా కంటెయినర్ అని అర్థం. పువ్వుల ప్యాటర్న్‌తో అలంకరిస్తారు కాబట్టి జామ్‌దానీ అంటున్నారు.
- జామ్‌దానీలో చీరలే ఎక్కువగా కనిపిస్తుంటాయి. వాటితో పాటు స్కార్ఫ్‌లు, హ్యాండ్‌కర్చీఫ్‌లు కూడా తయారుచేస్తారు. వీటిమీద ఎక్కువ పనిచేయాల్సి ఉంటుంది. అందుకని ధర ఎక్కువగానే ఉంటుంది.

సంప్రదాయ కాంచి

- కంజీవరం లేదా కాంచీపురం అని పిలిచే ఇవి సిల్క్ చీరల్లో ఒక రకం. తమిళనాడులోని కాంచీపురం ప్రాంతంలో తయారవుతాయి. దక్షిణ భారత బెనారసీ చీరలుగా ఇవి ప్రసిద్ధి.
- స్వచ్ఛమైన మల్బరీ సిల్క్ దారంతో ఈ చీరలు నేస్తారు. ఈ చీరల్లో వాడే జరీ గుజరాత్ నుంచి వస్తుంది. అసలైన కంచీపురం సిల్క్ చీరను, దాని అంచును విడివిడిగా నేస్తారు. ఆ తరువాత రెండింటినీ కలుపుతారు. చీర చిరిగిపోయినా ఇవి విడిపోవు. అంచును కూడా విడదీయలేం.

టెంపుల్ బోర్డర్లు, చెక్స్, చారలు, పువ్వుల బుటాలు వంటి సంప్రదాయ డిజైన్లు ఉంటాయి. దక్షిణ భారత దేవాలయాలు, ప్రకృతిలోని ఆకులు, పక్షులు, జంతువులతో కూడిన ప్యాటర్న్‌లు ఉంటాయి. చీర కొంగులో రాజారవివర్మ పెయింటింగ్‌లు, మహాభారతం, రామాయణం లోని చారిత్రక ఘట్టాలు ఉంటాయి. పని తీరును బట్టి, రంగు, వాడిన జరీ(బంగారు) బట్టి వీటి ధర ఉంటుంది.

బ్యూటీ టస్సర్

- టస్సర్ సిల్క్‌నే సంస్కృతంలో కోసా సిల్క్ అంటారు. పట్టుపురుగుల్లోని కొన్ని జాతుల లార్వాలను వీటి తయారీలో వినియోగిస్తారు. చైనా, ఇండియా, జపాన్, శ్రీలంకల్లో పలు రకాల టస్సర్‌ను తయారుచేస్తారు.
- ఈ మధ్య పట్టు పురుగులను చంపకుండా 'అహింస సిల్క్' అని తయారవుతున్న విషయం తెలిసిందే.
- టస్సర్ సిల్క్ లేదా ఇతర సిల్క్ వస్త్రం ఏదైనా డ్రైక్లీనింగ్ చేయించాల్సిందే. డ్రైక్లీన్ చేసిన వస్త్రాన్ని ప్లాస్టిక్‌లో చుట్టి పెట్టకూడదు. సిల్క్‌కి గాలి తగలడం చాలా అవసరం.
- ఒకవేళ టస్సర్‌ను ఇంట్లోనే శుభ్రం చేసేట్టయితే చల్లటి నీళ్లు, మైల్డ్ లిక్విడ్ సబ్బు లేదా షాంపూ వాడాలి.

డెంటల్ కేర్

మెరిసిపోండి!

దంతాలు ముత్యాల్లా మెరుస్తుంటే...అది మన ముఖానికి మరింత అందాన్ని తెచ్చిపెడుతుంది. అందుకే ఆరోగ్యమైన, మెరిసే దంతాలకు కొన్ని టిప్స్ పాటించండి. అవి...

- రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలి.
- దంతాలు దెబ్బతినకుండా డిసెన్సిటైజ్ టూత్‌పేస్టును వర్షాకాలంలో వాడాలి.
- చక్కెర పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, ప్రిజర్వేటివ్స్ వినియోగాన్ని తగ్గించాలి.
- టూత్‌బ్రష్‌లను రెండు నెలలకొకసారి మారుస్తుండాలి. అలా కాకుండా పాత బ్రష్‌నే వాడడం వల్ల పళ్ల సందుల్లో, నోటి లోపల ఇరుక్కుపోయిన ఆహారపదార్థాలు బయటకు పోకుండా అలాగే ఉండి ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి.
- పోషకాహార పదార్థాలు, సీజనుకు తగిన డైట్ తీసుకోవాలి. వర్షాకాలంలో రకరకాల ఫ్రూట్స్ దొరుకుతాయి. వాటిని తింటే కావల్సిన పోషకాలు దంతాలకు అందుతాయి. అలాగే సూప్స్ తాగితే మంచిది. బాదం, మొక్కజొన్నపొత్తులు, స్ట్రాబెర్రీలు బాగా తినాలి.
- చిగుళ్ల నుంచి రక్తం కారకుండా సి-విటమిన్, యాంటాక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్న ఫుడ్స్ తినాలి. అలాగే పైనాపిల్, కీరకాయల్లాంటివి తింటే దంతాలు పటిష్ఠంగా ఉంటాయి.



- పిల్లలకైతే దంతాలు దెబ్బతినకుండా మౌత్‌గార్డు వాడాలి.
- షుగర్ బాగా ఉండే స్పోర్ట్సు డ్రింకులు తాగితే అందులోని యాసిడ్ దంతాలను దెబ్బతీస్తుంది. అందుకే వాటికి బదులు కొబ్బరి నీళ్లు, తాజా పళ్లరసం తీసుకోవాలి.
- నాన్ -ఆల్కహాల్ మౌత్‌వాష్ వాడితే నోరు శుభ్రంగా ఉంటుంది.
- వేడి వేడిగా కాఫీ, టీ, సూపులను తాగొద్దు. అలా తాగితే దంతాల సున్నితత్వం దెబ్బతింటుంది.
- దంతాల నొప్పి తగ్గకుండా బాధిస్తుంటే వెంటనే దంతవైద్యుని సంప్రదించాలి.

హెల్దీ వెయిట్

నియంత్రణ ఇలా..

బరువు పెరగడం, తగ్గడం కన్నా బరువు నియంత్రణలో ఉంచుకోవడం చాలా కష్టం. ఆరోగ్యకరమైన బరువు ఉండటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారా? ఈ కింది వాటిని ప్రయత్నించండి. శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడానికి ఈ సూచనలు బాగా ఉపయోగపడతాయి.

తగినంత కార్బోహైడ్రేట్లు : బరువు నియంత్రణలో ఉండాలంటే రోజూ తగినన్ని కార్బోహైడ్రేట్లు చాలా అవసరం. బరువు పెరుగుతున్నామని కార్బోహైడ్రేట్లు తీసుకోకుండా ఉండటం సరియైనది కాదు.

పండ్లు : ఆపిల్స్, పీర్స్, బెర్రీలు వంటివి తీసుకోవాలి. ఈ పండ్లలో ఫ్లేవనాయిడ్స్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి మంచి యాంటీ ఆక్సిడెంట్లుగా ఉపయోగపతాయి. వీటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి.

పీచుపదార్థాలు అధికంగా...: ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు రోజు వారి మెనూలో ఉండేలా చూసుకోవాలి. లీన్‌ప్రొటీన్ లభించే ఆహారం తీసుకోవడం వల్ల ఎక్కువ సమయం పొట్ట నిండుగా ఉన్న ఫీలింగ్ ఉంటుంది. ఫలితంగా మధ్య మధ్యలో ఆకలి వేయడం, చిరుతిళ్లు తినడం తగ్గుతుంది.

క్యాలరీలు లెక్కించండి : బరువు నియంత్రణలో ఉండాలంటే రోజు తీసుకునే క్యాలరీల పైన దృష్టి పెట్టాలి. దానికనుగుణంగా డెయిలీ మెనూ ప్లాన్ చేసుకోవాలి. వీక్లీ ప్లాన్ చేసుకోవడం వల్ల అధికంగా తినడం తగ్గించుకోవచ్చు.

పంచదారకు ప్రత్యామ్నాయం : పంచదారను నేరుగా వాడకుండా తేనె వంటి ప్రత్యామ్నాయ పదార్థాలను వాడటంపై దృష్టి పెట్టాలి. బరువు పెరగడానికి పంచదార ముఖ్య కారణమవుతుందని గుర్తుంచుకోవాలి.


బ్రేక్‌ఫాస్ట్ మరువద్దు : బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా ఉండకూడదు. రోజూ పోషకాలతో కూడిన బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం వల్ల జీవక్రియల పనితీరు బాగుండి కొవ్వు చేరడం జరగదు.

అరగంట వ్యాయామం : ప్రతిరోజు అరగంట సమయం వ్యాయామానికి కేటాయించాలి. క్యాలరీలు ఖర్చు కావడానికి వ్యాయామం ఉపకరిస్తుంది. జీవక్రియల రేటు మెరుగుపడుతుంది.



శ్రీ రమణ కథామృతం

భిక్షాటనలో పరమానందం



ఆంధ్రజ్యోతి నివేదన

ధర్మపథం



ఏది నిజమైన సుఖం?


దైవమార్గం

మానవ ప్రేమే.. దేవుని ప్రేమ!



సందేశం

చెడును నివారించు నేస్తం!



సందేహం

కాశీలో వదిలేసేది...



ప్రవాస భక్తి

ఆస్ట్రేలియాలో గిరిజనోత్సవం



డైలీ సుడోకు - 157

3	7	1			4			
	5		2			3		8
				3				
	9	3			7			
7	6						1	9
			9			7	8	
				9				
1		6			3		4	
			8			2	3	1


ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ

నిన్నటి సుడోకు- 156 సమాధానం

నవజీవన వేదం



తొలగించాల్సినవి ఎన్నెన్నో!



మెగా మేనల్లుడితో..



సాయిధరమ్‌తేజ్, కరుణాకరన్, కె.ఎస్.రామారావు



















ఆడియో ఆవిష్కరణ దృశ్యం



ఏం చేసినా నాన్నగారి స్ఫూర్తితోనే..

-బాలకృష్ణ

"అభిమానం అనేది పార్టీలకు అతీతమైంది. జోరున వర్షం పడుతున్నా ఇసుకేసినా రాలనంతమంది జనం అలాగే నిలుచోవడం అబ్బురపరచింది. అభిమానమనే ఆనకట్టను దాటుకుని వచ్చిన జనసందోహాన్ని చూస్తుంటే ఆనందంగా ఉంది. వర్షం ఆగిపోవాలనుకున్న నా సంకల్పం బలీయమైంది. రాజకీయాలు, సినిమా, సేవ.. ఏదైనా నాకు మా నాన్నగారే స్ఫూర్తి" అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన హీరోగా నటించిన 101వ చిత్రం 'పైసా వసూల్' ఆడియో వేడుక ఖమ్మంలో జరిగింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనందప్రసాద్ నిర్మిస్తోన్న చిత్రమిది. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ "అనూప్ రూబెన్స్ సంగీతం, భాస్కరభట్ల, పులగం చిన్నారాయణ రాసిన సాహిత్యం ఆకట్టుకుంటాయి. ఇందులో నేను ఓ పాట పాడాను. నాన్నగారి 'జీవితచక్రం' లోని.. కంటిచూపు చెబుతోంది... అనే పాటను రీమిక్స్ చేశాం. పాటలు హిట్ అయితే సినిమా సగం హిట్ అయినట్టే. 'పైసా వసూల్' తప్పకుండా విజయం సాధిస్తుంది. 100 సినిమాలు పూర్తయిన తర్వాత నేను చేస్తున్న సినిమా ఇది. తొలి సినిమాగా, నా రీలాంచ్ చిత్రంగా భావిస్తున్నాను. నటుడు అనేవాడు నిత్యావసరవస్తువులాంటివాడు. నా దృష్టిలో నటన అంటే కేవలం నవ్వడమో.. మరొకటో కాదు. నటుడు పరకాయ ప్రవేశం చేయాలి. చేసి మెప్పించగలగాలి. ప్రేక్షకులకు నచ్చని సినిమాలు తీసి, వారిపై రుద్దే అలవాటు మా నాన్నగారికి లేదు. నాకూ లేదు. నా దృష్టిలో ఆయనకు సాటి ఎవరూ లేరు. సమాజమే దేవాలయం అని నమ్మిన అన్నగారి స్ఫూర్తితో నేను నడుస్తున్నా. నా హిందూపురం వాసులకోసం నా చివరి రక్తపు బొట్టు వరకు కృషిచేస్తా. ముత్యాలు దొర్లితే ఎంత అందంగా ఉంటాయో.. అంత అందంగా సినిమా చేయగల దర్శకుడు పూరి జగన్నాథ్. నిర్మాత ఆనందప్రసాద్‌గారు ఆధ్యాత్మికవాది. 'శ్రీరామరాజ్యం' ఆడియో వేడుక భద్రాచలంలో జరిగింది. ఇప్పుడు 'పైసావసూల్' వేడుక ప్రేక్షకదేవుళ్ల మధ్య జరుగుతున్నందుకు ఆనందంగా ఉంది. ఎప్పటికైనా 'జగదేకవీరుడు కథ'లో శివశంకరీ.. శివానంద లహరి.. పాట పాడాలని కోరిక" అని అన్నారు. నిర్మాత ఆనందప్రసాద్ మాట్లాడుతూ " తెలుగుజాతికి బ్రాండ్ అంబాసిడర్ నందమూరితారకరామారావుగారు. ఏ తండ్రి అయినా కుమారుడు తన బాటలో నడవాలనుకుంటారు. పెద్దాయనలోని నిజాయతీని, సేవా తత్పరతను, రాజకీయ వారసత్వాన్ని, క్రమశిక్షణను అన్నిటిని బాలయ్యగారు పుణికిపుచ్చుకుని ఆ తండ్రికి ఆనందాన్ని కలగజేశారు. బాలయ్యగారితో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాం. ఆయన మాట ఇస్తే హరిశ్చంద్రుడు.. మాట తప్పినవారికి విశ్వామిత్రుడు" అని చెప్పారు.

మరో సినిమాకు రెడీ

బాలయ్యకు ఉన్నంత మొండితనం ఆయన అభిమానుల్లోనూ ఉంది. అరగంటపాటు ఆగకుండా వర్షం పడ్డా చెక్కుచెదరకుండా నిలుచున్న అభిమానులంతా కాళ్లు ముందుకు పెడితే దణ్ణం పెట్టుకోవాలని ఉంది. నా కెరీర్‌లో ఇన్నేళ్లకి బాలయ్యబాబుతో వర్క్ చేసే అవకాశం వచ్చింది. ఆయన ప్రేమనైనా, కోపాన్నైనా ముఖం మీదే చెప్పేస్తారు. ఆయన చూపించిన దూకుడు చూసి తొలి సినిమాకు పనిచేస్తున్నట్టు అనిపించింది. తల్లిదండ్రులంటే అంత ప్రేమ ఉన్న కొడుకును నేను ఎక్కడా చూడలేదు. ఎప్పుడూ సినిమాల గురించి, ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి ఆయన. ఆయన మీద పడ్డ అభిమానులను కొడుతుంటే దెబ్బలు తిన్నవారికి ఎంత ఇష్టంగా ఉంటుందో నాకు తెలుసు. బాలయ్యగారికి, వారి ఫ్యాన్స్‌కి ఉన్న అనుబంధం చాలా గొప్పది. ఇకపై బాలయ్యబాబు ఎవరైనా ఫ్యాన్‌ని కొడితే అది లవ్‌స్టోరీ అని మీడియా గుర్తుపెట్టుకోండి. ఆయన పిలిస్తే వెంటనే సినిమా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. -పూరి జగన్నాథ్

మానవతా సంబంధాలు, విలువలతో...



మంచు లక్ష్మి


'ఊ కొడతారా.. ఉలిక్కి పడతారా', 'గుండెల్లో గోదారి', 'దొంగాట' చిత్రాల తర్వాత మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మంచు లక్ష్మి నిర్మించే కొత్త చిత్రం షూటింగ్ గురువారం ఉదయం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో మొదలైంది. ఈ సినిమాతో విజయ్ యలంకంటి దర్శకునిగా పరిచయమవుతున్నారు. పూజ అనంతరం మంచు మనోజ్, ఆయన భార్య ప్రణతి, మంచు లక్ష్మి కుమార్తె విద్యా నిర్వాణ స్క్రిప్ట్‌ను మంచు లక్ష్మి, దర్శకుడు విజయ్‌కు అందించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత మా బేనరు నుంచి వస్తున్న సినిమా ఇది. నిజం కాని విషయాన్ని నిజంగా భావించే ఓ యువతి కథ ఇది. హ్యూమన్ ఎమోషన్స్, రిలేషన్స్ చుట్టూ తిరిగే కథ ఇది. మా డైరెక్టర్ విజయ్ 'ఈగ', 'బాహుబలి-1' చిత్రాలకు రాజమౌళి దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: లత, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుహాసిని.

వారసుడొచ్చాడు!



రాహుల్ విజయ్

మూడు దశాబ్దాలుగా ఎంతో మంది హీరోల చిత్రాలకు ఫైట్ మాస్టర్‌గా పనిచేసిన విజయ్ తనయుడు రాహుల్ విజయ్ హీరోగా పరిచయమవుతున్నారు అతను హీరోగా వి.ఎస్.టి. క్రియేటివ్ వర్క్స్ సంస్థ నిర్మించే సినిమా షూటింగ్ గురువారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రాము కొప్పుల దర్శకుడు. దివ్య విజయ్ నిర్మాత. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ 'ముప్ఫై ఏళ్లగా పరిశ్రమ నాకెంతో అండగా నిలిచింది. ఎంతో రుణపడిపోయాను. ఆ రుణం తీర్చుకోవడానికి మా అబ్బాయిని హీరోగా, అమ్మాయిని నిర్మాతగా పరిచయం చేస్తున్నాను. దర్శకుడు రాము చెప్పిన కథ నచ్చింది' అన్నారు.ఈ నెల 21 నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుందనీ, టాప్ టెక్నీషియన్స్‌తో వర్క్ చేస్తున్నందుకు ఆనందంగా ఉందనీ దర్శకుడు రాము చెప్పారు.



బెరుకేల.. చేయండిలా!

అమెరికాలో విద్యార్థుల భద్రతకు భరోసా

వర్సిటీ వెబ్‌సైట్లలో సమగ్ర సమాచారం



విదేశీ చదువు

- ఎక్కడికెళ్లినా తోటివారికి చెప్పి వెళ్లండి
- తాళాలు జాగ్రత్త.. పోతే మార్చేయండి
- ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు ఎక్కడపడితే అక్కడ వదిలేయొద్దు
- భద్రతకు నిపుణుల సలహాలు, సూచనలు
- విద్యార్థుల్లో అమెరికా-కొరియా వార్ టెన్షన్

ఇటీవలి కాలంలో అమెరికాపై ఉత్తరకొరియా దుందుడుకు వ్యాఖ్యలు ఎక్కువైపోయాయి. అమెరికాను నాశనం చేసే సత్తా తమ సొంతమంటూ రెచ్చగొట్టేస్తోంది. అవకాశం దొరికినప్పుడల్లా కయ్యానికి సై అంటోంది. ఖండాంతర క్షిపణులను పరీక్షిస్తూ సవాల్ విసురుతోంది. టీవీ పెడితే ఉత్తర కొరియా క్షిపణి పరీక్షల వీడియోలు, పేపర్ తెరిస్తే అమెరికాపై ఉత్తరకొరియా దాడి అవకాశాలంటూ వార్తలు ప్రత్యక్షమవుతున్నాయి. ఇలాంటి వార్తలు చూసి ఎక్కడిక్కడి నుంచో చదువుకోవడానికి అమెరికా వెళ్లిన విద్యార్థుల గుండెలు గుభేల్‌మంటున్నాయి. ఇటీవల అమెరికాకు చెందిన ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (ఐఐఈ) చేసిన ఓ సర్వే ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. అయితే, ఇలాంటి వాటిపై విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు భరోసా ఇస్తున్నారు. అమెరికా చట్టాల ప్రకారం అక్కడి ప్రతి విశ్వవిద్యాలయమూ తాము తీసుకుంటున్న భద్రతా చర్యలను తమ వెబ్‌సైట్లలో పెట్టాలి. అంతేకాదు.. గత విద్యా సంవత్సరంలో నమోదైన అవాంఛనీయ సంఘటనలనూ పొందుపరచాలి. కాబట్టి అమెరికాకు వెళ్లి చదువుకోవాలనుకునే విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న వర్సిటీల్లో పరిస్థితులను ముందే తెలుసుకోవచ్చు. అంతేకాకుండా వర్సిటీ పట్టణ ప్రాంతంలో ఉందా? పట్టణాలకు దూరంగా ఉందా? రవాణా సౌకర్యం ఉందా? అర్ధరాత్రి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే ఎస్కార్ట్ సౌకర్యం ఉందా? లాంటి అనేక విషయాలు కూడా వెబ్‌సైట్లలో తెలుస్తాయి. ఆ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రవేశం పొందాక అక్కడకు వెళ్లాక కావాల్సిన జాగ్రత్తలూ తీసుకోవాల్సి ఉంటుంది. చాలా యూనివర్సిటీల్లోకి విద్యార్థులే కాకుండా బయటి వ్యక్తులూ వచ్చిపోతూ ఉండొచ్చు. క్లాస్‌రూమ్‌ల దగ్గర, హాస్టళ్ల దగ్గర విశ్వవిద్యాలయ అధికారులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నా, బయట పౌరులు వచ్చి పోయినప్పుడు భద్రతకు ఇబ్బంది కలగవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండడం మంచిది. లైబ్రరీకి వెళ్లినప్పుడు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు వెళ్లినప్పుడు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ వంటి వస్తువులను టేబుల్స్ మీద వదిలి వెళ్లటం మంచిది కాదు.

విద్యార్థులు తమవంతుగా తీసుకోవాల్సిన భద్రతా టిప్స్ ఇవీ..

- హాస్టల్ రూం లేదంటే ఇంటి తాళాలను జాగ్రత్తగా చూసుకోవాలి. ఒకవేళ తాళాలు పోతే వెంటనే వాటిని మార్చేయాలి. లేకపోతే తాళాలు దొరికిన వారు దొంగతనం చేసే అవకాశముంటుంది.
- ల్యాప్‌టాప్‌లను వేరేవ్యక్తి తెరవకుండా ఉండేలా లాక్ చేసేందుకు కొన్ని టూల్స్, పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఉపయోగించటం మంచిది.
- అర్ధరాత్రి పూట ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లడం మంచిది కాదు. అలా వెళ్లాల్సి వస్తే కాలేజీ షటిల్స్‌ను ఉపయోగించుకోవటం మంచిది. అవసరమైతే కాలేజీ పోలీసు సర్వీసులను కూడా వాడుకోవచ్చు. దీని కోసం అత్యవసర సేవల నంబర్లను ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి.
- చాలా మంది విద్యార్థులు గ్రూప్‌గా కలిసి ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని ఉంటుంటారు. అలాంటి సందర్భాల్లో బయటకు వెళ్లినప్పుడు ఎక్కడికి వెళుతున్నారో చెప్పి వెళితే మంచిది. ఫేస్‌బుక్, గూగుల్ మ్యాప్స్ వంటి వాటి ద్వారా మనం ఎక్కడికి వెళ్తున్నామో ఆ ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని సులభంగా షేర్ చేసుకోవచ్చు.
- హాస్టళ్లలో ఉంటే.. తెలియని వారు వచ్చి తలుపు తట్టిన వెంటనే తెరవకూడదు. ఎవరో తెలుసుకుని తెరిస్తే మంచిది. అందుకు తలుపునకు లెన్స్ వంటి పరికరాలను అమరుస్తారు. వాటి ద్వారా ఎవరు వచ్చారో తెలుసుకోవచ్చు.

రియల్టీకి డబుల్ దెబ్బ



జీఎస్టీ.. ఆపై రెరా.. కొత్త చిక్కులతో రంగం కుదేలు.. 20 శాతం పెరగనున్న ధరలు

- చిన్న బిల్డర్లకు భవిష్యత్తు శూన్యం
- పెద్ద బిల్డర్లలోనూ అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్)

హైదరాబాద్ శివారు బోడుప్పల్‌లో ఇల్లు కొనుక్కోవాలనుకున్న ఏజీ ఆఫీస్ ఉద్యోగి వెంకట్రావ్ (పేరు మార్చాం) గేటెడ్ కమ్యూనిటీ పేరుతో 170 గజాల స్థలంలో ఇళ్లను నిర్మించి విక్రయిస్తున్న ఒక సంస్థను సంప్రదించాడు. 1100 చదరపు అడుగుల వైశాల్యంతో నిర్మిస్తున్న 2 బీహెచ్‌కే ఇంటికి సుమారు రూ.60 లక్షలు అవుతుందని చెప్పారు. అదే ప్రాంతంలో, అంతే విస్తీర్ణంలో ఓ మేస్త్రీ కట్టించి ఇస్తున్న ఇంటి ధర రూ.50 లక్షలు చెప్పాడు. వ్యవస్థీకృత రంగానికి, అవ్యవస్థీకృత రంగానికి మధ్య ధరల్లో ఉన్న తేడా ఇది. ఇది వెంకట్రావ్ ఒక్కడి అనుభవమే కాదు. సొంత ఇంటి వేటలో ఉన్న వేలాది మంది మధ్యతరగతి ప్రజల అనుభవం కూడా. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన పట్టణాల్లో ఇదే పరిస్థితి. నిర్మాణ రంగంలో మెజార్టీ వ్యాపారం అవ్యవస్థీకృత రంగంలోనే ఉంటుంది. వ్యవస్థీకృత రంగంలోని సంస్థలు నిర్మిస్తున్న ఇళ్ల కంటే, ఔత్సాహిక వ్యాపారులు తమ పరిమిత వనరులను పెట్టుబడిగా పెట్టి గృహ నిర్మాణ రంగంలోకి వచ్చిన ఉదంతాలే ఎక్కువగా ఉంటాయి. కొత్తగా వచ్చిన జీఎస్టీ, ఆపై రెరా ఈ రెండూ వారిని రియల్ వ్యాపారం నుంచి పూర్తిగా తుడిచిపెట్టే ప్రమాదం ఏర్పడింది. నిజానికి, దేశంలో అత్యధిక శాతం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రంగాల్లో రియల్టీ ఒకటి. ఇప్పటికే ఈ రంగం మందగమనంలో ఉంది. లక్షల సంఖ్యలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులు ఉద్యోగాల కోసం అల్లాడుతున్నారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఆర్థిక సర్వేలో సైతం ఇళ్లకు డిమాండ్ తగ్గిన విషయాన్ని వెల్లడించింది. అయినా ధరలు మాత్రం ఇంకా భగ్గుమంటూనే ఉన్నాయని విస్మయం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా 50 నగరాలకుగాను 33 నగరాల్లో పరిస్థితి దాదాపు ఇలాగే ఉందని స్పష్టం చేసింది. మరోవైపు, అధిక వడ్డీ రేట్లు, ఎన్పీఏల భయంతో బ్యాంకులు చురుగ్గా రుణాలు మంజూరు చేయడం లేదు. చాలా చోట్ల బడా బిల్డర్లు దురాశతో పెద్ద వెంచర్లను చేపట్టి సకాలంలో పూర్తి చేయకుండా నాన్చుతున్న కారణంగా వినియోగదారులు నిస్పృహతో ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. ఇళ్ల కొనుగోళ్లను ప్రోత్సహించాలి. కానీ, పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత జీఎస్టీ, రెరాలతో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా రియల్టీ కుదేలైంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రెరా, జీఎస్టీ రెండూ తమ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని చిన్న బిల్డర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద బిల్డర్లు ఎంతగా ఎదిగినా భవన నిర్మాణ రంగంలో 30-40 శాతం వాటా ఇప్పటికీ అసంఘటిత రంగానికి చెందిన బిల్డర్లదే. సంఘటిత రంగంలోని పెద్ద పెద్ద బిల్డర్లతో పోలిస్తే వీరిపై పన్నుల భారం పెద్దగా ఉండేది కాదు. దాంతో వీరు చౌకగా ఫ్లాట్లు అందిస్తూ మధ్య తరగతి కొనుగోలుదారులని బాగా ఆకర్షించేవారు. ఇప్పుడు వీరి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ముడి సరుకులు, సర్వీసులపై జీఎస్టీ చెల్లించి మళ్లీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేయాలంటే చిన్న బిల్డర్లకు సాధ్యం కాదు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ లేకుండా ప్రాజెక్టులు చేపట్టాలంటే ఖర్చు భారీగా పెరుగుతుంది. ఇక రెరా విషయానికి వస్తే, కనీసం ఎనిమిది యూనిట్లు లేదా 500 గజాలకు మించిన స్థలంలో కట్టే ప్రాజెక్టులన్నీ ఇక రెరా చట్టం కింద రిజిస్టర్ అయి ఉండాలి. లేకపోతే అమ్మకాలకు అనుమతించరు. దీంతో ప్రధాన నగరాల్లో ఒకే స్థలంలో 10-20 ఫ్లాట్లు కట్టే బిల్డర్లు ప్రధాన అనుమతుల కోసమే రూ.30-35 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. చిన్న బిల్డర్లలో చాలామందికి ఈ స్థోమత ఉండదు. దీంతో ఈ రంగంలో ముున్ముందు చిన్న బిల్డర్లు ఉండే అవకాశం లేదని మార్కెట్ వర్గాల అంచనా.

పెద్ద బిల్డర్లలోనూ అసంతృప్తే

పెద్ద బిల్డర్లు కూడా జీఎస్టీతో సంతృప్తిగా లేరు. జీఎస్టీని ప్రవేశపెట్టిన ప్రభుత్వం స్టాంప్ డ్యూటీని తగ్గిస్తే బాగుండేదన్నది వారి అభిప్రాయం. జీఎస్టీతో పన్ను భారం అదనంగా 6% పెరిగిందని చెబుతున్నారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ విషయంలోనూ స్పష్టత లేదంటున్నారు. జీఎస్టీతో పన్నుల భారం తగ్గి వస్తువులతోపాటు సొంతింటి ధర కూడా తగ్గుతుందని అధికార వర్గాలు, ప్రభుత్వ పెద్దలు ఊదరగొట్టారు. ఆచరణకు వచ్చేసరికి తగ్గడం మాట దేవుడెరుగు.. మరింత పెరిగింది. పేరుకు జీఎస్టీ 12 శాతమే అయినా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ కు సంబంధించి బిల్డర్లకు ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత లేదు. మరో ఆరేడు నెలలు గడిస్తే తప్ప దీనిపై స్పష్టత వచ్చే అవకాశం కనిపించడం లేదని క్రెడాయ్ తెలంగాణ విభాగం అధ్యక్షుడు జి.రాంరెడ్డి చెప్పారు. భవన నిర్మాణంలో కీలకమైన సిమెంట్, స్టీలు ధరలూ జీఎస్టీ తర్వాత ఏ మాత్రం తగ్గలేదు. కలప, విద్యుత్ పరికరాల వంటి వస్తువుల ధరలైతే మరింత పెరిగాయి. గతంతో పోలిస్తే జీఎస్టీతో బిల్డర్లపై పన్నుల భారం 10% వరకు పెరిగిందని విజయవాడకు చెందిన 'రాజధాని ప్రాంత బిల్డర్ల సంఘం' అధ్యక్షుడు వేమూరి సుబ్బారావు తెలిపారు.

సీఎం ఆరోగ్య కేంద్రాల

పటిష్ఠ పర్యవేక్షణ

- ఆ బాధ్యత డీఎంహెచ్‌వోలకు
- వారి నివేదికల మేరకే బిల్లులు
- కేంద్రాలపై విస్తృత ప్రచారం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేసేందుకు ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 222 ఆరోగ్య కేంద్రాలు ఉండగా... కొన్ని చోట్ల ఓపీ సరిగ్గా నమోదు కావడం లేదు. మరికొన్ని చోట్ల రోగులుకు అందుబాటులో లేని ప్రాంతాల్లో, అద్దె భవనాల్లో ఈ కేంద్రాలు ఉన్నాయి. దీనివల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దీనిని గుర్తించిన ఆరోగ్యశాఖ అధికారులు ఈ కేంద్రాలపై పూర్తి పర్యవేక్షణ బాధ్యతను ఆయా జిల్లా వైద్యాధికారులు అప్పగిస్తున్నారు. వారు ఇచ్చిన నివేదిక, ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే బిల్లులు చెల్లింపు జరుగుతుంది. మొన్నటి వరకూ ఈ కేంద్రాల రోజువారీ నివేదికలు సీఎం డ్యాష్ బోర్డుకి అనుసంధానం అయి ఉండటంతో, ఆ నివేదిక, ఓపీ రిపోర్టుల ఆధారంగానే నిర్వహణ సంస్థలకు బిల్లులు చెల్లించే వారు. దీని వల్ల క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో ఎవరికి తెలిసేది కాదు. దీనివల్ల కోట్ల రూపాయల నిధులు ఖర్చవుతున్నా ఆశించిన లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. దాంతో ఇకపై డీఎంహెచ్‌ఓలు ప్రతి నెలా పరిశీలించి ఇచ్చిన నివేదికలను పరిగణలోనికి తీసుకోవాలని నిర్ణయించారు. వారు ఇచ్చే గ్రేడింగ్‌ను ఆధారంగా చేసుకుని బిల్లులు చెల్లించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే డీఎంహెచ్‌ఓలకు ఆదేశాలందాయి. ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకూ, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ ఓపెన్ చేసి ఉంటాయి.

ఎన్‌హెచ్‌ఎం అనుమతి కోసం

ఆరోగ్యశాఖ రాష్ట్ర వ్యాప్తంగా 222 కేంద్రాలను ప్రారంభించింది. నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో వీటిని నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యశాఖ ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవానికి ఎన్‌హెచ్‌ఎం వీటి నిర్వహణకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. కేవలం 10 కేంద్రాలకు మాత్రమే రూ.3.50 వేల చొప్పున నిధులు కేటాయిస్తుంది. ఈ ఏడాది ఎన్‌హెచ్‌ఎం అందించిన నివేదికలో ఈ కేంద్రాలపై పర్యవేక్షణ లేదని పొందుపరచడంతో ఆరోగ్యశాఖ అధికారుల్లో చలనం వచ్చింది. ఎన్‌హెచ్‌ఎం సూచనల మేరకు వెంటనే డీఎంహెచ్‌ఓలకు పూర్తి పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. వచ్చే ఏడాదికి ఆరోగ్య కేంద్రాలపై తాము పటిష్టమయిన పర్యవేక్షణ ఏర్పాటు చేశామని ఎన్‌హెచ్‌ఎం అధికారులకు చూపి ఆ కేంద్రాలకు అనుమతి పొందాలన్నది అధికారుల ఆలోచన.

కవి, వైద్యులు ధేనువకొండ కన్నుమూత



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్య విధానంలో విశేష కృషి చేసిన వైద్యులు, కవి ధేనువకొండ శ్రీరామమూర్తి (70) కన్నుమూశారు. ప్రకాశం జిల్లా ధేనువకొండ గ్రామానికి చెందిన శ్రీరామమూర్తి, ఒంగోలు శర్మ కాలేజీలో పీయూసీ చదివారు. హైదరాబాద్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ పూర్తి చేశారు. భారతీయ వైద్య శాఖలో మూడు దశాబ్దాలపాటు పనిచేసి, 2002లో పదవీ విరమణ చేశారు. హైదరాబాద్‌లో సిద్ధేశ్వరి రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదం(శ్రియం)ఏర్పాటు చేసి ఆయుర్వేద వైద్య విధానం విస్తృతికి కృషి చేశారు. రెండు దశాబ్దాలుగా కవిత, కథ, వ్యాసం మొదలైన ప్రక్రియల్లో రచనలు చేశారు. ఈ ఏడాది భోపాల్ 'కవిభారతి'లో పాల్గొన్నారు. ధేనువకొండ తొలి కవితా సంపుటి 'ఆశల సముద్రం', తొలి కథా సంపుటి 'ఐలాండ్ విల్లా', దీర్ఘ కవిత 'అమ్మఒడి' బాగా ప్రాచుర్యం పొందాయి. 'వాల్మీకం' కవితా సంపుటి.. విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని కవి, బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్, డాక్టర్ ఎన్.గోపి, ఏకే ప్రభాకర్, కేపీ అశోక్ కుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా చీరాల మండలంలో శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.

స్పెయిన్‌లో ఉగ్రదాడి!





ఉగ్రవాదుల దాడిలో గాయపడిన వారిని తరలిస్తున్న భద్రత సిబ్బంది

- 13 మంది దుర్మరణం.. 50 మందికిపైగా గాయాలు
- పాదచారులను వ్యాన్‌తో తొక్కించిన ఉగ్రవాది

బార్సిలోనా, ఆగస్టు 17: అది స్పెయిన్ నగరం బార్సిలోనాలోని చాలా రద్దీగా ఉండే ప్రాంతం! అందునా ప్రపంచంలోనే మూడో ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం! ఎవరి పనులకు వాళ్లు వెళుతున్నారు.. పర్యాటకులతో సందడిసందడిగా ఉంది! ఇంతలోనే ఓ వాహనం.. ఫుట్‌పాత్‌పై నడుస్తున్న వారిపైకి దూసుకొచ్చింది! ఏమవుతోందో తెలుసుకునేలోపే జనాన్ని నలిపేసింది! గురువారం మధ్యాహ్నం బార్సిలోనాలోని లాస్ రాంబ్లాస్‌లో జరిగిన ఉగ్రదాడి ఉదంతమిది! ఈ ఘటనలో 13 మంది చనిపోయారని, 50 మందికిపైగా గాయపడ్డారని స్పెయిన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవలికాలంలో యూరప్ దేశాలపై పంజా విసురుతున్న ఉగ్రవాదులు తాజాగా స్పెయిన్‌పై విరుచుకుపడ్డారు. గురువారం మధ్యాహ్నం బార్సిలోనాలోని లాస్ రాంబ్లాస్‌లో దుండగుడు పాదచారులను వ్యాన్‌తో తొక్కించాడు. దీంతో అప్పటివరకు సందడిగా ఉన్న ప్రాంతం కాస్తా గందరగోళంగా తయారైంది. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు, ఎక్కడికక్కడ తీవ్రగాయాలతో పడిపోయిన క్షతగాత్రులతో ఆ ప్రాంతం అల్లకల్లోలంగా మారింది.

వ్యాన్ వేగంగా దూసుకొస్తుండడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు జనం పరుగులు పెట్టారు. సమీపంలోని రెస్టారెంట్లు, దుకాణాల్లోకి వెళ్లి కొందరు ప్రాణాలు దక్కించుకున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బార్సిలోనాలో హై అలర్ట్ ప్రకటించారు.

1 నుంచి టోల్ దగ్గర

ఆగక్కర్లేదు



- ఆన్‌లైన్‌లో ఫాస్టాగ్
- టోల్‌గేట్‌ల వద్ద ఫాస్టాగ్ విక్రయ కేంద్రాలు
- సీసీఎస్ ద్వారా నేటినుంచే: ఎన్‌హెచ్‌ఏఐ
- మైఫాస్ట్ యాప్ ద్వారా కొనుగోలుకు వీలు

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ఎలక్ట్రానిక్ టోల్ వసూళ్ల కోసం ఫాస్టాగ్‌లను అందజేస్తున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ).. వాటిని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు టోల్‌గేట్ల వద్ద కామన్ సర్వీసెస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా వాటిని విక్రయించేందుకు ఫాస్టాగ్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయబోతోంది. శుక్రవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. వచ్చేనెల 1 నుంచి ఫాస్టాగ్ ఉన్న వాహనాలను టోల్‌గేట్‌ల వద్ద ప్రత్యేక లేన్‌ద్వారా అనుమతిస్తారు. బ్యాంకులు, ఎన్‌హెచ్‌ఏఐ, ఐహెచ్ఎంసీఎల్ వెబ్‌సైట్‌ల ద్వారా ఈ ఫాస్టాగ్‌లను వాహనదారులు కొనుగోలు చేయవచ్చు. ఫాస్టాగ్‌లకు సంబంధించి మైఫాస్ట్, ఫాస్టాగ్ పార్ట్నర్ పేరిట రెండు యాప్‌లను ఎన్‌హెచ్‌ఏఐ గురువారం ఆవిష్కరించింది. మైఫాస్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఫాస్టాగ్‌ను కొనుగులో చేయవచ్చుని, లేదంటే రీచార్జి చేసుకోవచ్చని సంస్థ తెలిపింది. ఫాస్టాగ్ పార్ట్నర్ యాప్ ద్వారా వాహనాల డీలర్లు, బ్యాంకులు, సీఎస్‌సీ వంటి సంస్థలు ఫాస్టాగ్‌లను విక్రయించవచ్చని వివరించింది. ఇప్పటివరకు 6లక్షల ఫాస్టాగ్‌ల విక్రయాలు జరిగాయని, తాజా చర్యలతో, వీటి విక్రయాలు మరింత పుంజుకుంటాయని పేర్కొంది.

ఫాస్టాగ్ అంటే...

ఎలక్ట్రానిక్ టోల్ వసూలు కోసం వినియోగించే పరికరం. వాహనదారుడికి సంబంధించిన అకౌంట్ యాక్టివేట్ అయిన తర్వాత ఈ పరికరాన్ని వాహనం ముందు అద్దానికి అతికిస్తారు. వాహనం టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) టెక్నాలజీ ద్వారా ప్రీపెయిడ్ అకౌంట్ నుంచి టోల్‌రుసుము సంబంధిత సంస్థకు జమ అవుతుంది. ఇందువల్ల, వాహనదారుడు టోల్‌గేట్ వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా నేరుగా వెళ్లిపోవచ్చు.

ముప్పేట దాడిలో..!



- 2,500 మందిని కోల్పోయిన మావోయిస్టు పార్టీ
- అంబూజ్‌మడ్, బస్తర్‌లలో ఆర్మీ దిగింది
- ప్రతి రాష్ట్రంలోనూ గ్రేహౌండ్స్ బలగాలు
- స్థానిక నాయకత్వానికి ముప్పు
- భీకర పోరాటానికి సిద్ధమవండి
- మావోయిస్టు కేంద్ర కమిటీ సర్క్యులర్

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 50 ఏళ్ల నక్సల్బరీ వసంత మేఘ గర్జన వేడుకలు జరుగుతున్న సందర్భంలో దానికి ఏకైక వారసత్వంగా చెప్పుకొంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తీవ్ర విపత్కర, విషమ పరిస్థితులను ఎదుర్కొంటోంది. భద్రతాదళాలు, ఇంటెలిజెన్స్ విభాగాలు, సివిల్ పోలీసుల ముప్పేటదాడికి గురవుతున్న ఆ పార్టీని అంతర్గత బలహీనతలు, ఇంటెలిజెన్స్ లోపం, ఆపరేషన్ గ్రీన్‌హంట్ వెరసి గుక్క తిప్పుకోనివ్వడంలేదు. ఇవి స్వయంగా మావోయిస్టు పార్టీ వెల్లడించిన విషయాలు. తన పార్టీ మిలటరీ, పోరాట సంస్థలకు రాసిన సర్క్యులర్‌లో ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ (సీసీ) వివరించింది. నేతల నిర్మూలన, అంతర్గత బలహీనతలు పట్టుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ఎస్ఐబీ సహా ఇతర సంస్థలు పైచేయి సాధించాయని అంగీకరించింది. పట్టణప్రాంతాల్లో ఉద్యమాన్ని దాదాపుగా తుడిచిపెట్టేసిన పోలీసు, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ బలగాలు ఇప్పుడు నేరుగా డీకేలోకి వచ్చేసి గెరిల్లాప్రాంతాలను హస్తగతం చేసుకుంటున్నారని సీసీ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేసింది.

2,500 మందిని కోల్పోయాం

దశాబ్దకాలంలో 2,500 మంది నేతలను కోల్పోయాం. అందులో 10 మంది కేంద్ర కమిటీ (సీసీ), పొలిట్బ్యూరో (పీబీ) సభ్యులున్నారు. 45 మంది రాష్ట్రాల స్థాయి, 11 మంది రీజియన్, 160 మంది జిల్లా స్థాయి, 300 మందికిపైగా సబ్ డివిజనల్ లేదా ప్రత్యేక కమిటీల నాయకత్వాన్ని కోల్పోయాం. మావోయిస్టు పార్టీ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరిట దూకుడును పెంచాయి. ఎన్‌కౌంటర్ పేరిట నాయకులను చంపడంలో ఆయా సంస్థలు విజయం సాధించాయి. ప్రత్యేకించి పటేల్ సుధాకర్‌రెడ్డి, ఆజాద్, కిషన్‌జీ, వంటి 10 మంది అగ్ర నేతలను పట్టుకొని చంపారు. ఇప్పుడు ఏకంగా దట్టమైన అడవుల్లోకి (డీప్ ఫారెస్ట్) వచ్చేస్తున్నారు. భారీ సంఖ్యలో రోడ్‌ఓపెనింగ్ పార్టీలు పని చేస్తున్నాయి. పక్కా సమాచారం దొరికితే 800-4000 మంది వరకు అడవుల్లోకి వచ్చేస్తున్నారు. అబూజ్‌మాడ్, బస్తర్‌లో ఆర్మీ రంగంలోకి దిగింది.

పోరు మరింత భీకరం.. సిద్ధంగా ఉండాలి

కశ్మీర్‌లో రాష్ట్రీయ రైఫిల్స్ ఉన్నట్లు డీకే పరిధిలో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారు. వారికి శిక్షణ ఇచ్చి డీకేలోకి పంపిస్తే స్థానిక నాయకత్వాన్ని మొత్తం పోగొట్టుకునే ప్రమాదం ఉంది. ప్రతీ రాష్ట్రం గ్రేహౌండ్స్ తరహా బలగాలను సిద్ధం చేసుకుంటోంది. కమాండ్ సెంటర్లకు నేరుగా ముఖ్యమంత్రులే నాయకత్వం వహిస్తున్నారు. యుద్ధం మరింత భీకరంగా కొనసాగుతోంది. భారీ సంఖ్యలో ఎయిర్‌బేస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వైమానిక దాడులకు దిగొచ్చన్న సమాచారం కూడా ఉంది. కాబట్టి పీఎల్‌జీఏ మరింత మిలటరీ లైన్‌తో పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి. శత్రుదాడులను తిప్పికొట్టేందుకు మరింత అప్రమత్తంగా ఉండాలి అని సర్క్యులర్‌లో సీసీ కోరింది.



ఆడి క్యూ7, ఎ6 డిజైన్ ఎడిషన్లు

న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ ఆడి ఎస్‌యువి క్యూ7, సెడాన్ ఎ6లలో డిజైన్ ఎడిషన్లను మార్కెట్లోకి తెచ్చింది. క్యూ7 డిజైన్ ధర 81.99 లక్షల రూపాయలుగా, ఎ6 ధర 56.78 లక్షల రూపాయలుగా ఉంది. 249 హార్స్‌పవర్ గల 3 లీటర్ల డీజిల్ ఇంజన్‌తో వచ్చిన క్యూ7 డిజైన్ ఎడిషన్ కారు 7.1 సెకన్ల వ్యవధిలో 100 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. ఎ6 డిజైన్ ఎడిషన్ కారుకు 190 హార్స్‌పవర్ గల 2 లీటర్ల డీజిల్ ఇంజన్ అమర్చారు. ఆడి భారత మార్కెట్లోకి ప్రవేశించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కొత్త డిజైన్ వెర్షన్లను మార్కెట్లోకి తెచ్చామని ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ తెలిపారు. ఈ ఆడి క్యూ7 కారు దేశీ కస్టమర్లను మరింతగా ఆకట్టుకుంటుందని తాను భావిస్తున్నట్టు ఆయన చెప్పారు.

మారుతి 'సియాజ్ ఎస్'



ధర రూ.9.39 లక్షలు

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ తన సియాజ్ మోడల్‌లో స్పోర్ట్స్ వెర్షన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఢిల్లీలో ఈ కారు పెట్రోల్ వేరియెంట్ ధర 9.39 లక్షల రూపాయలు (ఎక్స్ షోరూమ్). డీజిల్ స్మార్ట్ హైబ్రిడ్ వేరియెంట్ ధర 11.55 లక్షల రూపాయలు. ఇది మరింత ఆకర్షణీయంగా కనిపించే బ్లాక్ ఇంటీరియర్స్, గ్రే క్రోమ్ ఫినిషింగ్‌తో తయారుచేశామని, మంచి ఆకర్షణీయమైన స్పోర్ట్స్ వాహనాలను ఇష్టపడే యువతరాన్ని ఆకట్టుకోవడం లక్ష్యంగా దీన్ని తెచ్చామని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌ఎస్ కల్సి తెలిపారు. సియాజ్ ఆల్ఫాలో ఉన్న ఇతర ఆకర్షణలన్నీ ఈ రెండు వేరియెంట్లలోనూ ఉంటాయని అన్నారు. 2014 అక్టోబర్‌లో తొలిసారి సియాజ్‌ను మార్కెట్లోకి విడుదల చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు 1.7 లక్షల కార్లు విక్రయించినట్టు చెప్పారు. ఎ3 సెగ్మెంట్‌లో సియాజ్ ప్రస్తుతం 43.5 శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉందని, స్మార్ట్ హైబ్రిడ్ టెక్నాలజీ కూడిన డీజిల్ కారు లీటరుకు 28.09 కిలోమీటర్ల మైలేజి ఇస్తుందన్నారు.

జోరు తగ్గిన మార్కెట్

మూడో రోజూ లాభాలే... ఆదుకున్న ఇన్ఫోసిస్ బైబ్యాక్ వార్తలు



ముంబై : రెండు సెషన్లుగా మంచి లాభాలు ఆర్జించిన మార్కెట్ సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్లలో అనిశ్చితులుండవచ్చన్న అమెరికన్ ఫెడరల్ వ్యాఖ్యలు, గరిష్ఠ స్థాయిల్లో లాభాల స్వీకరణ ప్రభావంతో గురువారం మందకొడిగానే ట్రేడయింది. రోజంతా ఒడిదుడుకుల ధోరణిలో సాగిన మార్కెట్ స్వల్పలాభాలతో మూడో రోజూ ప్రాఫిట్‌లోనే ముగిసింది. అటుపోట్లున్నప్పటికీ ఐటీ, ఎఫ్‌ఎంసీజీ కౌంటర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపించడం, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ శనివారం షేర్ల బైబ్యాక్ పరిశీలిస్తుందన్న వార్త వల్ల ఏర్పడిన సానుకూలత కారణంగా ఇన్వెస్టర్లు ప్రాఫిట్‌ను నిలుపుకున్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు. ఇన్ఫోసిస్ బైబ్యాక్ వార్తలతో ఒక దశలో 31937.51 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ తదుపరి లాభాల స్వీకరణ ఒత్తిడి కారణంగా డే గరిష్ఠ స్థాయి నుంచి దిగజారి ఎట్టకేలకు 24.57 పాయింట్ల లాభంతో 31795.46 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 6.85 పాయింట్ల లాభంతో 9904.15 పాయింట్ల వద్ద క్లోజయింది.

షేర్ల బైబ్యాక్‌పై రేపు ఇన్ఫోసిస్ నిర్ణయం

దేశంలో రెండో సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ డైరెక్టర్ల బోర్డు 13 వేల కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను పరిశీలించేందుకు శనివారం సమావేశం కానుంది. 36 ఏళ్ల చరిత్రలో ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్ చేయడం ఇదే ప్రథమం. కంపెనీ ప్రమోటర్లు, విశేషమైన పలుకుబడి ఉన్న మాజీ ఎగ్జిక్యూటివ్‌లు దీర్ఘకాలంగా షేర్ల బైబ్యాక్ ప్రతిపాదించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల తన వద్ద ఉన్న మిగులు నిధులను ఇన్ఫోసిస్ షేర్ హోల్డర్లకు అందించగలుగుతుంది. అందరి ఒత్తిడికి లొంగిన ఇన్ఫోసిస్ యాజమాన్యం 13 వేల కోట్ల రూపాయల విలువైన షేర్ల బైబ్యాక్ చేయనున్నట్టు కొద్దికాలం క్రితం ప్రకటించింది. ఈ నిర్ణయానికి అనుగుణంగానే ఆ అంశం పరిశీలించేందుకు డైరెక్టర్ల బోర్డు శనివారం సమావేశం కానున్నదని, సమావేశం ముగియగానే నిర్ణయాలను ఎక్స్ఛేంజీలకు తెలియజేస్తామని బుధవారం పొద్దుపోయిన తర్వాత రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఇన్ఫోసిస్ తెలిపింది. ఈ ప్రకటన వచ్చే సరికి గురువారం ఇన్ఫోసిస్ షేరు 4.54 శాతం లాభపడి 1021.15 రూపాయలకు చేరింది. దీంతో తక్షణం ట్రేడింగ్ విండోను మూసివేశామని, వచ్చే మంగళవారం తిరిగి ట్రేడింగ్ పునరుద్ధరిస్తామని ఇన్ఫోసిస్ ప్రకటించింది.

4 నెలలు... రూ.40 వేల కోట్లు

- **స్టాక్ మార్కెట్‌కు వెల్లువెత్తిన ఎంఎఫ్ నిధులు**

మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఏప్రిల్-జూలై మధ్య కాలంలో 40 వేల కోట్ల రూపాయల పైబడి స్టాక్‌మార్కెట్లో ఇన్వెస్ట్ చేశాయి. రిటైల్ ఇన్వెస్టర్లు అధికంగా ఎంఎఫ్ స్కీమ్‌లలో ఇన్వెస్ట్ చేస్తూ ఉండడంతో ఈ స్థాయిలో ఆ కంపెనీలు స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాయంటున్నారు. ఇదే కాలంలో విదేశీ సంస్థల పెట్టుబడులు 21 వేల కోట్ల రూపాయలు. రియల్ ఎస్టేట్, బంగారం పెట్టుబడులు అంత ఆకర్షణీయంగా లేకపోవడంతో ఇన్వెస్టర్లు ఈక్విటీలపై మొగ్గు చూపుతున్నారని ఫండ్స్ ఇండియా పరిశోధనా విభాగం హెడ్ విద్యా బాల అన్నారు.

తగ్గిన హెచ్‌డిఎఫ్‌సి, పిఎన్‌బి వడ్డీ రేట్లు

న్యూఢిల్లీ : మరో రెండు బ్యాంకులు సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బి) ఖాతా డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గించాయి. రూ.50 లక్షల వరకు ఉండే ఎస్‌బి డిపాజిట్లపై చెల్లించే వార్షిక వడ్డీ రేటును ఈ నెల 19 నుంచి 4 నుంచి 3.5 శాతానికి తగ్గిస్తున్నట్టు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రకటించింది. అయితే రూ.50 లక్షల మించి ఉండే డిపాజిట్లపై మాత్రం ఎప్పటిలానే నాలుగు శాతం వడ్డీ రేటు కొనసాగుతుందని తెలిపింది. ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కూడా రూ.50 లక్షల లోపు ఉండే ఎస్‌బి డిపాజిట్లపై చెల్లించే వడ్డీని 4 శాతం నుంచి 3.5 శాతానికి కుదించింది. రూ.కోటి కంటే తక్కువగా ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేటును 0.15-0.40 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. పిఎన్‌బి వడ్డీ రేట్ల తగ్గింపు కూడా శనివారం నుంచి అమల్లోకి వస్తుంది. జూలై 31న ఎస్‌బి ఖాతా నిల్వలపై చెల్లించే వడ్డీ రేటును అర శాతం తగ్గిస్తున్నట్టు ఎస్‌బిఐ ప్రకటించిన తర్వాత మిగతా బ్యాంకులూ అదే దారి పట్టాయి. యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్ణాటక బ్యాంకూ ఇప్పటికే తమ ఎస్‌బిఐ ఖాతా డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేటును అర శాతం తగ్గించాయి.

ఐపిఓకు సిద్ధమవుతున్న

సీవేస్ షిప్పింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): షిప్పింగ్ రంగానికి చెందిన సీవేస్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపిఒ)కు సిద్ధమవుతోంది. నిజానికి ఈ కంపెనీ గత ఏడాదే ఐపిఒకు రావలసి ఉంది. అందు కోసం సెబికి దరఖాస్తు కూడా చేసింది. అయితే కొన్ని అనుకోని కారణాలతో ఆ ప్రయత్నం మానుకుంది. తాజాగా కంపెనీ ఈక్విటీలో ఐడిఎఫ్‌సి ప్రైవేట్ ఈక్విటీ కంపెనీకి ఉన్న 24 శాతం వాటాను ప్రమోటర్లు కొనుగోలు చేశారు. అయితే ఎంత మొత్తానికి ఈ వాటా కొనుగోలు చేసింది వెల్లడించలేదు.' తొమ్మిదేళ్లుగా కొనసాగిన ఈ బంధంతో ఇద్దరికీ లాభం చేకూరింది. మాపై నమ్మకంతో ఇన్నాళ్లూ మాకు సహకరించినందుకు ఐడిఎఫ్‌సి ప్రైవేట్ ఈక్విటీ కంపెనీకి కృతజ్ఞతలు' అని సీవేస్ షిప్పింగ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పివికె మోహన్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం వ్యాపార అవకాశాలు కూడా ఆశాజనకంగా ఉన్నందున కంపెనీ ఐపిఒకు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

శ్రేయీ ఎక్విప్‌మెంట్ పబ్లిక్ ఇష్యూ

శ్రేయీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ అనుబంధ సంస్థ శ్రేయీ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ద్వారా 25 శాతం వాటాలను విక్రయించనుంది. దేశంలో నిర్మాణం, మైనింగ్ రంగాలకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఈ కంపెనీ రుణసహాయం అందిస్తుంది. గురువారం జరిగిన డైరెక్టర్ల సమావేశంలో పబ్లిక్ ఇష్యూ జారీ చేసే అవకాశాలు పరిశీలించాలని నిర్ణయించినట్టు కంపెనీ సిఎండి హేమంత్ కనోరియా తెలిపారు.

నిస్సాన్ వాటర్‌లెస్ కార్ వాషింగ్ సదుపాయం

న్యూఢిల్లీ : కార్ల కంపెనీ నిస్సాన్ దేశంలోని తన సర్వీస్ సెంటర్లలో వాటర్‌లెస్ కార్ వాషింగ్ సర్వీసును ప్రవేశపెట్టింది. 'హ్యాపీ విత్ నిస్సాన్' ఏడో ప్రచారోద్యమంలో భాగంగా ఈ సర్వీసును తీసుకువచ్చినట్టు కంపెనీ ప్రకటించింది. ఈ నెల 24వ తేదీ వరకు దేశంలోని 148 నిస్సాన్, డట్సన్ సర్వీస్ సెంటర్లలో ఈ ప్రచారోద్యమం జరుగుతుందని నిస్సాన్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ మల్హోత్రా తెలిపారు. ఈ కొత్త రకం కార్ వాషింగ్‌తో ప్రచారోద్యమం జరుగుతున్న ఎనిమిది రోజుల్లోనే 28 లక్షల లీటర్ల నీటిని ఆదా చేయగలుగుతామని, ఇలా ఏడాదికి 13 కోట్ల లీటర్ల నీరు ఆదా అవుతుందని చెప్పారు.

బులియన్


బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	30,120	30,100	29,850	29,110	--
క్రితం ముగింపు	28,830	29,840	29,700	28,805	--
22 క్యారెట్లు	29,520	28,000	27,730	28,960	27,760
క్రితం ముగింపు	29,230	27,700	27,590	28,655	27,480
వెండి (కిలో)	40,250	40,500	40,300	39,000	--
క్రితం ముగింపు	39,400	40,000	39,500	38,255	--

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	వరంగల్	357.00
విజయవాడ	359.00	చెన్నై	397.00
గోదావరి	359.00	నమక్కల్	384.00
బెంగళూరు	380.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	362.00	ముంబై	400.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	78.00	గోదావరి	80.00
కరీంనగర్	80.00	విజయవాడ	80.00
వరంగల్	78.00	గుంటూరు	82.00
మహబూబ్‌నగర్	78.00	ఒంగోలు	82.00
కర్నూలు	78.00	చిత్తూరు	86.00
విశాఖపట్నం	73.00	నెల్లూరు	86.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.37	67.68
పౌండ్	75.24	87.26
యూరో	68.74	79.73
ఆస్ట్రేలియా డాలర్	46.31	53.59
బహ్రెయిన్ దినార్	158.16	181.15
కువైట్ దినార్	175.58	218.72
ఒమని రియాల్	154.76	177.11
సౌదీ రియాల్	15.52	18.40
సింగపూర్ డాలర్	42.82	50.72
యుఎఇ దిరమ్	15.89	18.57

ముగింపు సెషన్ బలహీనం

తిథి : శ్రావణ బహుళ ఏకాదశి, **ద్వాదశి నక్షత్రం :** ఆర్ద్ర ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 9904.15 (+6.85) — ఆస్ట్రో వ్యూ

ట్రెండ్ మార్పు వేళలు : 9.59

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 9.35 నుంచి 11.35 వరకు మెరుగ్గా ట్రేడవుతూ 11.45 నుంచి 1.50 వరకు నిలకడ ధోరణి ప్రదర్శించి 2 గంటల నుంచి ముగింపు వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2 గంటల తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 9985, 9980
మద్దతు స్థాయిలు : 9865 9830

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

9900 కీలకం

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలోనే మరింత రికవరీ బాట పట్టి 9950 వరకు వెళ్లినా ఇంట్రాడే రియాక్షన్ సాధించి 9900 దిగువకు వచ్చింది. చివరికి 9900 కన్నా స్వల్పంగా పైన క్లోజయింది. డే కనిష్ఠ స్థాయిలో ముగియడం అమ్మకాల వత్తిడిని సూచిస్తోంది. మూడు రోజుల బౌన్స్ బ్యాక్ అనంతరం కన్సాలిడేషన్ ట్రెండ్ కనబరుస్తోంది. 50 డిఎంఏ వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 9950 **మద్దతు :** 9880

- మరింత అప్‌ట్రెండ్ కోసం 9900 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 9950, 10000. ట్రెండ్‌లో సానుకూలత కోసం 9900 కన్నా పైన క్లోజ్ కావడం తప్పనిసరి.
- ఇంట్రాడే మద్దతు స్థాయి 9880 కన్నా దిగజారితే మైనర్ కరెక్షన్ సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 9800.
- బ్యాంక్ నిఫ్టీకి 24500 వద్ద నిరోధం ఎదురవుతోంది. మద్దతు స్థాయి 24000.

■ వి.సుందర్ రాజా

ఎన్‌ఎస్ఇ-500 NSE
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా..

AARTIDRUGS 504.8(515.25)7610
AARTIIND 858.15(871.7)18627
ABAN 185.3(163.15)4870632
ABB 1365.6(1357.6)40252
ABFRL 170.25(173.4)257031
ABGSHIP 12.1(12.35)14669
ACC 1780.1(1811.2)360577
ADANIENT 113.4(115.2)3746529
ADANIPORTS 389.3(397.55)2502761
ADANIPOWER 28.7(29.55)5285095
ADANITRANS 111.45(109.95)266796
AEGISCHEM 189.2(188.2)91766
AHLUCONT 278.75(277.9)33188
AIAENG 1400.3(1399.05)185518
AJANTPHARM 1215.45(1253.35)138319
AKZOINDIA 1785.55(1782.85)3865
ALBK 67.25(66.9)2584744
ALLCARGO 164.5(165.85)90527
ALOKTEXT 3.15(3)2174817
AMARAJABAT 806(813)114501
AMBUJACEM 270.9(270.05)2464131
AMTEKAUTO 26.85(27.85)1218709
ANANTRAJ 55.75(54.6)1660108
ANDHRABANK 51.25(51.15)2067573
APARINDS 771.75(770.35)13508
APLLTD 515.55(515.3)21891
APOLLOHOSP 1101.45(1159.45)1613900
APOLLOTYRE 269.25(272.7)3452974
ARVIND 370.6(376.3)690598
ASHIANA 175.05(176.3)19473
ASHOKA 190(190.75)335169
ASHOKLEY 105.3(104.75)6252193
ASIANPAINT 1134.95(1141.3)494638
ASTRAL 662.15(665.15)10636
ASTRAZEN 928.25(908.8)10354
ATUL 2099.6(2116.25)18501
AUROPHARMA 703.5(713.9)2144376
AVANTIFEED 1906.1(1942.95)120793
AXISBANK 497.15(499.5)3948664
BAJAJ-AUTO 2825.85(2849.2)152160
BAJAJCORP 405.35(409.55)20290
BAJAJELEC 328.9(315.45)179575
BAJAJFINSV 5304.45(5356.8)182299
BAJAJHIND 15.15(15.2)4018414
BAJAJHLDNG 2583.85(2584.25)76854
BALKRISIND 1524.05(1552.6)43307
BALLARPUR 14.4(14.9)1099154
BALMLAWRIE 244.95(238.55)101675
BALRAMCHIN 165.7(167.15)1145614
BANKBARODA 148.25(147.15)20122929
BANKINDIA 145.75(147.05)4468028
BASF 1443.45(1410.2)6301
BATAINDIA 676(673.5)935987
BBTC 906.6(919.5)51106
BEML 1858.85(1717.2)4247391
BERGEPAINT 242.1(246.6)572950
BFUTILITIE 339.5(339.4)175690
BGRENERGY 133.7(132.9)101335
BHARATFIN 847.7(823.45)2054763
BHARATFORG 1185.85(1187.3)371390
BHARTIARTL 416.35(407.75)2958725
BHEL 129.25(129.95)3296113
BHUSANSTL 71.15(73.25)886576
BIOCON 328.4(328.4)6874084
BIRLACORPN 955.15(951.55)33844
BLISSGVS 166.7(166.8)232321
BLUEDART 4000.25(4005.95)3393
BLUESTARCO 739.15(702.2)125603
BOMDYEING 78.8(76)1523277
BOSCHLTD 22037.95(22309.9)20311
BPCL 493.7(483.95)4640313
BRFL 131.35(132.85)22132
BRIGADE 264.05(268.05)24522
BRITANNIA 4250.5(4299.95)170706
CADILAHC 481.6(483.25)619739
CANBK 335.1(336.85)1553747
CANFINHOME 2959.6(2968.85)62866
CAPF 731.85(742.25)253689
CARERATING 1590.35(1562.15)15130
CASTEXTECH 6.25(6.4)326754
CASTROLIND 383(386.85)289844
CCL 280.1(279.3)68978
CEATLTD 1731.3(1712.3)624529
CENTRALBK 72.05(74.65)952491
CENTURYPLY 250.9(258.3)166171
CENTURYTEX 1205.8(1213.05)406475
CERA 2803(2799.6)42123
CESC 954(940.85)758644
CHAMBLFERT 141.25(140.45)1073332
CHENNPETRO 392.6(390.75)614785
CHOLAFIN 1155.4(1160.25)105634
CIPLA 573.2(590.45)1422631
CLNINDIA 587.85(591.9)7685
COALINDIA 246.95(237.95)20945037
COLPAL 1059.65(1066.8)95935
CONCOR 1241.75(1230.4)543798
COROMANDEL 445.1(449.05)139537
CORPBANK 46.4(45.95)235480
COX&KINGS 267.25(266.05)313611
CRISIL 1823.15(1846.3)5121
CUB 159.8(158.3)280239
CUMMINSIND 901.5(921)198242
CYIENT 507.05(499.9)10147
DABUR 307.95(309.05)741281
DALMIABHA 2618.6(2610.15)81581
DBCORP 371.9(365)20577
DBREALTY 37.35(37)386884
DCBBANK 184.35(185.2)1203366
DCMSHRIRAM 381.3(389.15)65207
DEEPAKFERT 372.4(367.7)671512
DELTACORP 170.4(169.75)1322365
DEN 82.9(81.45)46638
DENABANK 31.35(31.25)552202
DHANUKA 744.7(744.55)12449
DHFL 448.45(449)1409477
DISHTV 74(72.1)2749718
DIVISLAB 645.7(657.25)398334
DLF 185.2(180.8)16958436
DREDGECORP 605.85(579.75)436478
DRREDDY 2011.25(2005.25)540131
DYNAMATECH 2151.65(2160.15)2542
ECLERX 1278.6(1281)7162
EDELWEISS 254.9(248.35)4395170
EICHERMOT 30928(30617)34762
EIDPARRY 336.65(322.9)411036
EIHOTEL 131.6(130.8)45798
ELECTCAST 28.85(28.25)665094
ELGIEQUIP 220(223.4)23375
EMAMILTD 1090.7(1124.55)68420
ENGINERSIN 151.85(150.85)1594774
EROSMEDIA 195(191.25)450476
ESCORTS 629.35(639.2)1318278
ESSDEE 34.25(33.65)13558
ESSELPACK 264.45(257.35)118470
EVEREADY 301(302.9)59429
EXIDEIND 213.3(206.95)1691212
FCONSUMER 42.75(42.95)4361730
FDC 171(173.15)13271
FEDERALBNK 110.05(110.15)4981114
FINCABLES 530.05(527.3)110830
FINPIPE 599(589.45)45318
FLFL 345.4(321.45)968925
FORTIS 151.45(151.05)3669508
FSL 34.5(35.15)934142
GAIL 376.2(371.2)1450232
GATI 112.45(112.9)340232
GDL 245.65(245)21139
GEPIL 665.4(671.6)12137
GESHIP 389.85(377)425500
GET&D 373.6(375.05)59048
GILLETTE 5346.5(5354)2883
GLAXO 2392.55(2381.55)5830
GLENMARK 619.4(621.6)770213
GLOBOFFS 37.45(34.15)141620
GMDCLTD 141.15(140.3)276675
GMRINFRA 18.55(16.5)151869401
GODFRYPHLP 1076.85(1041.8)1346806
GODREJCP 919.6(921.9)245715
GODREJIND 605.25(610.95)294925
GODREJPROP 510.5(514.8)84837
GPPL 137.95(141)241211
GRANULES 126.8(126.8)2561843
GREAVESCOT 150.1(148.6)141128
GREENPLY 278(276)16315
GRINDWELL 392(394)9157
GRUH 483.1(472.5)195234
GSFC 137(126.7)4079521
GSKCONS 5296(5344.15)2058
GSPL 183.3(184)445761
GUJFLUORO 746.7(752.65)162666
GUJGASLTD 772.35(777.85)22545
GULFOILLUB 816.35(834.1)9232
GVKPIL 13.25(12.8)22975476
HATHWAY 32.2(31.85)135577
HAVELLS 472.85(464.65)1425374
HCC 35.9(35.8)4416624
HCL-INSYS 45(44.65)674175
HCLTECH 871.4(864.5)801175
HDFC 1759.25(1741.75)2408279
HDFCBANK 1765.4(1781.25)1363717
HDIL 61.4(62.6)20326771
HEIDELBERG 121.75(119)70679
HEROMOTOCO 3997.85(4022.1)351635
HEXAWARE 278.25(264.45)3283152
HFCL 16.55(15.85)4350213
HIMATSEIDE 335.45(342.45)73626
HINDALCO 230.3(233.6)10310147
HINDCOPPER 62.95(63)896242
HINDPETRO 433.95(436.4)3787274
HINDUNILVR 1177.3(1186.35)961319
HINDZINC 294.8(290.9)3428249
HMT 31.75(32.95)11152
HMVL 269.85(269.35)12217
HONAUT 12921.65(12768)575
HOTELEELA 21.15(21)148420
HSIL 350.65(351.5)91475
HTMEDIA 86.9(86.85)253969
IBREALEST 237(230)10291535
IBULHSGFIN 1200.45(1209.1)753155
ICICIBANK 293.15(294.95)8168684
ICRA 3925.6(3952.2)894
IDBI 53.8(53.25)3613142
IDEA 89.35(86.95)8881668
IDFC 56.45(56.75)9076767
IFBIND 661.4(654.35)2716
IFCI 22.95(23.05)4151678
IGARASHI 1006.9(1003.75)24200
IGL 1274.35(1274.35)315664
IIFL 596.45(590.05)201714
IL&FSTRANS 79.55(79.4)230582
INDHOTEL 126.5(125.95)659092
INDIACEM 184.8(185)4709553
INDIANB 304.65(295.3)1423081
INDOCO 195(193.6)18948
INDUSINDBK 1628.5(1647.2)619082
INEOSSTYRO 865.4(860.6)5192
INFRATEL 379.35(382.9)1591863
INFY 1020.85(975.2)12892130
INGERRAND 810.05(806.45)7842
INOXLEISUR 245.45(244.35)70923
INOXWIND 107.3(110.85)541640
INTELLECT 112.4(103.75)981577
IOB 22.75(22.75)606988
IOC 426.3(422.3)3013849
IPAPPM 295.8(300.7)30472
IPCALAB 415.95(416.95)74939
IRB 211.05(212.1)1104663
ITC 280(279.2)13703999
J&KBANK 80.7(81.25)191525
JAGRAN 176.65(172.95)53503
JAICORPLTD 79.5(75.05)1219665
JBCHEPHARM 289.6(292.35)24350
JBFIND 162.7(166.05)95523
JCHAC 2038.7(2016.45)6530
JETAIRWAYS 591.2(587.05)1407443
JINDALPOLY 375.8(372.1)60610
JINDALSTEL 139.85(138.4)11091385
JISLJALEQS 97.95(94.95)8480352
JKCEMENT 1028.8(1032.25)16314
JKIL 211.45(205.95)1075391
JKLAKSHMI 418.65(418.55)42742
JKTYRE 153.95(152.35)1088251
JMFINANCIL 126.6(124.65)969519
JPASSOCIAT 23.5(23.9)79255653
JPINFRATEC 17.1(17.95)6823654
JPPOWER 6.15(5.9)5652943
JSWENERGY 64.25(64.6)4261970
JSWHL 1734.15(1731.2)4105
JUBILANT 722.1(697.95)400355
JUBLFOOD 1399.4(1392.9)1254835
JUSTDIAL 361.5(349.95)2841415
JYOTHYLAB 374(381.55)51935
KALPATPOWR 359.95(351.65)89288
KANSAINER 467(460.35)173900
KEC 302(286.55)1134245
KESORAMIND 129.3(130.15)193654
KIRLOSENG 392.95(394.55)33662
KITEX 241.75(236.7)50451
KOLTEPATIL 165.6(166.85)69701
KOTAKBANK 989(1000.55)1076077
KPIT 115.1(112.7)1356117
KRBL 474.75(473.15)61193
KSCL 548.45(564.4)1160837
KSK 7.4(7.1)591040
KTKBANK 148.5(145.65)2986919
KWALITY 136.15(136.6)1655819
L&TFH 175.7(176.5)3368022
LAKSHVILAS 177.65(177.5)588833
LAOPALA 466.6(472.1)9703
LAXMIMACH 6127.55(6184.95)7641
LICHSGFIN 661.4(659.55)1473758
LITL .95(.9)22448043
LT 1134(1142.25)1508949
LUPIN 953.95(961)1127740
M&M 1367(1371.2)611537
M&MFIN 420.9(424.2)2510605
MAGMA 179.05(175.9)325937
MAHINDCIE 238.3(236.55)72316
MAHLIFE 411.85(415.05)20699
MANAPPURAM 87.8(90.3)4817991
MANPASAND 820.8(802.85)130493
MARICO 319.85(315.95)1557457
MARKSANS 39.15(39.7)1208852
MARUTI 7582.45(7701.15)321296
MAYURUNIQ 348.35(334.4)146621
MCDOWELL-N 2601.4(2548.45)517454
MCLEODRUSS 176.65(175.35)58283
MERCK 1128.55(1100)9763
MHRIL 364.55(360.6)22994
MINDACORP 108(106.2)179632
MINDTREE 475.7(468)222738
MMTC 57.05(56.45)497369
MOIL 363.3(362.8)356323
MONSANTO 2491.65(2484.95)9335
MOTHERSUMI 323.75(331.75)2466709
MOTILALOFS 1196(1106.95)357041
MPHASIS 590.5(585.6)8487
MRF 64484.5(65783)11287
MRPL 121.15(124.45)961882
MTNL 18.4(18.6)551176
MUTHOOTFIN 463.75(453.75)520185
NATCOPHARM 772.55(763.45)352444
NATIONALUM 70.35(69.15)4856854
NAUKRI 957.2(953.9)28654
NAVKARCORP 191.85(195.25)136677
NCC 87.8(87.55)2570708
NETWORK18 52.65(53.4)202222
NHPC 30.85(31.1)1905510
NIITTECH 499.1(490.85)630944
NITINFIRE 4.8(4.8)651400
NLCINDIA 97.85(96.55)130503
NMDC 122.9(121.15)2777013
NTPC 176.8(170.1)5165177
OBEROIRLTY 369.1(370.05)40562
OFSS 3508.4(3562.75)19835
OIL 282.75(286.45)407760
OMAXE 203.8(200.95)571156
ONGC 160.6(160.95)5184915
ORIENTBANK 125.4(124)4985987
ORIENTCEM 154.6(153.5)54710
ORISSAMINE 1751.2(1733.75)3733
PAGEIND 16886.3(17071.35)9629
PARSVNATH 21.75(20)1621864
PCJEWELLER 356.5(345.05)2752924
PEL 2713.85(2748.85)151132
PERSISTENT 616.85(625.2)30206
PETRONET 228.15(229.6)7317445
PFC 125.6(118.5)12306883
PFIZER 1789.15(1787.25)4806
PFS 36.9(36.65)1588724
PGHH 8198.35(8191.85)1317
PHOENIXLTD 528.35(524.65)185516
PIDILITIND 818.2(817.9)264118
PIIND 739.6(743)119495
PNB 146.3(147.55)8384523
POLARIS 237.9(240.8)116718
POWERGRID 219.45(220.7)1596199
PRAJIND 70.25(71.5)355317
PRESTIGE 262.3(266.6)396088
PRISMCEM 112.45(112.65)64505
PTC 116.95(115.9)1421162
PUNJLLOYD 19.95(19.85)801708
PURVA 73.6(72.2)134428
PVR 1301.25(1329.2)183800
RADICO 168.7(161.5)2257062
RAIN 129.8(126.6)1525397
RAJESHEXPO 719.8(718.85)366762
RALLIS 228.85(225.95)78171
RAMCOCEM 694.5(693.5)102895
RAMCOSYS 343.45(358.2)114558
RATNAMANI 842.3(831.45)5255
RAYMOND 746(738.55)306903
RCF 98.35(93.95)7634723
RCOM 23.2(23.35)16257814
RDEL 53.25(53.35)1097162
RECLTD 169.1(164.15)6627455
REDINGTON 149(147.2)532437
RELAXO 491.4(492.95)9242
RELCAPITAL 783.25(791.2)3393364
RELIANCE 1567.1(1566.1)3618179
RELINFRA 491.4(494.35)1485534
RENUKA 17.15(16.7)3598339
REPCOHOME 681.9(697.05)160865
RIIL 425.6(414.9)304014
RKFORGE 540.7(563.05)19693
ROLTA 55.1(54.75)340171
RPOWER 40.65(40.65)2144488
RTNPOWER 5.9(5.95)1762797
RUCHISOYA 22.4(22.9)397205
SADBHAV 270.75(266.6)221589
SADBHIN 103.5(103.7)4880
SAIL 59.05(59.25)5109015
SANOFI 4097.65(4104.35)8637
SBIN 280.85(283.1)12134114
SCHAEFFLER 4390.65(4396)11522
SCHNEIDER 120.35(121.15)38733
SCI 87.6(84.4)902708
SHARDACROP 446(436)11148
SHILPAMED 571.5(576.65)17731
SHK 256.5(254.4)151409
SHOPERSTOP 335.8(338.2)35015
SHREECEM 17296.45(17494.1)13511
SHRIRAMCIT 2176.15(2162.9)20540
SIEMENS 1322.9(1308.55)125447
SIMPLEXINF 481.65(470.65)16983
SINTEX 34.7(33.95)35247474
SITINET 25.25(25.4)223906
SJVN 30.85(31.1)793314
SKFINDIA 1552.25(1558.25)3242
SMLISUZU 951.5(945.75)10769
SNOWMAN 50.85(50.8)300143
SOBHA 392.45(394.65)110203
SOMANYCERA 798.9(776.15)326839
SONATSOFTW 161.95(160.1)267304
SOUTHBANK 27.85(28)7924745
SPARC 379.3(369.55)1144669
SREINFRA 120.6(119.8)4793592
SRF 1490.65(1484.55)237217
SRTRANSFIN 976.75(978.1)618487
STAR 916.35(914.75)188321
STCINDIA 157.7(154.65)152247
SUNDARMFIN 1658.75(1647.05)7423
SUNDRMFAST 390.35(385.4)69622
SUNPHARMA 488.25(485.7)4484873
SUNTV 752.8(748.45)1000983
SUPREMEIND 1072.3(1076.8)14620
SUVEN 163.55(157.25)716019
SUZLON 17.2(17.5)29942543
SWANENERGY 120.55(118.8)124662
SYMPHONY 1242.35(1238.9)9539
SYNDIBANK 64.9(64.7)1337524
SYNGENE 449.5(453.95)29149
TAKE 138.75(136.45)173787
TATACHEM 591.35(601.1)377020
TATACOFFEE 133.85(132.65)1164517
TATACOMM 641.2(628.55)381289
TATAELXSI 1685.8(1691.7)213122
TATAGLOBAL 190.6(193.85)10381703
TATAMOTORS 385.3(389.25)5971420
TATAMTRDVR 228.6(231.6)1487470
TATAPOWER 81.65(82.05)3774599
TATASPONGE 823.8(831)110906
TATASTEEL 625.4(631.2)4616610
TBZ 105(102.5)317566
TCS 2485.65(2492.35)876187
TECHM 424.4(419.95)3175256
TECHNO 374.15(383.65)53970
TEXRAIL 90.45(88.2)406252
THERMAX 875.2(882.5)252073
THOMASCOOK 219.8(219.8)133351
TIDEWATER 5701.2(5722)550
TIMKEN 722.7(697.2)33610
TITAN 621.5(627.7)938044
TNPL 347.75(344.1)71824
TORNTPHARM 1311.7(1323.95)216066
TORNTPOWER 211.25(211.1)1665613
TREEHOUSE 15.35(15.35)50895
TRIDENT 81.55(80.2)558612
TRITURBINE 132.1(134.15)25608
TTKPRESTIG 6234.35(6260.6)4300
TTML 6.9(6.8)1350575
TUBEINVEST 821.85(817.1)203089
TV18BRDCST 36.45(36.75)2374798
TVSMOTOR 580.05(585.3)692157
TVSSRICHAK 3327.65(3371.3)3867
TVTODAY 245.15(244.45)95385
UBL 805.9(808.65)101493
UCOBANK 30.8(30.35)417610
UFLEX 413.55(412.2)124599
ULTRACEMCO 3932.9(3941.3)123889
UNICHEMLAB 251.3(250.25)33222
UNIONBANK 133.4(133.25)2867662
UNITECH 7.7(8.05)19518109
UPL 855.25(852.1)886995
VAIBHAVGBL 513.1(520.6)2318
VAKRANGEE 449.95(456.15)1473827
VEDL 304.8(297.2)19018787
VIDEOIND 19.85(20)845046
VIJAYABANK 68.35(67.85)713025
VINATIORGA 1023.35(1029.1)7646
VIPIND 195.45(196.1)262211
VOLTAS 543.35(542.5)1255237
VRLLOG 330.75(332.7)27330
VSTIND 2877.9(2811.25)8732
VTL 1141.4(1153.15)40227
WABAG 628.45(632.4)152413
WABCOINDIA 5558.4(5591.2)3238
WELCORP 121.5(121.85)371076
WELSPUNIND 77.4(77.35)293189
WHIRLPOOL 1175.85(1179.45)52324
WIPRO 288.35(289.95)2637344
WOCKPHARMA 566.8(569.95)329567
WONDERLA 342.55(339.45)13621
YESBANK 1738.1(1761.85)1913591
ZEEL 526.75(518.7)2086690
ZEELEARN 43.1(42.4)226914
ZENSARTECH 795.45(794.95)6876
ZYDUSWELL 860.35(867.4)2565

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 6.92(7.28)100
ADITYA SPIN. 8.95(8.9)790
AGRO TECH FO 519.9(506.8)294
AISHWARYA TE 4.12(4.14)7308
ALPHAGEO (I) 815.25(802.7)9665
ALU FLUORIDE 54.45(54.65)4193
AMAR RAJA BA 807.45(813.35)10236
ANDHRA BANK 51.2(51.2)150179
ANDHRA CEMEN 8.91(8.95)17053
ANDHRA PETRO 27.6(27.65)64321
ANJANI PORTL 209(204.55)1655
ASTRA MICRO 124(126)47102
AUROB.PHARMA 703.5(714.2)170611
AVANTEL LTD 222.05(220)458
AVANTI FEEDS 1906.05(1941.05)14391
B.N.RATHI SE 32.65(32.5)1820
BALAJI AMINE 312.05(313.65)1558
BAMBINO AGRO 173.1(174.6)3776
BARTRONICSIN 14.1(14)9524
BHAGIRA.CHEM 195.05(170)91534
BHAGYA INL 23.45(23.1)2688
BHARATFIN 847.45(820.75)181020
BNR UDYOG 42.4(40.25)21900
CAMBRIDGE 69.35(68)5972
CAT TECHN. .63(.66)4750
CCHHL 13.69(13.28)45828
CCL PRODUCTS 280.2(279)2370
CELESTIAL 22.7(22.45)7759
CIL SECURITS 32.5(31.15)2305
COROM INTER 443.9(448.4)43391
CUBEX TUBING 17(17.2)2560
CYIENT 507.4(499.85)12846
DANLAW TECH. 50.15(52.6)3770
DECAN CEMENT 1148.25(1133)249
DHAN ROTO SP 22(22.6)1350
DIAMONPOWER 23.3(23.65)14969
DIVI'S LAB. 645.5(656.4)65196
DIVYA.GRANIT 100(99.9)326
DQ ENT 12.94(12.1)4888155
DR.REDDY'S 2010(1998.8)45207
EMPEE SUGARS 5.33(5.23)17104
EVEREST ORG. 94.3(94.2)5398
FACOR ALLOYS 3.76(3.78)140264
FIRSTOBJ 15.9(15.35)10568
GATI LTD. 112.8(112.9)97191
GAYATRI BIO 10.83(11.4)552
GAYATRI PROJ 163.2(164.6)12227
GENNEX LAB 3.87(3.94)117833
GMR INFRASTR 18.6(16.4)18188353
GODAVARI DRU 39(36.5)3622
GOLDST INFRA 124.15(118.25)7181
GOLDSTONE EN 11.48(11.01)18003
GRANULES (I) 126.8(126.55)231272
GVK POWERINF 13.24(12.76)4028673
HBL P SYS 45.6(45.7)43264
HERITGFOOD 1294.7(1335.45)5296
HINDUSTN BIO .9(.9)7550
I.C.S.A. IND 2.75(2.8)2030
INCAP LTD. 59(58.65)7493
IPAPPM 296.85(299.6)4112
IVRCL LTD 5.24(5.23)152186
KAKATIYA CEM 346.75(343.45)3116
KALLAM SPG. 28.15(27.5)18004
KAVERI SEED 548.6(563.05)88644
KCP LTD 105.15(102.3)39543
KERNEX MICRO 33.2(32.6)5113
KNR CONST 220.1(220.6)10034
KREBS BIOCHM 96(92)351
LANCO INFRA .91(.87)17469645
LOKESH MACH 80.55(81.3)11803
MADHUCON PRJ 30.2(28.9)80209
MOLD-TEK TEC 49.25(49.3)1645
MOSCHIP SEMI 44.35(44.35)20347
MSR INDIA 33.4(31.85)5976
N C L IND. 221.2(221.75)33140
NAGAR.AGRICH 37.05(36.05)47894
NATCO PHARM 772.6(765.7)44014
NCC 87.7(87.75)368429
NEHA INTER. 4.98(5.37)389064
NETTLINX LTD 97.6(100.85)3468
NEULAND LAB. 1299(1279.8)254
NIHAR INFO 15.05(15.6)1707
NILE LTD. 621.85(583.45)16932
NTL 4.15(4.32)20000
OIL COUNTRY 43.45(42.05)8303
PADMALAYA TE 7.48(7.13)45135
PALRED 89(91.75)974
PANYAM CEMEN 60.6(62.15)7465
PENNAR STEEL 58.7(56.7)548864
PFL INFOTECH 5.75(5.77)520
PHYTOCHEM I. 46.7(44.75)6558
PITTI LAMIN. 53.6(51.85)6051
POKARNA LTD 1227.5(1229.35)280
PRAJAY ENGS. 7.94(8.04)13352
PREMIER EXPL 481.45(468.95)3177
PRISM CEMENT 111.9(112.5)35817
RAIN 130(126.75)261917
RAJ PACKAGIN 57.55(58.25)2770
RAJVIR IND 42.55(44.75)200
REG.CERAMIC 5.5(5.67)700
RESTILE CER. 4.72(4.94)8267
SAGAR CEM. 825(821.75)363
SAMKRG PIST. 263.2(264.5)7537
SAMPRE NUTRI 41(40.5)7116
SANGHI IND. 82.8(80.7)133295
SATVAH.ISPAT 39.35(38.15)33365
SAVEN TECHNO 22.35(22.45)3256
SIBAR AUTO 15.5(15.21)348
SMPL 1.66(1.74)3628
SMS PHARMACE 75.7(71.95)4932
SREE RAYALA 124.95(125.9)995
STEEL EXCH 84.15(83.95)97932
SUJANA INDUS .98(1)29261
SURANATP 4.66(4.8)2593
SURYACHAKRA 1.26(1.24)77036
SURYAMBA SP 61.8(61.55)780
SURYAVA SPIN 8.98(8.57)2750
SURYLAK.COTT 100.25(101.7)8838
SUVEN LIFE S 163.8(157.55)114190
TAJ GVK HOTL 162.7(160.15)14999
TANLA 31.5(32.2)92951
TRANSCORP IN 18.6(19.1)16177
TRANSGENE BI 2.22(2.28)12534
TRANSPORT CO 285.95(284.65)7822
USHER AGRO 6.75(6.9)27622
VICEROY HOTE 17.05(17)16359
VIJAY TEXTIL 59.85(58.8)52330
VIMTA LABS 131(133.35)44635
VIRAT CRANE 38.35(37.95)2772
VIRINCHI 80.15(80.65)50259
VISAKA IND. 506(510.3)10729
VISTA PHARMA 29.8(28.4)3168
VIVIMED LABS 106.5(104)133073
VST INDUS. 2888.35(2821.2)597
WATERBASE 108.65(108.4)106257
XLENERGY 1.66(1.78)545
YBRANTDIGI 6.82(6.77)81840
ZEN TECH 52.45(50.9)57588
ZENOTECH 46.05(46.1)11658

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై)	వెండి	రూపాయి Vs డాలర్	ముడి చమురు
▲ 24.57	▲ 6.85	▲ 305	▲ 745	▼	▼
31795.46	9904.15	29,110 (10 గ్రాములు (99.9 స్వచ్ఛత))	39,000 (కిలో (రూపాయల్లో))	64.15	50.08 (బ్యారల్ ధర (డాలర్లలో..))



సుజుకీ మరో రెండు గిక్సర్ బైక్స్

ధర రూ.81,175-రూ.99,312

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా.. 2017 సీరిస్‌లో భాగంగా గిక్సర్ ఎస్ఎఫ్ ఎస్‌పి (ఎబిఎస్, ఫ్యూయల్ ఇంజెక్షన్), గిక్సర్ ఎస్‌పి మోటార్‌సైకిళ్లను న్యూఢిల్లీలో గురువారంనాడు విడుదల చేసింది. వీటి ధర వరుసగా 99,312 రూపాయలు, 81,175 రూపాయలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ). వీటితో 150సిసిలో కంపెనీ బైక్‌ల సంఖ్య మరింతగా పెరిగినట్టయింది. ట్రైకలర్ కాంబినేషన్, ఆకర్షణీయమైన గ్రాఫిక్స్ ఉండటం వల్ల ఈ బైక్ యువతను ఎక్కువగా ఆకట్టుకుంటుందని కంపెనీ భావిస్తోంది.

బిఎస్ఎన్ఎల్ మొబైల్ వాలెట్ వచ్చేసింది..

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) మొబైల్ వాలెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. మొబిక్విక్ భాగస్వామ్యంతో ఈ వాలెట్‌ను తెచ్చినట్టు సంస్థ పేర్కొంది. ఈ వాలెట్ ద్వారా ఆన్‌లైన్ రీచార్జులు, బిల్లుల చెల్లింపులు, షాపింగ్, బస్, రైలు టికెట్ల బుకింగ్స్ చేసుకోవచ్చని, దేశవ్యాప్తంగా 15 లక్షలకు పైగా వ్యాపారస్తుల వద్ద చెల్లింపులు చేయవచ్చని తెలిపింది. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ చెల్లింపులను విస్తరించాలన్న సంస్థ లక్ష్యానికి అనుగుణంగా ఈ వాలెట్‌ను మొబిక్విక్ అభివృద్ధి చేసినట్టు బిఎస్ఎన్ఎల్ తెలిపింది. ఈ కోబ్రాండెడ్ వాలెట్ ద్వారా సులభతరమైన చెల్లింపుల సదుపాయాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించవచ్చని వాలెట్ ప్రారంభం సందర్భంగా టెలికాం శాఖ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. ఈ వాలెట్ ద్వారా తమకున్న 10 కోట్లకు పైగా కస్టమర్లు నిరంతరాయంగా, సులభతరంగా లావాదేవీలను నిర్వహించడానికి అవకాశం ఉంటుందని బిఎస్ఎన్ఎల్ చైర్మన్ అనుపమ్ శ్రీవాస్తవ తెలిపారు. తమ నెట్‌వర్క్‌లో 15 లక్షలకు పైగా మర్చంట్లు ఉన్నారని, ఈ లెక్కన దేశంలోని టెలికాం వాలెట్లలో తామే అగ్రస్థానంలో ఉన్నట్టు ఆయన చెప్పారు. ఈ వాలెట్ స్మార్ట్‌ఫోన్‌లోనే కాకుండా ఫీచర్ ఫోన్‌లోనూ పని చేస్తుందన్నారు.

ఏడాది కాలానికి బిఎస్ఎన్ఎల్ డేటా ఆఫర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆరు నెలలు, ఏడాది కాలపరిమితితో బిఎస్ఎన్ఎల్ తన ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం సరికొత్త డేటా ఆఫర్లను తెచ్చింది. బిఎస్ఎన్ఎల్ ఆన్‌లైన్ రీచార్జ్ పోర్టల్, బిఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా మాత్రమే వీటిని పొందవచ్చని సంస్థ తెలిపింది. 1,197 రూపాయల డేటా స్పెషల్ టారిఫ్ ఓచర్‌తో రీచార్జ్ చేసుకుంటే 14 జిబి డేటా ఉచితంగా లభిస్తుంది. దీని కాలపరిమితి 365 రోజులు. 597 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే 180 రోజుల కాలపరిమితితో 6జిబిల డేటా ఉచితంగా లభిస్తుందని బిఎస్ఎన్ఎల్ తెలిపింది.

పోటీ ఉన్నా.. రాబడులు మిన్న

టెలికాం రంగంలో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని బిఎస్ఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనుపమ్ శ్రీవాస్తవ తెలిపారు. అయినప్పటికీ 2016-17 ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాల ద్వారా ఆదాయం 28,477 కోట్ల రూపాయలు ఉండవచ్చని ఆయన చెప్పారు. నవంబర్ చివరినాటికి లేదా డిసెంబర్ ప్రారంభంలో సంస్థ ఆడిటెడ్ ఆర్థిక ఫలితాలను వెల్లడించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 28,449 కోట్ల రూపాయల రాబడిని నమోదు చేసుకున్నట్టు ఆయన గుర్తు చేశారు. మొబైల్, బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్ విభాగాలు మంచి పనితీరును కనబరుస్తున్నాయన్నారు. అయితే టెలికాం రంగంలో పోటీ తీవ్రంగా ఉన్నందు వల్ల అన్ని సంస్థపైనా ఒత్తిడులు పెరుగుతున్నాయని చెప్పారు. అయినప్పటికీ తాము వ్యాపారంలో నిలదొక్కుకోగలుగుతున్నట్టు తెలిపారు. నష్టాలను తగ్గించుకునే దిశగా సర్వ ప్రయత్నాలు చేస్తున్నామని, 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఎబిటా సానుకూలంగా ఉంటుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. 2013-14 సంవత్సరంలో 7,019 కోట్ల రూపాయలు, 2014-15 సంవత్సరంలో 8,234 కోట్ల రూపాయల నష్టాన్ని బిఎస్ఎన్ఎల్ ప్రకటించింది. 2015-16 సంవత్సరంలో నష్టాలు 3,880 కోట్ల రూపాయలకు తగ్గాయి.



పానసోనిక్ 'ఎలుగా ఐ2 యాక్టివ్'

• **ప్రారంభ ధర రూ.7,190**



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పానసోనిక్ ఇండియా దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఎలుగా ఐ2 యాక్టివ్ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. 2జిబి రామ్ (ధర రూ.7,990), 1జిబి రామ్ (రూ.7,190) వేరియంట్లలో అందుబాటులో ఉండే ఈ స్మార్ట్‌ఫోన్ 4జి విఓఎల్‌టిఇకి సపోర్ట్ చేస్తుంది. 5 అంగుళాల హెచ్‌డి ఐపిఎస్ డిస్‌ప్లే, 8 మెగాపిక్సెల్ వెనుక, 5 మెగాపిక్సెల్ ముందు కెమెరాలు, ఆండ్రాయిడ్ 7.0 నౌగట్ ఓఎస్, 2200 ఎంఎహెచ్ బ్యాటరీ, 16 జిబి ఇంటర్నల్ మెమరీ (128 జిబిలకు మైక్రో ఎస్‌డితో పెంచుకోవచ్చు), 1.25 గిగాహెట్జ్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్ వంటి ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయని కంపెనీ తెలిపింది.

స్వైప్ చవక 4జి స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎలైట్ 4జి పేరుతో సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ను స్వైప్ కంపెనీ మార్కెట్లోకి తెచ్చింది. దీని ధర 3,999 రూపాయలు. ఇకామర్స్ సైట్ ఫ్లిప్‌కార్ట్‌లో ఇది అందుబాటులో ఉంటుందని కంపెనీ పేర్కొంది. 1జిబి రామ్, 5 అంగుళాల ఎఫ్‌డబ్ల్యువిజిఎ డిస్‌ప్లే, 1.3 గిగాహెట్జ్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 6 ఓఎస్, 8జిబి ఇంటర్నల్ మెమరీ (64 జిబిలకు పెంచుకోవచ్చు), 8 ఎంపి వెనుక కెమెరా, 5 ఎంపి ముందు కెమెరా, 2500 ఎంఎహెచ్ బ్యాటరీ, డ్యూయల్ సిమ్ తదితర ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయి.

రూ. 1,500 కోట్లు అక్రమంగా విదేశాలకు..

ఓవర్ ఇన్వాయిసింగ్ మాయాజాలం



• **అదానీ గ్రూప్‌పై డిఆర్ఐ నివేదిక**

న్యూఢిల్లీ : అదానీ గ్రూప్‌నకు చెందిన ఒక కంపెనీ దిగుమతుల విలువను కృత్రిమంగా పెంచడం (ఓవర్ ఇన్వాయిస్) ద్వారా కూడగట్టిన 1,500 కోట్ల రూపాయలను మారిషస్ కేంద్రంగా ఉన్న ఒక కంపెనీకి తరలించినట్టు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డిఆర్ఐ) నివేదిక వెల్లడించింది. ఈ మారిషస్ కంపెనీ అదానీల కుటుంబ సభ్యులకు చెందినదిగా వెల్లడించింది. ఈ నివేదికలోని వివరాలను ది గార్డియన్ పత్రిక బయటపెట్టింది. అదానీ గ్రూప్‌నకు చెందిన ఒక కంపెనీ విద్యుత్ ప్లాంట్‌కు అవసరమైన, యంత్రసామాగ్రి, ట్రాన్స్‌మిషన్ పరికరాల దిగుమతిలో ఓవర్ ఇన్వాయిసింగ్‌కు పాల్పడినట్టుగా డిఆర్ఐ నివేదిక ఆరోపించినట్టుగా ది గార్డియన్ తెలిపింది. దేశంలోని పలు విద్యుత్ సంస్థలపై ఇలాంటి ఆరోపణలున్నాయి. ప్రాజెక్టు వ్యయాన్ని భారీస్థాయిలో పెంచి చూపడం, దిగుమతుల విలువను వాస్తవ విలువకంటే ఎక్కువగా పెంచేందుకు ఇన్వాయిస్‌లను మాయ చేయడం.. తరచూ జరుగుతుంటుంది.

2014-15 మధ్యకాలంలో అనేక కంపెనీలకు డిఆర్ఐ నుంచి షోకాజ్ నోటీసులు కూడా అందాయి. అదానీ గ్రూప్‌లోని మూడు కంపెనీలు అదానీ పవర్ మహారాష్ట్ర, అదానీ పవర్ రాజస్థాన్, మహారాష్ట్ర పవర్ ఈస్ట్రన్ గ్రిడ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ.... ఇలా దాదాపు 6,000 కోట్ల రూపాయల మేర ఓవర్‌ఇన్వాయిసింగ్‌తో అక్రమంగా సొమ్మును సొంత ఖాతాలో వేసుకున్నట్టుగా ఆరోపణలున్నాయి. దీనిపై గతంలోనే కొన్ని పత్రికల్లో కథనాలు వచ్చాయి. అదానీ గ్రూప్ ప్రమోటర్ గౌతమ్ అదానీ, ప్రధాని మోదీకి సన్నిహితుడన్న పేరుంది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీల సామ్రాజ్యం అనేక రెట్లు విస్తరించింది.

ప్రస్తుతం గార్డియన్ బట్టబయలు చేసిన డిఆర్ఐ నివేదిక ప్రకారం, మహారాష్ట్ర పవర్ ఈస్ట్రన్ గ్రిడ్ పవర్ ట్రాన్స్ మిషన్ కంపెనీ (ఎంఇజిపిటిసిఎల్), మరో రెండు కంపనీలు దుబాయ్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రోజెన్ ఇన్‌ఫ్రా ఎఫ్‌జెడ్‌ఇ (ఇఐఎఫ్), పిఎంసి ప్రాజెక్ట్స్ ఇండియాతో కలిసి, ఓవర్‌ఇన్వాయిసింగ్ ద్వారా కోట్ల రూపాయలను కూడగట్టి అక్రమంగా విదేశాలకు తరలించినట్టుగా డిఆర్ఐ ఆరోపించింది. దుబాయ్ కంపెనీ, పిఎంసి ప్రాజెక్ట్స్... రెండూ అదానీ ప్రమోటర్లకు సంబంధించినవే అన్న అనుమానాలు నివేదిక వ్యక్తం చేసింది.

ఈ నివేదిక ప్రకారం... ఎంఇజిపిటిసిఎల్ పురమాయింపుపై దుబాయ్ కంపెనీ ఈ మొత్తం వ్యవహారంలో దళారీ పాత్ర పోషించింది. చైనా, కొరియా దేశాలకు చెందిన పలు భారీ యంత్ర సామాగ్రి తయారీ సంస్థలతో పిఎంసి ప్రాజెక్ట్స్ తరపున కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. ఇక్కడే అసలు మెలిక ఉంది. తాను కొనుగోలు చేసిన యంత్రాల విలువనే కృత్రిమంగా పెంచి వాటిని పిఎంసి ప్రాజెక్ట్స్‌కు, ఎంఇజిపిటిసిఎల్‌కు విక్రయించేందుకు దుబాయి కంపెనీ ఒప్పందాలు చేసుకుంది. వాస్తవానికి యంత్రాలన్నీ కొరియా, చైనా కంపెనీల నుంచి నేరుగా ఇండియాకు చేరినప్పటికీ వాటిని దుబాయి కంపెనీ నుంచి కొనుగోలు చేసినట్టుగా చూపించారు. ఈ క్రమంలో వాస్తవ విలువకంటే కృత్రిమంగా పెంచిన విలువ సుమారు 1,500 కోట్ల రూపాయలుంటుందనీ భారత కస్టమ్స్ శాఖ అధికారులు అంచనావేశారు. ఈ అదనపు విలువ 1,500 కోట్ల రూపాయలు గుట్టుచప్పుడు కాకుండా దేశం దాటి దుబాయి కంపెనీ ఇఐఎఫ్ జేబుల్లోకి వెళ్లిపోయిందన్నమాట. ఇంతకూ ఈ ఇఐఎఫ్ వెనక ఎవరున్నారు? డిఆర్ఐ దర్యాప్తు నివేదిక ప్రకారం, అదానీ గ్రూప్ ప్రమోటర్లదే ఈ ఇఐఎఫ్ కూడా. ఇఐఎఫ్ యాజమానిగా ఎలక్ట్రోజెన్ ఇన్‌ఫ్రా హోల్డింగ్ (ఇఐహెచ్) అనే సంస్థను గుర్తించారు. ఈ ఇఐహెచ్ గురించి ఆరా తీయగా మారిషస్ కేంద్రంగా రిజిస్టరైన అసంఖ్యా రీసోర్స్ అనే ట్రస్ట్ దీనిని ప్రమోట్ చేసినట్టుగా వెల్లడైంది. ఈ ట్రస్ట్‌కు యజమానిగా వినోద్ అదానీని గుర్తించారు. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీకి ఈ వినోద్ అదానీ స్వయానా సోదరుడు.

ఈ ఓవర్ ఇన్వాయిసింగ్‌కు సంబంధించిన ఆరోపణలు వచ్చిన ప్రతిసారి, అదానీ గ్రూప్ తీవ్రంగానే ఖండిస్తూ వస్తోంది. గార్డియన్‌కు ఇంచిన వివరణలో కూడా, డిఆర్ఐ దర్యాప్తు విషయం తమకు తెలుసుననీ, దర్యాప్తు సంస్థకు తాము పూర్తిగా గతంలోనూ సహకరించామనీ, మునుముందు కూడా సహకరిస్తామని అదానీ గ్రూప్ వెల్లడించింది.

SUVEN Life Sciences www.suven.com

సువెన్ లైఫ్ ఔషధానికి పేటెంట్

న్యూఢిల్లీ : నాడీ మండల వ్యాధుల్లో ఉపయోగించే ఔషధానికి సువెన్ లైఫ్ సైన్సెస్ యూరప్, జపాన్, న్యూజిలాండ్‌లలో పేటెంట్ పొందింది. 2034 వరకు ఈ పేటెంట్లు చెల్లుబాటవుతాయని కంపెనీ తెలిపింది.

22న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

కోల్‌కతా : బ్యాంకు ఉద్యోగులు ఈ నెల 22న మరోసారి దేశ వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతున్నారు. సంస్కరణల పేరుతో బ్యాంకింగ్ రంగ ప్రైవేటీకరణ, విలీనాల ద్వారా పటిష్టీకరణ (కన్సాలిడేషన్)కు వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాల ఈ సమ్మె తలపెట్టాయి. ప్రభుత్వ రంగ బ్యాంకు(పిఎస్‌బి)లను ఒక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ పరిధిలోకి తెచ్చి వాటి ఈక్విటీలో ప్రభుత్వ వాటాను 50 శాతం దిగువకు కుదించేందుకే ప్రభుత్వం బ్యాంక్ బోర్డ్ బ్యూరో(బిబిబి)ని ఏర్పాటు చేసిందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. 6.83 లక్షల కోట్ల రూపాయలకు చేరిన పిఎస్‌బిల మొండి బకాయిల కోసం జరుపుతున్న కేటాయింపులతో వాటి ఆర్థిక పరిస్థితే ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశాయి.





1. ఒఎన్‌జిసి రాజమహేంద్రవరం అసెట్ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ భద్రతా పురస్కారం (మైన్స్)-2013 కైవసం చేసుకుని హ్యాట్రిక్ రికార్డు నమోదు చేసింది. డ్రిల్లింగ్ మైన్స్‌లో అత్యల్ప గాయాల రేటు విభాగంలో 2013-14 సంవత్సరానికి విజేతగా నిలిచింది. ఈ అవార్డును గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ రాజమహేంద్రవరం అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్-అసెట్ మేనేజర్ డిఎంఆర్ శేఖర్ అందుకున్నారు. 2.రిలయన్స్ పవర్‌కు చెందిన ససన్ మైన్‌కు జాతీయ భద్రతా అవార్డు (గనులు) లభించింది. ఈ అవార్డును రిలయన్స్ పవర్ హోల్‌టైమ్ డైరెక్టర్ ఎన్ వేణుగోపాల రావు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డుల కార్యక్రమంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ కూడా పాల్గొన్నారు.

స్మార్ట్రాన్ 'ట్రానెక్స్' ప్లాట్‌ఫామ్

రూ. 700 కోట్లకు చేరనున్న టర్నోవర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృత్రిమ మేధస్సు (ఎఐ), ఇంటర్నెట్ ఆధారిత విషయాల(ఐఒటి) ఉత్పత్తులు, సేవల స్టార్టప్ కంపెనీ 'స్మార్ట్రాన్' మరో సరికొత్త ఉత్పత్తిని ఆవిష్కరించింది. 'ట్రానెక్స్' పేరుతో ఈ సరికొత్త ఉత్పత్తిని ఆవిష్కరించింది. వ్యక్తిగత, గృహ, ఆరోగ్య, మౌలిక సదుపాయాల రంగాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాలుగు విభాగాలు(వర్టికల్స్)గా ఈ ప్లాట్‌ఫాంను అభివృద్ధి చేసినట్టు కంపెనీ వ్యవస్థాపక చైర్మన్ మహేష్ లింగారెడ్డి విలేకరులతో చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ సాయంతో ఎలాంటి యాప్‌ల అవసరం లేకుండానే ఈ వర్టికల్స్‌కు చెందిన అనేక వస్తువులు కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ సాయంతో ఒకదానితో ఒకటి అనుసంధానమై పని చేస్తాయి. ఎఐ, ఐఒటి ఆధారిత ఉత్పత్తులకు తమ ట్రానెక్స్ ప్లాట్‌ఫామ్ మలితరం ఆపరేటింగ్ సిస్టమ్(ఒఎస్)గా పని చేస్తుందని లింగారెడ్డి చెప్పారు. భారత మార్కెట్ అవసరాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసింది. వచ్చే రెండేళ్లలో 20 లక్షల ఉత్పత్తులను ఈ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానం చేయాలని కంపెనీ భావిస్తోంది. వచ్చే తొమ్మిది నెలల్లో 'ట్రానెక్స్' ప్లాట్‌ఫాంను మార్కెట్లోకి విడుదల చేస్తామని లింగారెడ్డి చెప్పారు. 'సాంకేతిక ఉత్పత్తుల రంగంలో మన దేశం చైనాని అధిగమించాలంటే వినూత్నమైన ఉత్పత్తులపై దృష్టి పెట్టడం ఒక్కటే మార్గం' అన్నారు. మన దేశానికి ఐఒటి రంగంలో అద్భుత అవకాశాలున్నట్టు తెలిపారు.

త్వరలో మరో రెండు స్మార్ట్‌ఫోన్లు

ఇప్పటికే రెండు రకాల స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేసిన స్మార్ట్రాన్ త్వరలో మరో రెండు మోడల్స్ విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం లాప్‌టాప్‌తో పాటు మొత్తం పది ఉత్పత్తులు విడుదల చేస్తామని లింగారెడ్డి చెప్పారు. ఇందులో కొన్ని ఉత్పత్తులను నవంబర్‌లో విడుదల చేసే అవకాశం ఉందన్నారు. 2018 మార్చికల్లా కంపెనీలో పెట్టుబడులు రూ.400 కోట్లకు చేరతాయని తెలిపారు. గత ఏడాది రూ.100 కోట్లున్న టర్నోవర్ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి రూ.700 కోట్లకు చేరుతుందని కంపెనీ భావిస్తోంది.

శ్రీ సిటీలో బైకుల ప్లాంట్ !

కృత్రిమ మేధస్సు, ఐఒటి ఆధారిత సాంకేతిక ఉత్పత్తులతో పాటు స్మార్ట్రాన్ త్వరలో విద్యుత్‌తో పనిచేసే బైకుల ఉత్పత్తి రంగంలోకీ ప్రవేశిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే చెన్నైకి చెందిన ఆటోమోటివ్ స్టార్టప్ కంపెనీ వోల్టా మోటార్స్‌ను కొనుగోలు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో సొంతంగా ప్లాంట్ ఏర్పాటు చేసి అక్కడ ఎలక్ట్రిక్ బైకుల ఉత్పత్తి చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించి అన్ని వివరాలు ఖరారు చేస్తామని కంపెనీ వర్గాలు చెప్పాయి.

2018నాటికి టెలికాంలో 30 లక్షల ఉద్యోగాలు

అసోచామ్-కెపిఎంజి అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: శరవేగంగా దూసుకుపోతున్న దేశీయ టెలికాం రంగం లక్షలాదిగా ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్టు అసోచామ్-కెపిఎంజి అధ్యయనంలో వెల్లడైంది. 2018నాటికి ఈ రంగం 30 లక్షల ఉద్యోగాలను కల్పించనున్నట్టు పేర్కొంది. 4జి టెక్నాలజీ విస్తృతి, డేటా వినియోగంలో పెరుగుదల, డిజిటల్ వాలెట్ల వినియోగం, స్మార్ట్‌ఫోన్ల వాడకం వంటివి టెలికాం రంగంలో కొత్త ఉద్యోగాల కల్పనకు దోహదపడనున్నట్టు అధ్యయనం తెలిపింది. టెలికాం రంగంలోని కంపెనీల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. ఫలితంగా టారిఫ్‌లు గణనీయంగా తగ్గిపోయాయి. కంపెనీ రాబడులు, లాభదాయకతపైనా దెబ్బపడింది. ఈ నేపథ్యంలో ఈ రంగం లక్షలాది మందికి ఉపాధిని కల్పించనున్నట్టు అసోచామ్-కెపిఎంజి అధ్యయనంలో వెల్లడికావడం విశేషం. వినియోగదారుల నుంచి వచ్చే సగటు రాబడి బాగా తగ్గిపోయిందని, ఈ నేపథ్యంలో కంపెనీలు ఇతర సంస్థల నుంచి పోటీని తట్టుకోవడానికి తమ మౌలిక సదుపాయాలు, టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసేందుకు తప్పనిసరిగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని అధ్యయనం పేర్కొంది.

రానున్న కాలంలో ఈ రంగంలో డిమాండ్ బాగా పెరగనుందని, ఇందుకు ప్రస్తుతమున్న మానవ వనరులు, వారి నైపుణ్యాలు సరిపోవని తెలిపింది. ఇన్‌ఫ్రా, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, అప్లికేషన్ డెవలపర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హ్యాండ్‌సెట్ టెక్నీషియన్ల అవసరం గణనీయంగా పెరగనుందని పేర్కొంది. ఇప్పుడున్న మానవ వనరుల నైపుణ్యాలను మరింతగా పెంచాల్సిన అవసరం తెలిపింది. 5జి, ఎం2ఎం (మెషిన్ టు మెషిన్), ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్స్ టెక్నాలజీ విస్తృతి కారణంగా 2021 నాటికి 8.70 లక్షల మందికి ఉపాధి లభించనున్నట్టు పేర్కొంది. ఇక టెలికాం కంపెనీల మధ్య పోటీ వల్ల మార్జిన్లపై ఒత్తిడి క్రమక్రమంగా పెరుగుతోందని అధ్యయనం తెలిపింది. దేశంలో ఎక్కువ మంది కస్టమర్లు ప్రీపెయిడ్ ఖాతాదారులేనని, వీరి ద్వారా వచ్చే సగటు రాబడి కూడా తక్కువగా ఉందని పేర్కొంది. కంపెనీలపై రుణ భారం పెరిగిపోవడం, లాభాదాయకతపై ప్రభావం పడటం వల్ల టెలికాం రంగ ఆర్థిక పరిస్థితి మరింతగా ప్రభావితమైనట్టు వెల్లడించింది.

గత ఏడాదిలో మొబైల్ డేటా ట్రాఫిక్ 76 శాతం మేర పెరిగిందని, స్మార్ట్‌ఫోన్ల వినియోగంలో వృద్ధే ఇందుకు కారణమని అధ్యయనం పేర్కొంది. 2020నాటికి దేశంలో మొత్తం సిమ్ కనెక్షన్లు 140 కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం వీటి సంఖ్య 110 కోట్లుగా ఉంది. ప్రపంచ మొబైల్ మార్కెట్లో భారత్ రెండో స్థానంలో ఉంది. 2020నాటికి టెలికాం రంగం ద్వారా దేశ జిడిపికి సమకూరే మొత్తం 8.2 శాతానికి చేరుకునే అవకాశం ఉందని అధ్యయనం అంచనా వేసింది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) సొల్యూషన్స్‌కు విపరీతమైన మార్కెట్ ఉందని, 2020నాటికి ఇది 1,500 కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొంది. 2016 సంవత్సరంలో ఈ మార్కెట్ పరిమాణం 560 కోట్ల డాలర్లుగా ఉంది. 2016-20 సంవత్సరంలో మూలధన పెట్టుబడులు 3,500 కోట్ల డాలర్లు ఉండవచ్చని అధ్యయనం పేర్కొంది.

వైసీపీకి ఓటమి భయం!

(మొదటి పేజీ తరువాయి)

వెనకబడిపోయింది. టీడీపీ గెలుపు ఖాయమని తేలింది. ఎలాగోలా ఈ ఎన్నిక ఆపాలని వైసీపీ ఆలోచిస్తున్నట్లు సమాచారం వస్తోంది. శాంతి భద్రతల సమస్యను లేవనెత్తడం లేదా మరో సమస్య సృష్టించడం ద్వారా పోలింగ్‌ను వాయిదా వేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది" అని ఒకరిద్దరు నేతలు ఈ భేటీలో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌లో ఉన్న తన శ్రేయోభిలాషులు ఈ విషయంలో సహకరిస్తారని జగన్ భావిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ప్రయత్నాలను తీవ్రంగా పరిగణించాలని వారు చంద్రబాబును కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ... వైసీపీలో నిస్పృహ అలుముకోవడంతో ఎటువంటి ప్రయత్నాలకైనా ఒడిగట్టవచ్చని, ఈ విషయంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండటం అవసరమని అభిప్రాయపడినట్లు తెలిసింది. కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టడానికి సకల ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిని తగిన విధంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు. నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ ప్రచారం చురుగ్గా సాగుతోందని... అయితే, చివరి నిమిషం వరకూ అప్రమత్తంగా ఉండాలని పర్యవేక్షణ బాధ్యతలను తీసుకొన్న నేతలకు ఈ భేటీలో సూచించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యాలయం గుంటూరులో ఉండటం కొంత అసౌకర్యంగా ఉందన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. పార్టీ కొత్త కార్యాలయం నిర్మాణానికి మంగళగిరిలో ఇప్పటికే స్థలం కేటాయింపు జరిగినందువల్ల అక్కడ తక్షణం భవన నిర్మాణం ప్రారంభించాలని నిశ్చయించారు. సరిగ్గా ఏడాదిలో భవనం నిర్మాణం పూర్తి చేసి అప్పగించాలని మంత్రి లోకేశ్‌ను చంద్రబాబు ఆదేశించారు. పార్టీ, ప్రభుత్వం మధ్య అనుసంధానానికి ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీలోకి కొత్తగా సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, అచ్చెన్నాయుడును తీసుకోవాలని నిర్ణయించారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావును పంపాలని నిర్ణయం తీసుకొన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచార సమన్వయ బాధ్యతను మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడులకు అప్పగించారు.

ఓటమి భయంతోనే: అచ్చెన్నాయుడు

నంద్యాలలో వైసీపీ ఓటమి ఖాయం కావడంతో ఎలాగైనా ఎన్నికలు వాయిదా వేయించాలని జగన్ కుట్రలు పన్నుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌తోపాటు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. "ముఖ్యమంత్రి చంద్రబాబును కాల్చాలని, ఉరి తీయాలని, కాలర్ పట్టుకుని నిలదీయాలని జగన్ రెచ్చగొట్టారు. నంద్యాల ప్రజలు విజ్ఞులు కావడంతో ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్నికలు అయిన తర్వాత వైసీపీ జెండా పీకే పరిస్థితి వస్తోందనుకున్నాం. కానీ... అంతకుముందే వైసీపీ జెండా పీకేస్తోంది" అని అచ్చెన్న వ్యాఖ్యానించారు. ఎన్ని ప్రయత్నాలు చేసిన ఓటర్లు టీడీపీ చేసిన అభివృద్ధివైపు మొగ్గు చూపుతున్నారని... దిక్కుతోచని స్థితిలో జగన్ ఎక్కడికక్కడ గొడవలు సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని అంతర్గతంగా జరిగిన వైసీపీ సమావేశంలో పార్టీ శ్రేణులకు సూచించినట్లు తెలిసిందన్నారు. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు పెట్టి ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా చూడాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

26 నుంచి 'జలసిరికి హారతి'.. 3 నుంచి ఇంటింటికీ తెలుగుదేశం

ఈ నెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ 'జలసిరికి హారతి' పేరుతో ఒక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా పూర్తి చేసిన సాగునీటి పథకాల నుంచి నీటి విడుదలను ఒక ఉత్సవంగా నిర్వహిస్తున్నారు.ఇక, సెప్టెంబరు మూడో తేదీ నుంచి రెండు నెలలపాటు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించాలని నిశ్చయించారు.

భూమాతో విభేదాలు గతం

- బాబు, నేను మంచి స్నేహితులం: గంగుల ప్రతాపరెడ్డి

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి గురువారం లాంఛనంగా టీడీపీలో చేరారు. మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డితో కలిసి ఆయన విజయవాడలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరుగుతున్న నర్సరీ ఎక్స్‌పో వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. టీడీపీలో చేరుతున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. బుధవారం రాత్రి ఉండవల్లిలో ముఖ్యమంత్రిని కలిసి చర్చించిన తాను.. టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు గంగుల తెలిపారు. గురువారం ఆ లాంఛనాన్ని పూర్తి చేసుకుని.. చంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి బాటలో నడుద్దామని తన అనుచర గణానికి పిలుపిచ్చారు. ముందు నుంచీ చంద్రబాబు, తాను మంచి స్నేహితులమని, గతంలో కూడా చంద్రబాబుపై సమస్యల విషయంలో మాట్లాడానని, విమర్శించలేదన్నారు. గతంలో తనకు భూమా నాగిరెడ్డితో విభేదాలు ఉండేవని అంగీకరించారు. 'అయితే ఇప్పుడాయన లేడు. ఆ చిన్న పిల్లలతో విభేదాలేముంటాయి' అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు.



గంగుల ప్రతాప్ రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం చంద్రబాబు

లెక్కలేస్తున్నారు!

- కులాలు, మతాల వారీగా వ్యూహాలు
- గ్రామీణ, పట్టణ ఓటర్లపై నజర్
- పార్టీలకందని తటస్థుల నాడి
- రెండో అంచెలోకి ఉప ఎన్నిక
- రేపు, ఎల్లుండి సీఎం ప్రచారం

(నంద్యాల నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



మరో ఐదు రోజులు! నంద్యాల ఉప ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ఘట్టం ఈనెల 23వ తేదీనే! ఇప్పటిదాకా జరిగింది ఒక లెక్క! ఇకపై జరగబోయేది మరో లెక్క! పరిస్థితులకు అనుగుణంగా పార్టీల వ్యూహాలు మారుతున్నాయి. సామాజిక వర్గాల వారీగా కుస్తీపట్లు పట్టి... ఆయా కులాల పెద్దలను కలిసి మద్దతుపై హామీ తీసుకుంటున్నారు. వార్డుల వారీగా ఏ కులానికి ఎన్ని ఓట్లు ఉన్నాయి, అక్కడ ఏ పార్టీ బలమెంత అనే అంచనాకు వచ్చారు. ఇప్పుడు పోలింగ్ తేదీ సమీపించిన నేపథ్యంలో... ఈ వ్యూహాలకు పదునెక్కిస్తున్నారు.

నంద్యాల నియోజకవర్గంలో మొత్తం 2,19,612 ఓటర్లు ఉన్నారు. ఇందులో ఒక్క నంద్యాల పట్టణంలోనే 1,35,000 ఓటర్లున్నారు. నంద్యాల మండలంలో 45 వేలు... గోస్పాడు మండలంలో 29 వేలదాకా ఓట్లు ఉన్నాయి. మొత్తం నియోజకవర్గంలో మైనారిటీల ఓట్లు అత్యధికంగా 45వేలున్నాయి. తర్వాత... బలిజ 40 వేలు, వైశ్యులు 20 వేలు, రెడ్లు 15వేలు, బ్రాహ్మణులు 5వేల ఓట్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎస్సీలలో మాలలు 18 వేలు, మాదిగలు 12వేల మంది ఓటర్లు ఉన్నారు. బీసీల ఓట్లు 41వేల దాకా ఉన్నట్లు అంచనా. ఈ లెక్కల్లో 5 శాతం అటూ ఇటు ఉండొచ్చని చెబుతున్నారు. గెలుపులో కీలకమైన మైనారిటీల ఓట్ల విషయంలో వైసీపీలో గతంలో ఉన్నంత ధీమా ఇప్పుడు కనిపించడంలేదు. 'ముస్లిం యువతపై శిల్పా గతంలో కేసులు పెట్టించి వేధించారనే ప్రచారం బలంగా వెళ్లింది. దీనిపై ఫరూక్ చేస్తున్న వ్యాఖ్యలు ప్రభావం చూపే అవకాశం ఉంది' అని వైసీపీ నేత ఒకరు అంతర్గత సంభాషణల్లో అంగీకరించారు.

తటస్థులు ఎటు...

నంద్యాల నియోజకవర్గ ఓటర్లలో 40 శాతం మంది తటస్థులు ఉన్నట్లు పార్టీలు అంచనా వేస్తున్నాయి. హోరాహోరీగా రాజకీయపక్షాలు ప్రచారం చేస్తున్నా వీరు మాత్రం తమకేమీ పట్టనట్లుగా ఉంటున్నారు. నంద్యాల ఎన్నికలు ఏకపక్షం కాదని 2014 ఎన్నికల ఫలితాల సరళిని చూస్తే అర్థమవుతుందని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. అప్పట్లో నంద్యాలలో వైసీపీ తరఫున భూమా నాగిరెడ్డి, టీడీపీ నుంచి శిల్పా మోహన్ రెడ్డి పోటీ చేశారు. వైసీపీకి 82,194 ఓట్లు రాగా, టీడీపీకి 78,590 ఓట్లు వచ్చాయి. శిల్పాపై భూమా 3604 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. కర్నూలు జిల్లాలో వైసీపీ గాలి బలంగా వీచినా... నంద్యాలలో వారి గెలుపు ఏకపక్షం కాలేదని గుర్తు చేస్తున్నాయి.

నేనూ ఉన్నానంటున్న కాంగ్రెస్

రాష్ట్ర విభజన జరిగాక దెబ్బతిన్న కాంగ్రెస్.. నంద్యాల ఉప ఎన్నికల్లో చురుకుగా కదులుతోంది. గెలుపుపై ఆశలు లేకున్నా.. గౌరవప్రదమైన ఓట్లు దక్కించుకోవడంపై దృష్టి సారించింది. అందుకే మైనారిటీ వర్గానికి చెందిన అబ్దుల్ ఖాదర్‌ను అభ్యర్థిగా నిలిపింది. పీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి నంద్యాలలో ఉండి ప్రచారం చేస్తున్నారు.

ఇక 'ముందస్తు' లెక్కలు

టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి తరఫున ప్రచార బరిలోకి దిగిన టీడీపీ ముఖ్య నేతలు ప్రచార పర్వానికి ముందస్తుగానే ముగించనున్నారు. ఇతర జిల్లాల నేతలు పోలింగ్‌కు 48 గంటల ముందుగానే నియోజకవర్గం నుంచి వెళ్లాల్సిందే. మరోవైపు... 19, 20 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నంద్యాలకు వస్తున్నారు. ఇప్పటి దాకా తమ నేతలు జరిపిన ప్రచార ఫలితాన్ని 'సంఘటితం' చేసి... మరింతగా జనం మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా ప్రచారం చేయనున్నారు. ఇక... వైసీపీ అధినేత జగన్ ప్రచార గడువు ముగిసేదాకా, అంటే ఈ నెల 21న సాయంత్రం వరకూ నంద్యాలలోనే ఉంటారు.

కొత్త ముఖాలు!

- తమిళనాడు, తెలంగాణ వాహనాలు
- కిటకిటలాడుతున్న వీధులు

నంద్యాల నియోజకవర్గంలోని ఏ వార్డు చూసినా కొత్త ముఖాలే కనిపిస్తున్నాయి. తెలంగాణ, తమిళనాడు రిజిస్ట్రేషన్ వాహనాలు నంద్యాల రోడ్లపై తిరుగుతున్నాయి. హోటళ్లు, లాడ్జీలు 'నో రూమ్' బోర్డులను పెట్టేశాయి. దీంతో... ఇతర జిల్లాల నుంచి ప్రచారం కోసం వచ్చిన నేతలు, కార్యకర్తల విడిది కోసం నిర్మాణాలు పూర్తయిన అపార్టుమెంట్లను వినియోగిస్తున్నారు. అద్దెకు పరుపులు తీసుకుని ఈ నెల 21 దాకా కాలం గడిపేలా ఏర్పాట్లు చేశారు. అసలే ఇరుకు సందులు, ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతుండటం... దీనికి తోడు నేతల హడావుడితో ట్రాఫిక్ ఇక్కట్లు పెరిగిపోయాయి. 'ఎందుకొచ్చిన ఎన్నికలు' అని విసుక్కోవడమూ కనిపిస్తోంది.

పవన్ తడ'బాట'?

(మొదటి పేజీ తరువాయి)

భిన్నమైన పంథా అని చాటడానికి పవన్ గట్టి ప్రయత్నం చేశారు. పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చిన ఆయన ఆ తర్వాత అవే ప్రభుత్వాలపై నిరసన గళం విప్పడానికి వెనకాడలేదు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంపై విరుచుకుపడ్డారు. రాజధానికి భూముల సేకరణ విషయంలో ప్రభుత్వ వైఖరికి భిన్నంగా ఆ ప్రాంతంలో పర్యటించి భూములు ఇవ్వడానికి నిరాకరించిన రైతులకు మద్దతు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రొయ్యల ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు విషయంలో కూడా ప్రభుత్వ వైఖరితో విభేదిస్తూ వామపక్షాల పోరాటానికి మద్దతు తెలిపారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలపైనా ఒత్తిడి పెంచారు. ఆయా అంశాల్లో రాజకీయ మిత్రత్వాలతో సంబంధం లేకుండా తన అభిప్రాయాలను భావోద్వేగంతో మిళితం సూటిగా చెప్పారు. పవన్ ఏం చెప్పినా ఒక ఎమోషన్‌తో బలంగా చెబుతారని... దాగుడుమూతలు ఉండవన్న అభిప్రాయాన్ని కలిగించారు. కానీ, నంద్యాల ఉప ఎన్నిక వద్దకు వచ్చేసరికి ఆయన దీనికి భిన్నమైన వైఖరి అవలంబించారు. నిజానికి... ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలో నిలిచిన భూమా కుటుంబానికి చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యంతో గట్టి బంధమే ఉంది. ప్రజారాజ్యం పార్టీలో రాయలసీమ నుంచి మొదటగా చేరిన ప్రముఖుల్లో భూమా నాగిరెడ్డి కుటుంబం ఒకటి. నాగిరెడ్డి, ఆయన సతీమణి శోభ ప్రజారాజ్యం వ్యవస్థాపకుడు చిరంజీవితోపాటు పవన్‌కు కూడా బాగా సన్నిహితులు. ఆ సాన్నిహిత్యం, మరణించిన వారి కుటుంబం నుంచే ఉప ఎన్నికల్లో అవకాశం కల్పించే సంప్రదాయం కలిసి పవన్ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయని చాలా మంది అనుకొన్నారు. టీడీపీ అభ్యర్థికి పవన్ మద్దతు ఇస్తే దానిని ఎలా ఎదుర్కోవాలా అని వైసీపీ నేతలు తర్జనభర్జన పడ్డారు. అయితే... టీడీపీ అభ్యర్థికి మద్దతు ఇస్తే తనపై ప్రభుత్వ అనుకూల ముద్ర పడుతుందన్న భయంతోనే పవన్ వెనక్కు తగ్గారని అంటున్నారు. చిరంజీవి కూడా ప్రజారాజ్యం పెట్టిన కొత్తలో సరిగ్గా ఇటువంటి వైఖరే అవలంబించారు. ఆయన తన పార్టీ ఏర్పాటు ప్రకటించిన తర్వాత కొన్ని ఉప ఎన్నికలు వచ్చాయి. వాటిలో ఆయన పోటీ చేయలేదు. ఎవరికీ మద్దతు ఇవ్వలేదు. సాధారణ ఎన్నికలే తమ లక్ష్యమని ఆయన ప్రకటించి పక్కకు తప్పుకొన్నారు.

సరిగ్గా ఇప్పుడు పవన్ కల్యాణ్ కూడా అదే వైఖరే తీసుకొన్నారు. ఇక... పవన్ నిర్ణయం మరో ఆసక్తికర విశ్లేషణకు అవకాశం ఇవ్వబోతోంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తుది ఫలితాన్ని ఆయన తన ప్రచారంతో ప్రభావితం చేశారని అభిమానులు విశ్వసిస్తుంటారు. ఇప్పుడు నంద్యాలలో ఆయన ప్రభావం లేకుండానే తీర్పు వెలువడనుంది. అది పవన్‌కు లాభమో... నష్టమో చూడాల్సి ఉంది.

'కారుణ్యం' చూపిన సీఎం

- ఇంటర్ చదివిన వారికీ ఉద్యోగం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల్లో క్లర్క్ పోస్టులో చేరాలంటే అభ్యర్థులు తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఈ నిబంధన వల్ల వేలాది మంది నష్టపోతున్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగులు పొందలేకపోతున్నారు. ఇదే విషయాన్ని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు గురువారం వెలగపూడిలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల గురించి సీఎంతో చర్చించారు. దీనిపై తక్షణమే స్పందించిన సీఎం చంద్రబాబు.. వారి సమక్షంలోనే సంబంధిత ఫైల్‌ను తెప్పించి సంతకం చేశారు. ఇంటర్ పూర్తి చేసిన వారికీ కారుణ్య నియామకంలో పోస్టింగ్ ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. తమ వినతిపై సీఎం వెంటనే స్పందించి ఫైల్‌పై సంతకం చేయడంతో ఎన్జీవో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం నిర్ణయం వల్ల ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకూ క్లర్క్ పోస్టు ఇస్తారని విలేకరులకు చెప్పారు. క్లర్క్ పోస్టులో చేరిన ఐదేళ్లల్లో డిగ్రీ పూర్తి చేయాలని తెలిపారు. సీఎం నిర్ణయం వల్ల వేలాది మందికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఈమేరకు త్వరలోనే జీవో వస్తుందని చెప్పారు.

చక్రపాణిరెడ్డి రాజీనామా ఆమోదం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నేత శిల్పా చక్రపాణి రెడ్డి ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఆమోదిస్తూ రాష్ట్ర శాసనమండలి నుంచి గురువారం బులెటిన్ వెలువడింది. మండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రమణ్యం 2 రోజుల క్రితం ఆయన రాజీనామాను ఆమోదించారు. దీన్ని ధ్రువీకరిస్తూ శాసనసభ ప్రత్యేక కార్యదర్శి రామాచార్యులు గురువారం బులెటిన్ విడుదల చేశారు. ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయిందని అందులో పేర్కొన్నారు.

డిగ్రీ లెక్చరర్ల ఫిట్‌మెంట్‌కు ఆమోదం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల లెక్చరర్ల వేతనాలకు సంబంధించిన ఫిట్‌మెంట్‌కు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. దీంతో జూనియర్ లెక్చరర్ల కంటే తక్కువ వేతనం పొందుతున్న దాదాపు 450మంది అధ్యాపకులకు ఊరట లభించింది. అధ్యాపకుల పోరాటం విజయవంతం కావడం పట్ల పీడీఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రమణ్యం, బొడ్డు నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు కమిటీ

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు కొత్త ఉమ్మడి సర్వీస్ రూల్స్ తయారు చేయడానికి, నిబంధనల విడుదలకు విద్యాశాఖ కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీ కన్వీనర్‌గా ఇంటర్‌బోర్డు మాజీ సెక్రటరీ ఎం.వి. సత్యనారాయణ, సభ్యులుగా ఎమ్మెల్సీలు డాక్టర్ ఎ.ఎస్.రామకృష్ణ, జి.శ్రీనివాసులునాయుడు, వి.బాలసుబ్రమణ్యం, కత్తి నరసింహారెడ్డి, రాము సూర్యారావుతో పాటు పాఠశాల విద్యా కమిషనరేట్‌కు చెందిన కె.రవీంద్రనాథరెడ్డి (జేడీ-సర్వీసెస్), ఎస్.వి.ఎన్.కృష్ణ (ఏడీ-సర్వీసెస్), ఉపాధ్యాయ సంఘాల నేతలు నియమితులయ్యారు. ఈనెల 31లోగా కమిటీ నివేదికను అందజేయాలి.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల జీతాలు పెంపు

- 20వేల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు లబ్ధి

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న 20 వేలమంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెరిగాయి. ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు (నెం.5555) విడుదల చేశారు. మండల స్థాయిలో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్వో, అకౌంటెంట్లకు రూ.17,755, ఐఈఆర్‌టీఎస్, టీఎల్ ఎంటీఎస్ సబ్బందికి రూ.20,255, మెసెంజర్స్, పార్ట్‌టైమ్ బోధకులకు రూ.14,203 చొప్పున వేతనాలు లభిస్తాయి. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు రూ.25వేల నుంచి 27,755, కేజీబీవీ సీఆర్‌టీలకు రూ.19వేల నుంచి 21,755 చెల్లిస్తారు. వంటమనిషి, అటెండర్, స్వీపర్, కంప్యూటర్ ఆపరేటర్, నైట్ వాచ్‌మన్లకు రూ.14,203, కేజీబీవీ ఏఎన్ఎంలకు రూ.17,755, పీఈటీలకు 21,755 చొప్పున పెంచిన వేతనాలు ఆగస్టు 1నుంచి అమలు చేయనున్నారు.

వచ్చే సంగ్రామానికి నంద్యాల నాంది



నంద్యాలలో ప్రసంగిస్తున్న జగన్

- ప్రభుత్వ పనితీరుపైనే ఓటు
- ఇది ధర్మం-అధర్మం మధ్య యుద్ధం: జగన్

నంద్యాల టౌన్, ఆగస్టు 17: రాష్ట్రంలో 2019లో జరిగే ఎన్నికల సంగ్రామానికి నంద్యాల ఉప ఎన్నిక నాంది పలుకుతుందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అన్నారు. గురువారం ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆయన ప్రసంగించారు. నంద్యాల ఓటర్లు ఓటు వేసేది ఎమ్మెల్యే కోసం కాదని, ప్రభుత్వ పనితీరుపై ఓటు వేస్తున్నారని తెలిపారు. ధర్మం, అధర్మం మధ్య ఎన్నికల యుద్ధం జరుగుతోందని, ప్రతి ఒక్కరూ భగవంతుడిపై నమ్మకం ఉంచి.. ధర్మానికి, న్యాయానికి ఓటు వేయాలని కోరారు. తాను అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడికి ఉచితంగా ఇంటిని నిర్మించడంతో పాటు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల అభివృద్ధిని తనకు వదిలి వేయాలని, పులివెందుల మాదిరి అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. నంద్యాలలో ఓట్ల కోసం సీఎం, ఆయన కుమారుడు మంత్రి లోకేశ్ రోడ్డుపై తిరుగుతున్నారని, రాష్ట్ర మంత్రివర్గాన్ని నంద్యాలలో మకాం వేయించి ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చే నాయకులు ఎన్నికల తరువాత అమలు చేయకుంటే కాలర్ పట్టుకునేలా ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దళితులు

శిల్పా భూ కబ్జాదారు

- చెరువు కోసం భూమి తీసుకుని ఆక్రమించారు
- నంద్యాల ఆర్డీవో ఆఫీసు వద్ద దళితుల ధర్నా

నంద్యాల, ఆగస్టు 17: నంద్యాల ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిల్పా మోహన్‌రెడ్డి భూ కబ్జాదారు, దళిత వ్యతిరేకి అంటూ దళితులు ఆందోళనకు దిగారు. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యామాల సుదర్శనం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాముడు, జిల్లా అధ్యక్షుడు నాగముని ఆధ్వర్యంలో గురువారం వందలాది మంది దళితులు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. నంద్యాల మండలం చాబోలు గ్రామంలో గ్రామ నీటి అవసరాల కోసం ఊట చెరువు నిర్మించాలని భావించారు. ఇందుకోసం ఇతరుల భూములతో పాటు అదే గ్రామానికి చెందిన కడియం మార్తమ్మకు చెందిన 2.15 ఎకరాల భూమిని తీసుకున్నారు. ఆ సమయంలో భూమి ఇచ్చినందుకు తమ కుటుంబంలో నలుగురికి ఉద్యోగాలు ఇస్తామని, నష్టపరిహారం కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని బాధితులు ఆరోపించారు. తామిచ్చిన భూమిలో ఊట చెరువు నిర్మించకుండా శిల్పా మోహన్ రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డి, పోచా మాధవ రెడ్డి తమ సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం ఆర్డీవో రాంసుందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. బాధ్యులకు నోటీసులు జారీ చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

వెబ్‌సైట్లో 'గ్రూప్-2' రెస్పాన్స్ షీట్లు

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గత నెలలో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్‌కు సంబంధించి మరో 67 మంది అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్లో ఉంచినట్లు ఏపీపీఎస్సీ సెక్రెటరీ వై.వి.ఎస్.టి. శాయి తెలిపారు. విశాఖపట్నంలోని 'గీతం' విశ్వవిద్యాయలంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో కోడ్ నెం.286 సెంటర్ వద్ద నిరసనకు దిగిన 226మంది అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లను గతంలో వెబ్‌సైట్లో పెట్టలేదు. అదే సెంటర్‌లో పరీక్ష రాస్తున్న 67మంది మాత్రం పరీక్షా కేంద్రం నుంచి బయటకు రాలేదు. ఈ మొత్తం వ్యవహారాన్ని సీసీ కెమెరాల ద్వారా పరిశీలించిన ఏపీపీఎస్సీ 67 మందికి సంబంధించిన రెస్పాన్స్ షీట్లను గురువారం తన వెబ్‌సైట్లో పెట్టింది. మిగిలిన 159 మందిని ఇంకా విచారించాల్సి ఉందని శాయి పేర్కొన్నారు.

అభిమానికి బాలయ్య చెంపదెబ్బ

- తోపులాటపై ఆగ్రహం



కర్నూలు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సినీహీరో బాలకృష్ణను సన్మానించేందుకు వెళ్లిన అభిమానుల మధ్య బుధవారం రాత్రి తోపులాట చోటు చేసుకుంది. ఆ సమయంలో మీద పడబోయిన ఓ అభిమానికి చెంప చెల్లుమనిపించారు బాలయ్య. నంద్యాలలో చోటు చేసుకున్న ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా బాలకృష్ణ బుధవారం ఉదయం 10.30 గంటలకు నంద్యాల మండలం వెంకటకృష్ణాపురానికి చేరుకున్నారు. నంద్యాల, గోస్పాడు మండలాల్లో పలు గ్రామాలు, పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. దాదాపు 12 గంటలు రోడ్‌షోలో పాల్గొన్న బాలకృష్ణ అలసిపోయి విశ్రాంతి కోసం స్థానిక హోటల్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న అభిమానులు తమ హీరోను గజమాలతో సన్మానించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. బాలయ్యను చూడగానే 'జై బాలయ్య' అని నినాదాలు చేస్తూ దూసుకొచ్చారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట జరిగింది. బాలయ్య పక్కనే ఉన్న ఓ అభిమానిని వెనుక నుంచి మరొకరు తోసివేశారు. దీంతో మీద పడబోయిన అభిమానిని చెంప మీద కొట్టారు బాలయ్య. అనంతరం అక్కడి నుంచి గదిలోకి వెళ్లిపోయారు.


మో'కీలు' మార్పిడి మరింత సులభం

- పాక్షిక శస్త్ర చికిత్సతో ఆరు గంటల్లో నడవొచ్చు
- ఇది యూకే తరహా వైద్యం అంటున్న డాక్టర్లు

బంజారాహిల్స్/హైదరాబాద్, ఆగస్టు 17: మోకాలు కీలు మార్పిడిలో తలెత్తుతున్న సమస్యలను అధిగమించేందుకు యూకే తరహా పాక్షిక శస్త్ర చికిత్సలను నగర వైద్యులు అందుబాటులోకి తీసుకువచ్చారు. కీలు మార్పిడిలో ప్రస్తుతం కీలును తొలగించి ఇంప్లాంట్ అమర్చుతున్నారు. అన్ని వయస్సుల వారికి ఇదే ప్రక్రియ ద్వారా మార్పిడి చేస్తున్నారు. అయితే మధ్య వయస్కుల్లో మోకాలి నొప్పి(ఎర్లీ ఆస్టియో ఆర్థరైటిస్) ఉన్న వారికి పాక్షిక శస్త్ర చికిత్స అందించి త్వరగా కోలుకునేలా చేయొచ్చని వైద్యులు చెబుతున్నారు. స్టార్ ఆస్పత్రిలో గురువారం యూకే మాంచెస్టర్‌లోని రాయల్ ఇన్‌ఫార్మరీ ఆస్పత్రి కన్సల్టెంట్ ఆర్థోపెడిక్, ట్రామా సర్జన్ డాక్టర్ ఫిల్‌హర్స్ట్, స్టార్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నీలం రమణారెడ్డిలు మాట్లాడుతూ.. పాక్షిక శస్త్రచికిత్స వివరాలు వెల్లడించారు. ఎముకలో దెబ్బతిన్న కొంత భాగాన్ని మాత్రమే ద్వారా తొలగించి చికిత్స అందిస్తున్నామని, మధ్య వయస్కులు, యువకులకు మాత్రమే ఈ సర్జరీ చేస్తున్నట్లు తెలిపారు. సర్జరీ అయిన ఆరు గంటల్లో సాధారణంగా నడవవచ్చని చెప్పారు. శస్త్ర చికిత్స అయ్యాక అన్ని పనులు చేసుకోవచ్చని, కింద కూడా కూర్చోవచ్చన్నారు. అలాగే పూర్తి కీలు మార్పిడిలో కొత్త తరహా చికిత్సలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

250 కోట్లతో అర్చక నిధి!

- జీతాలు తగ్గించం.. ఆందోళన వద్దు: మంత్రి మాణిక్యాలరావు



తిరుపతి/ తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్చకుల సంక్షేమం కోసం రూ.250కోట్లతో అర్చక నిధిని ఏర్పాటుచేసే ప్రతిపాదన ఉందని దేవాదాయ శాఖమంత్రి పి.మాణిక్యాలరావు అన్నారు. జీతాలు తగ్గిస్తారనే ప్రచారం సరికాదని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన పడవద్దని అర్చకులకు సూచించారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అల్పాదాయ, ఆదాయ రహిత ఆలయాలన్నింటిలోనూ గర్భగుడి సిబ్బందికి వేతనాలను రూ.10వేలకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉందని చెప్పారు. గురువారం ఉదయం మంత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ టీటీడీ బోర్డును త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు.

నియోజకవర్గాల పునర్విభజన అవసరమే

- 26న వెంకయ్యకు పౌరసన్మానం: మంత్రి కామినేని




నర్సీపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. దీనివల్ల మిత్రపక్షాలైన టీడీపీ, బీజేపీ రెండూ లబ్ధి పొందుతాయన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నియోజకవర్గాలు పెరిగితే బీజేపీ మరికొన్ని స్థానాలను అదనంగా అడిగి తీసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. ఈ అంశాలను పార్టీ అధిష్ఠానంతోపాటు కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళతామని మంత్రి చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎనలేని కృషి చేశారని, ఈనెల 26న విజయవాడలో ఆయనకు పౌర సన్మానం జరగనుందని, అదేరోజున కేంద్రమంత్రిగా రాష్ట్రానికి మంజూరుచేసిన 2.23లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్రంలో పర్యటించనున్నారన్నారు. టీడీపీతో మైత్రికి ఢోకా ఉండదని, వచ్చే ఎన్నికల్లో కూడా మైత్రి కొనసాగుతుందని స్పష్టం చేశారు.



అదిగో ప్రపంచ సవాల్

- వరల్డ్ చాంపియన్‌షిప్స్‌కు భారత్ రెడీ
- గ్లాస్గోలో 21 నుంచి మెగా టోర్నీ
- సింగిల్స్‌లో మెరుగైన అవకాశాలు

క్రికెట్‌లో ప్రపంచకప్‌నకు ఎంతటి ప్రాధాన్యం ఉంటుందో.. బ్యాడ్మింటన్‌లో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌నకూ అంతే క్రేజ్..! ఎన్ని గ్రాండ్ ప్రీలు గెలిచినా.. సూపర్ సిరీస్‌లను పట్టేసినా.. వరల్డ్ చాంపియన్‌షిప్ కొట్టేస్తే వచ్చే కిక్కే వేరు..! ప్రపంచంలో అత్యుత్తమ క్రీడాకారులు పోటీ పడే ఈ మెగా ఈవెంట్‌లో సవాల్ అంతే క్లిష్టంగా ఉంటుంది..! నాలుగు దశాబ్దాల ఘన చరిత్ర ఉన్న ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా నెగ్గింది ఐదు పతకాలే..! కొన్నేళ్లుగా బ్యాడ్మింటన్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న మన దేశానికి ఇన్ని తక్కువ పతకాలు నిరాశ కలిగించేవే..! అయితే, ఈ సారి మాత్రం భారత షట్లర్లు ఒకటి కంటే ఎక్కువ పతకాలు తెచ్చేలా కనిపిస్తున్నారు..! ఈ నెల 21న గ్లాస్గోలో మొదలయ్యే మెగా టోర్నీలో సింగిల్స్ షట్లర్లు మెరుగైన ప్రదర్శన చేసేందుకు సన్నద్ధమవుతున్నారు..!



ఇటీవల కాలంలో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాధించిన విజయాలు.. ఈ ఆటలో మనదేశంపై ప్రపంచం మొత్తం దృష్టి సారించేలా చేశాయి. బ్యాడ్మింటన్‌లో భారత్ పవర్ హౌస్‌గా మారుతుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌నకు భారత్ 21 మందితో భారీ బృందంతో బరిలోకి దిగడం ఈ వృద్ధిని ప్రస్ఫుటిస్తున్నది. ఈ మెగా టోర్నీకి ఇంత పెద్ద సంఖ్యలో షట్లర్లు అర్హత సాధించడం ఇదే తొలిసారి. అలాగే, ఐదు విభాగాల్లో (పురుషులు, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్) క్వాలిఫికేషన్ దక్కించుకున్న కొద్ది దేశాల్లో భారత్ ఒకటి కావడం విశేషం. కిడాంబి శ్రీకాంత్, బి. సాయి ప్రణీత్, అజయ్ జయరామ్, సమీర్ వర్మ వరల్డ్ చాంపియన్‌షిప్స్ బెర్తులు దక్కించుకోగా.. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, పీవీ సింధు, రితుపర్ణదాస్, తన్వీలాడ్ బరిలో నిలిచారు.

నిరీక్షణ ఫలించే సమయం..

భారత పురుషులకు ఈ ఏడాది అద్భుత ఫలితాలను ఇచ్చింది. ఈ సీజన్‌లో పురుష షట్లర్లు మూడు గ్రాండ్‌ప్రీ టోర్నమెంట్లు సహా ఏకంగా ఆరు టైటిళ్లు కొల్లగొట్టారు. అందులో రెండు సూపర్ సిరీస్‌లు ఉన్నాయి. మూడు అంతర్జాతీయ టోర్నీ ఫైనల్స్‌ల్లో భారత ఆటగాళ్లు పోటీ పడడం విశేషం. రియో తర్వాత నిలకడ తప్పిన కిడాంబి శ్రీకాంత్.. వెంటవెంటనే రెండు టైటిళ్లతో మళ్లీ గాడిలో పడ్డాడు. ఒకానొక దశలో 31వ ర్యాంక్‌కు పడిపోయిన శ్రీకాంత్ అద్భుత ఆటతీరుతో మళ్లీ టాప్-10లోకి దూసుకొచ్చాడు. మరో తెలుగు కుర్రాడు సాయి ప్రణీత్‌కు కూడా ఈ సీజన్ బాగా కలిసొచ్చింది. రెండు ట్రోఫీలతో సత్తా చాటాడు. ర్యాంకింగ్స్‌లో 30-20 మధ్య కొట్టుమిట్లాడిన అతను.. థాయ్‌లాండ్ ఓపెన్ విక్టరీ తర్వాత 19వ ర్యాంక్ దక్కించుకున్నాడు. ఇక, అజయ్ జయరామ్ సీజన్ అసాంతం నిలకడగా రాణిస్తున్నాడు. టాప్-20లో కొనసాగుతున్నాడు. సయ్యద్ మోదీ విజయం ఇచ్చిన ఊపును కొనసాగించలేకపోయిన సమీర్ వర్మ టాప్-30లో మాత్రం నిలిచాడు. 29వ ర్యాంక్‌తో వరల్డ్ సవాల్‌కు అర్హత సాధించాడు. 1983లో దిగ్గజ షట్లర్ ప్రకాశ్ పదుకోన్ కాంస్యం నెగ్గిన తర్వాత పురుషుల విభాగం నుంచి ఇప్పటిదాకా భారత్‌కు పతకం రాలేదు. 25 ఏళ్ల పతక నిరీక్షణ ఈ సారి ఫలించే చాన్స్ ఉంది.



శ్రీకాంత్

సైనా, సింధుపైనే

మహిళల విభాగానిది పూర్తిగా భిన్నమైన కథ. 2011లో గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్ప డబుల్స్‌లో కాంస్యం గెలిచి 28 ఏళ్ల పతక కరువుకు తెరదించారు. ఆ తర్వాత ప్రతీసారి భారత్ పతకం నెగ్గుతూనే వస్తోంది. 2013, 2014లో పీవీ సింధు కంచు మోత మోగించగా.. 2015లో సైనా నెహ్వాల్ రజతంతో మెరిసింది. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో వరుస పతకాల తర్వాత సింధు 2016 రియో ఒలింపిక్స్‌లో రజతంతో చరిత్ర సృష్టించింది. ఇక, ఈ ఏడాది ఆరంభంలోనే సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సిరీస్ గెలిచి కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు దూసుకెళ్లింది. చివరకు ఐదో ర్యాంక్‌తో ఈ చాంపియన్‌షిప్స్ బరిలో దిగనుంది. లండన్ ఒలింపిక్స్ కాంస్య విజేత సైనా నెహ్వాల్‌కు మాత్రం ఈ సంవత్సరం మిశ్రమ ఫలితాలు ఇచ్చింది. టాప్-10 నుంచి దిగజారిపోయిన సైనా.. ఫామ్ కూడా కోల్పోయింది. ప్రస్తుతం 16వ ర్యాంక్‌లో ఉన్న ఆమెకు మళ్లీ టాప్ క్లాస్ క్రీడాకారిణిగా నిరూపించేందుకు ఇదే మంచి సమయం. ఈ టోర్నీకి అర్హత సాధించిన యువ ప్లేయర్లు రితుపర్ణ దాస్, తన్వీలాడ్ 46, 93 ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు. ఈ ఇద్దరూ అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేకపోయారు. సయ్యద్ మోదీలో క్వార్టర్స్ చేరడం ఈ సీజన్‌లో దాస్ ఉత్తమ ప్రదర్శన. ఈ టోర్నీలో ఇద్దరూ.. వరల్డ్ బెస్ట్ షట్లర్లను ఎదుర్కోవడం ఆషామాషీ కాదు. దాంతో, ఈ విభాగంలో సైనా, సింధుపైనే ఎక్కువగా ఆశలు ఉన్నాయి.



సాయి ప్రణీత్

మనోళ్లకు సత్తా ఉంది..

వరల్డ్ చాంపియన్‌షిప్స్ గురించి ఆతృతగా ఎదురు చూస్తున్నా. ఈ సారి మనది పెద్ద జట్టే కాదు. బలమైనది కూడా. ప్రతి ఒక్కరూ మెరుగ్గా కనిపిస్తున్నారు. ఈ టోర్నీకి ముందు మన ఉత్తమ ప్రదర్శన ఒక పతకమే. భారత ప్లేయర్ల ఫామ్‌ను చూస్తే ఈ సారి ఒకటి కంటే ఎక్కువ పతకాలు వస్తే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ టోర్నీలో ఫేవరెట్ ఎవరనేది చెప్పలేం. అయితే, ప్రపంచంలో ఉత్తమ ప్లేయర్లను ఓడించే సత్తా మన షట్లర్లకు ఉంది.

- జాతీయ కోచ్ గోపీచంద్

ర్యాపిడ్‌లో ఆనంద్‌కు నిరాశ

- సంయుక్తంగా ఎనిమిదో స్థానం

సెయింట్ లూయిస్ (అమెరికా): మాజీ వరల్డ్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్.. సెయింట్ లూయిస్ చెస్ టోర్నీ ర్యాపిడ్ విభాగంలో సంయుక్తంగా ఎనిమిదో స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. మంచి ఫినిషింగ్‌లతో టైటిల్ రేస్‌లో ఉన్న విషీకి అదృష్టం కలసి రాలేదు. తొమ్మిదో రౌండ్‌లో రష్యా గ్రాండ్ మాస్టర్ సెర్గీ కర్జాకిన్ చేతిలో విషీ పరాజయం పాలయ్యాడు. అంతకు ముందు ఏడో రౌండ్‌లో వియత్నాం గ్రాండ్ మాస్టర్ లి క్వాంగ్ లిమ్‌తో పాయింట్ పంచుకున్న ఆనంద్.. ఎనిమిదో రౌండ్‌లో ఫ్యాబినో కరువానా (అమెరికా)తో డ్రా చేసుకున్నాడు. దీంతో ఆనంద్ ర్యాపిడ్ విభాగంలో మొత్తం 9 రౌండ్ల నుంచి ఏడు పాయింట్లు సాధించాడు. లివోన్ అరోనియన్ (అర్మేనియా) 12 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. ర్యాపిడ్‌తో సగం ముగిసిన టోర్నీలో ఇక 18 గేమ్‌ల బ్లిట్జ్ మిగిలుంది. మొత్తం పాయింట్ల ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు.

హారికకు తొలి డ్రా

అబుదాబి: వరుసగా రెండు విజయాలతో దూసుకెళ్తున్న భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణ వల్లి హారికను బెలారస్ గ్రాండ్ మాస్టర్ నిలువరించాడు. అబుదాబి అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్లో మూడో రౌండ్ గేమ్‌లో కిరిల్ స్తుపక్ (బెలారస్)తో హారిక పాయింట్ పంచుకుంది. నల్లపావులతో ఆడిన హారిక 78 ఎత్తుల అనంతరం కిరిల్‌తో డ్రాకు అంగీకరించింది.

క్వార్టర్స్‌లో సానియా జోడీ

ఓహియో: సిన్సినాటి మాస్టర్స్‌లో సానియా మీర్జా జోడీ క్వార్టర్స్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్ ప్రీ క్వార్టర్స్‌లో ఇండో-చైనా జోడీ సానియా-పెంగ్ షువాయ్ 7-5, 6-4తో జూలియా జార్జెస్-ఓల్గా సావ్‌చుక్‌పై వరుస సెట్లలో నెగ్గింది. కాగా, పురుషుల సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్ రెండో రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టాడు. రామ్‌కుమార్ 4-6, 6-2, 4-6తో డొనాల్డ్‌సన్ (అమెరికా) చేతిలో ఓడాడు.

ఆస్ట్రియాపై నెగ్గిన భారత్

అమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): ఐరోపా టూర్‌ను భారత హాకీ జట్టు విజయంతో ముగించింది. రమణ్‌దీప్ సింగ్, చింగ్లేసనా సింగ్ డబుల్ గోల్స్ చేయడంతో భారత్ 4-3తో ఆస్ట్రియాపై విజయం సాధించింది. రమణ్‌దీప్ (25వ, 32వ నిమిషం), చింగ్లేసనా (37వ, 60వ) చెరో రెండు గోల్స్ చేశారు. ఈ టూర్‌లో మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన భారత్.. రెండింటిలో ఓడింది.

రూట్ అజేయ సెంచరీ



లీడ్స్: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఇంగ్లండ్‌కు మంచి ఆరంభం లభించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం మొదలైన ఈ డే/నైట్ టెస్టులో కెప్టెన్ జో రూట్ (103 బ్యాటింగ్) అజేయ సెంచరీకి తోడు అలిస్టర్ కుక్ (81 బ్యాటింగ్) సత్తాచాటడంతో ఆతిథ్య జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలిరోజు కడపటి సమాచారం అందే సమయానికి 54 ఓవర్లలో 211/2 స్కోరుతో నిలిచింది. స్టోన్‌మన్ (8), టామ్ వెస్లీ (8) విఫలమైనా రూట్, కుక్ గట్టి పునాది వేశారు.



శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం మొదలయ్యే తొలి మ్యాచ్ కోసం దంబుల్లా చేరుకున్న భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోనీ

నాన్నకు ప్రేమతో..

- తండ్రికి హార్దిక్ అనూహ్య బహుమతి

ముంబై: శ్రీలంకతో మూడో టెస్ట్‌లో మెరుపు సెంచరీతో భారత్ విజయంలో తన కుమారుడు హార్దిక్ పాండ్యా కీలక పాత్ర పోషించడంతో ఉబ్బితబ్బిబవుతున్న అతడి తండ్రి హిమాన్షు పాండ్యా.. కొడుకు ఇచ్చిన ఓ అనూహ్య బహుమతితో మరింత ఉప్పొంగిపోతున్నారు. బుధవారం సాయంత్రం పెద్ద కొడుకు కృనాల్ పాండ్యా ఆయనను తీసుకొని కార్ల షోరూంకు వెళ్లాడు. ఇంతలోనే శ్రీలంక నుంచి చిన్న కొడుకు హార్దిక్ వీడియో కాల్ చేశాడు. నచ్చిన కారు సెలెక్ట్ చేసుకోవాలని తండ్రిని కోరాడు. దాంతో హిమాన్షు ఎర్ర రంగు కారును ఎంపిక చేసుకున్నారు. వెంటనే 'ఈ కారుకు మీరు ఓనర్' అంటూ మేనేజర్ తాళం అందజేశాడు. ఈ విషయాన్ని హార్దిక్ వీడియో సహా ట్విటర్‌లో పంచుకున్నాడు. 'ఆయన ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. ఆయనను అంత ఆనందంగా చూడడం గర్వంగా ఉంది' అని ట్వీట్ చేశాడు. కారు తాళాలు అందుకున్న హిమాన్షు 'ఐ లవ్ యూ హార్దిక్' అని ఉద్వేగంగా స్పందించారు.

తొలి మ్యాచ్‌లో ఆసీస్‌తో భారత్ ఢీ

- అండర్-19 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల
- కివీస్‌లో మెగా టోర్నీ

ముంబై: వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 3 వరకూ న్యూజిలాండ్‌లో జరిగే అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గురువారం ప్రకటించింది. 2016 రన్నరప్ భారత్.. ఆస్ట్రేలియా, పపువా న్యూగినియా, జింబాబ్వేతో కూడిన గ్రూప్‌లో తలపడుతోంది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను భారత్ ఢీకొననుంది. ఆ తర్వాత న్యూగినియా, జింబాబ్వేలతో తలపడనుంది. డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్ ఆతిథ్య కివీస్‌తో మ్యాచ్‌తో టోర్నీని ఆరంభించనుంది. భారత్ తొలిసారి 2000లో మహ్మద్ కైఫ్ సారథ్యంలో ఈ ప్రపంచకప్ నెగ్గింది. ఆ తర్వాత 2008లో విరాట్ కోహ్లీ, 2012లో ఉన్ముక్త్ చంద్ టైటిళ్లు అందించారు.

'విశ్వ వేదికలపై యువ సత్తా చాటడంలో అండర్-19 వరల్డ్‌కప్ ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఈ టోర్నీలో రాణించిన ప్రస్తుత, గత క్రికెటర్ల జాబితా చాలా పెద్దగానే ఉంది. ఎంతోమంది భవిష్యత్తు స్టార్లను వచ్చే ఏడాది న్యూజిలాండ్‌లో చూడనున్నాం' అని ఐసీసీ ఈవెంట్ల హెడ్ క్రిస్ టెట్లే అన్నాడు. 22 రోజుల ఈ టోర్నీలో అన్ని మ్యాచ్‌లకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు టోర్నీ డైరెక్టర్ బ్రెండన్ బౌర్క్ తెలిపాడు. నాలుగు గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్‌లీగ్‌లో ప్రవేశిస్తాయి.

గ్రూప్-ఎ : విండీస్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, కెన్యా
గ్రూప్-బి: భారత్, ఆస్ట్రేలియా, జింబాబ్వే, న్యూగినియా
గ్రూప్-సి: బంగ్లాదేశ్, కెనడా, ఇంగ్లండ్, నమీబియా
గ్రూప్-డి: పాకిస్థాన్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, స్కాట్లండ్

అది సైనాకు మంచిదే..

- కోచ్ విమల్ కుమార్

న్యూఢిల్లీ: గాయాల కారణంగా ఫామ్ కోల్పోయిన సైనా నెహ్వాల్‌పై కొంతకాలంగా ఎవరి దృష్టి లేకపోవడం ఆమెకు లాభించే విషయం అంటున్నాడు కోచ్ విమల్ కుమార్. తనపై అంచనాలు లేకపోవడం వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సైనాకు అనుకూలించే అంశమని చెప్పాడు. 'మోకాలి గాయం తర్వాత సైనా గాడిలో పడేందుకు బాగా కష్టపడుతోంది. ఒకవేళ తన పూర్తి సామర్థ్యంతో ఆడితే మాత్రం సైనా టాప్ ప్లేయర్లను ఓడించడం సులభమే. ఈ సారి ఆమెపై ఫోకస్ లేదు. సింధు, శ్రీకాంత్‌పైనే దృష్టి కేంద్రీకృతమైంది. అది సైనాకు మంచిదేన'ని విమల్ చెప్పుకొచ్చాడు. ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో బై ఎదురైన సైనాకు ప్రీ క్వార్టర్స్‌లో రెండో సీడ్ సంగ్ జి హ్యూన్ రూపంలో ప్రమాదం పొంచి ఉంది. 'ఇది కఠిన డ్రా అయినా ముందుకెళ్లవచ్చు. సంగ్ జి హ్యూన్ రెండో ర్యాంక్‌లో ఉంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సైనా ఆమెను ఓడించింది. అందువల్ల సైనా కచ్చితంగా మెరుగైన ప్రదర్శన చేస్తుందని ఆశిస్తున్నా'ని విమల్ తెలిపాడు.

ఆర్థర్ దుర్భాషలాడాడు..!

- పాక్ కోచ్‌పై అక్మల్ ఆరోపణ



కరాచీ: కోచ్ మికీ ఆర్థర్ తనను దుర్భాషలాడాడని పాకిస్థాన్ టెస్ట్ బ్యాట్స్‌మన్ ఉమర్ అక్మల్ ఆరోపించాడు. మోకాలి గాయానికి ఇంగ్లండ్‌లో చికిత్స పొందిన అక్మల్.. ట్రైనింగ్ కోసం నేషనల్ క్రికెట్ అకాడమీకి వెళ్లినప్పుడు కోచ్‌తో వాగ్వాదం జరిగిందని చెప్పాడు. ఇందుకు చీఫ్ సెలెక్టర్ ఇంజమామ్, ముస్తాక్ అహ్మద్‌లే సాక్ష్యులన్నాడు. మొదట బ్యాటింగ్ కోచ్ గ్రాంట్ ఫ్లవర్, ఫిజియోలను కలసి ప్రాక్టీస్‌కు సహకరించాలని కోరానన్నాడు. కానీ వారు సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ప్లేయర్లతోనే పనిచేయాలని ఆదేశాలున్నాయని చెప్పడంతో ఆర్థర్ వద్దకు వెళ్లానన్నాడు. 'ఇంజమామ్, ముస్తాక్‌లను కలవాలని కోచ్ సూచించాడు. అయితే వారు ఆర్థర్‌ను మరోసారి కలవమని సలహా ఇచ్చార'ని అక్మల్ చెప్పాడు. కానీ, రెండోసారి వెళ్లి ట్రైనింగ్‌కు అనుమతించాలని అడిగితే ఆర్థర్ ఒక్కసారిగా కోపంతో ఊగిపోయాడన్నాడు. 'అసలు అకాడమీలో నీకేం పని. వెళ్లి క్లబ్ క్రికెట్ ఆడుకో అంటూ ఇష్టం వచ్చినట్టు పరుషమైన పదజాలం ఉపయోగించాడ'ని అక్మల్ చెప్పాడు. కాగా గతంలో ఆసీస్ పర్యటనలోనూ ఈ ఇద్దరి మధ్య విభేదాలు పొడసూపాయి.



రైడ్ పాయింట్ వేటలో మిరాజ్

ఢిల్లీ గెలుపు బాట


- తలైవాస్‌పై ఉత్కంఠ విజయం
- బెంగాల్-గుజరాత్ మ్యాచ్ టై

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో దబాంగ్ ఢిల్లీ మళ్లీ గెలుపు బాట పట్టింది. వరుసగా నాలుగు పరాజయాల అనంతరం ఆ జట్టు విజయం రుచి చూసింది. గురువారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ 30-29తో తమిళ్ తలైవాస్‌పై పాయింట్ తేడాతో గెలిచింది. ఇరాన్ ప్లేయర్లు మిరాజ్ షేక్ (9), అబోల్ఫజల్ (11) ఇద్దరే 20 పాయింట్లు తెచ్చి దబాంగ్‌కు విజయం అందించారు. కెప్టెన్ అజయ్ ఠాకూర్ 14 పాయింట్లతో చెలరేగినా తలైవాస్ గట్టెక్కలేకపోయింది. ఆరంభం నుంచే రెండు జట్లూ చెరో పాయింట్ నెగ్గుతూ వెళ్లడంతో ప్రథమార్ధం 12-12తో ముగిసింది. సెకండాఫ్‌లో అజయ్ ఠాకూర్ వరుస రైడ్ పాయింట్లతో అదరగొట్టడంతో.. 33వ నిమిషంలో ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన తలైవాస్ 25-22తో ముందంజ వేసింది. తర్వాత దాన్ని 27-23కు పెంచుకుంది. అయితే, మిరాజ్ డబుల్ రైడ్ పాయింట్ రాబట్టగా.. ప్రపంజన్‌ను టాకిల్ చేసిన ఢిల్లీ చివరి నిమిషంలో 27-28తో నిలిచి మ్యాచ్‌పై ఉత్కంఠ రేపింది. మరో 40 సెకన్లలో ఆట ముగుస్తుందనగా కూతకు వెళ్లిన మిరాజ్ మూడు పాయింట్లు తెచ్చి దబాంగ్‌ను 30-28తో ఆధిక్యంలో నిలిచాడు. అజయ్ తన ఆఖరు రైడ్‌లో పాయింట్ తెచ్చినా తలైవాస్‌కు ఓటమి తప్పించలేకపోయాడు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 26-26తో ఆతిథ్య గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌పై టైతో గట్టెక్కింది.





ఇది ప్రకృతి విలయం. తీరని విషాదం. ఓ వైపు వరదలు.. మరో వైపు విరిగిపడిన కొండచరియలు.. జనావాసాలను ముంచెత్తిన బురద.. వెరసి రెండు ఆఫ్రికా దేశాలు కకావికలమయ్యాయి. సియెర్రా లియోన్‌లో 300 మంది మరణించగా.. కాంగోలో 40 మంది మృతి చెందారు. విలయానికి బలైన తమ బంధువులు, స్నేహితులను గుర్తించేందుకు సియెర్రా లియోన్ ప్రభుత్వం పౌరులకు బుధవారం వరకు గడువిచ్చింది. అది ముగియడంతో గురువారం తొలివిడత సామూహిక అంత్యక్రియలను వాటర్‌లూలో నిర్వహించింది. 2014లో ఎబోలాకు బలైన వారిని ఖననం చేసిన ప్రదేశానికి సమీపంలోనే ఈ పట్టణం ఉంది. సామూహిక అంత్యక్రియల్లో సహాయక సిబ్బంది నిమగ్నమైన దృశ్యమిది. ఈ నెల 15న కొండచరియలు విరిగిపడినప్పుడు తీసిన ఉపగ్రహ చిత్రాన్నీ(ఇన్‌సెట్) చూడొచ్చు.



ఇదేమిటీ.. చేతికి వేళ్లకి ఏదో కట్టుకున్నాడు అనుకుంటున్నారా? అలాంటిదేమీలేదు. ఇవి అతడి చేతి వేళ్ల గోళ్లే. కోల్‌కతాకు చెందిన మురారి ఆదిత్య అనే ఈయన 38 అంగుళాల పొడవున గోళ్లను పెంచాడు. పెంచడమే కాదు వాటికి అందమైన రంగులతో అలంకరణ చేసి ఇలా తీర్చిదిద్దాడు. గోళ్లు పెంచడంలో గిన్నిస్ రికార్డు కూడా కొట్టాడు.

చిట్టి 'తల్లి'

- రేప్‌కు గురైన పదేళ్ల బాలిక ప్రసవం
- ఆడశిశువు జననం.. 2.5 కేజీల బరువు
- శిశువును చూడబోమన్న బాలిక తల్లిదండ్రులు
- సంరక్షణ బాధ్యత శిశు రక్షణ కమిటీకి..

చండీగఢ్, ఆగస్టు 17: ఆమెనే ఓ పాప! ఓ పాపకు తల్లయింది! ప్రసవం అంటే ఏమిటో తెలియని వయసులో అమ్మయింది. "అమ్మో.. నా పొట్ట ఇలా పెరుగుతుందేమిటి" అంటూ అమాయకంగా తల్లిదండ్రులను ప్రశ్నించిన ఆ పాలబుగ్గల చిట్టితల్లి ఓ బిడ్డకు జన్మనిచ్చింది. సొంత మామయ్య చేతిలో ఏడునెలలుగా అత్యాచారానికి గురై, గర్భం దాల్చిన 10 ఏళ్ల బాలిక గురువారం ఛండీగఢ్‌లోని ఆస్పత్రిలో ఓ పాపకు జన్మనిచ్చింది. శిశువును వైద్యులు శస్త్రచికిత్స ద్వారా బయటకు తీశారు. పాప 2.5 కేజీలున్నట్టు, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. బాలిక గర్భస్రావం కోసం ఆమె తల్లిదండ్రులు చేసిన అభ్యర్థనను సుప్రీం కోర్టు గత నెలలో తిరస్కరించిన సంగతి తెలిసిందే. తల్లిప్రాణాలకు ముప్పు అని వైద్యులు చెబితే తప్ప 20 వారాలు దాటిన గర్భాన్ని తొలగించేందుకు మనదేశ చట్టాలు అనుమతించవు. కాగా, బాలిక నెలలు నిండక ముందుగానే 32 వారాలకు ప్రసవించింది. దీంతో శిశువును ప్రస్తుతం ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వారం పదిరోజుల పాటు బాలిక, ఆమె పాపను ఆస్పత్రిలోనే ఉంచనున్నారు. కాగా పుట్టబోయే శిశువును సాకమని ఇది వరకే స్పష్టం చేసిన బాలిక తల్లిదండ్రులు.. గురువారం శిశువును చూసేందుకు కూడా ఇష్టపడలేదు. దీంతో ఎవరైనా దత్తత తీసుకునేంత వరకు శిశువు సంరక్షణ బాధ్యతను శిశు సంరక్షణ కమిటీకి అప్పగించాలని అధికారులు నిర్ణయించారు.

బాలికలకు రక్షణలేని భారతం

- దేశంలో అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ప్రతి 155 నిమిషాలకు 16 ఏళ్ల లోపు బాలిక, ప్రతి 13 గంటలకు పదేళ్ల లోపు బాలికపై రేప్ జరుగుతోంది.
- 2015లో 10వేలమందికి పైగా రేప్‌కు గురయ్యారు
- బాల్య వివాహాలూ పెరిగిపోతున్నాయి. 24 కోట్ల మహిళలకు 18 ఏళ్ల లోపే పెళ్లిళ్లయ్యాయి.
- చిన్నారుల్లో 53.22శాతం ఏదో ఒక సందర్భంలో లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారు. తెలిసిన వారు, లేదంటే నమ్మినవారే అకృత్యాలకు పాల్పడ్డారని బాధితుల్లో 50శాతం వాపోయారు.

అర్ధరాత్రి గర్భిణి గెంటివేత.. నడిరోడ్డుపై ప్రసవం

షహరాన్‌పూర్ (యూపీ): ఓ గర్భిణిని ఆస్పత్రి యాజమాన్యం గెంటేయడంతో ఆమె ఓ ఈ-రిక్షాలోనే ప్రసవించిన ఘటన యూపీలో జరిగింది. షహరాన్‌పూర్‌కు చెందిన మున్వార్ అనే మహిళకు నెలలు నిండటంతో భర్త గత సోమవారం జిల్లా ప్రభుత్వ మహిళా ఆస్పత్రిలో చేర్పించారు. నిండుగర్భిణి అని కూడా చూడకుండా బుధవారం అర్ధరాత్రి ఆస్పత్రి సిబ్బంది మున్వార్‌ను గెంటివేశారు. మరో ఆస్పత్రికి తీసుకెళుతున్న క్రమంలో ఆమె ఈ-రిక్షాలోనే ప్రసవించింది. బాధితురాలి భర్త ఫిర్యాదుతో ప్రభుత్వాస్పత్రి వైద్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, అత్యాచారానికి గురై.. గర్భం దాల్చిన ఓ అనాథ మహిళకు తక్షణమే రూ.10లక్షల పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు గురువారం బిహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరో కేసులో రేప్ కారణంగా బుద్ధిమాంద్యురాలైన మహిళ గర్భం దాల్చి దాన్ని తొలగించుకోవాలనుకుంటే ఆమె సంరక్షకుల అంగీకారం అవసరం లేదని పేర్కొంది.

యుద్ధం దిశగా..!

- రక్త సేకరణలో 'డ్రాగన్'
- డోక్లాం వద్ద రక్త సేకరణ శిబిరాలు

బీజింగ్, ఆగస్టు 17: భారత్‌తో యుద్ధానికి చైనా సన్నాహాలు చేస్తోందా? డోక్లాం పరిసర ప్రాంతాల్లో చైనా సైన్యం కదలికలను పరిశీలిస్తే ఈ ప్రశ్నకు ఔననే సమాధానం వస్తుంది. డోక్లాం పరిసర ప్రాంతాల్లో చైనా సైన్యం పెద్ద ఎత్తున రక్తసేకరణ శిబిరాలను నిర్వహిస్తోంది. భారీగా రక్తాన్ని సేకరించి నిల్వ చేస్తోంది. మరోవైపు చైనా వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో రక్త వినియోగంపై నియంత్రణ విధించారు. యుద్ధ సమయంలో క్షతగాత్రులైన సైనికులకు అందుబాటులో ఉంచేందుకు ఈ విధమైన ఏర్పాట్లు చేయడం సాధారణం. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) ఆదేశాల మేరకు ఛంగ్‌షాలోని ఆస్పత్రికి చెందిన బ్లడ్ బ్యాంకును ఇప్పటికే డోక్లాంకు తరలించినట్టు చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. కాగా, డోక్లాం విషయంలో భారత్, చైనాలు యుద్ధం దిశగా అడుగులు వేస్తున్నాయని విదేశీ మీడియా విశ్లేషించింది. రెండు దేశాల నడుమ గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, ఇది యుద్ధానికి దారితీయవచ్చని లండన్‌లోని రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శశాంక్ జోషి విశ్లేషించారు. కాగా, చైనా వార్తా సంస్థ జిన్‌హువా భారత్‌పై విషం చిమ్మిం ది. డోక్లాం విషయంలో భారత్ ఏడు పాపాలు చేసిందంటూ ఓ వీడియోను తన ట్విటర్‌లో పోస్టు చేసింది. 3 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో ఓ నటుడుకి గెడ్డం తగిలించి భారత సిక్కు యువకుడిని తలపించేలా వేషం వేశారు. ఈ వీడియోను ట్విటర్‌లో పోస్టు చేయగా, ట్విటర్‌పై చైనాలో నిషేధం ఉండటం కొసమెరుపు.

నా పాలనలో దళారులకే అసంతృప్తి

- 'చాంపియన్ ఆఫ్ చేంజ్' భేటీలో మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: గత పాలకులు అవినీతిని వ్యవస్థీకృతం చేశారని ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. దానిని నిర్మూలించాలంటే అవినీతి అణచివేత వ్యవస్థలను బలోపేతం చేయాల్సి ఉందని నొక్కి చెప్పారు. అవినీతి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన చిన్న చిన్న మార్పులు గొప్ప ఫలితాలు తెచ్చాయని తెలిపారు. సామాన్య ప్రజలను విశ్వసిస్తూ.. స్వీయ ధ్రువీకరణ పత్రాలు ఇస్తే చాలన్న వెసులుబాటుతో లబ్ధిదారులకు ఎంతో మేలు జరిగిందన్నారు. గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రద్దుచేశామని చెప్పారు. దీనివల్ల ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు వసూలు చేసే దళారులను తరిమివేశామన్నారు. వాళ్లే దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని గగ్గోలు పెడుతున్నారని, దళారులే తన పాలనలో అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. నీతి ఆయోగ్ గురువారమిక్కడ 200 మంది ఔత్సాహిక యువపారిశ్రామికవేత్తలతో ఏర్పాటుచేసిన 'చాంపియన్స్ ఆఫ్ చేంజ్' కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. గతంలో పద్మ అవార్డులు ఎవరికివ్వాలో మంత్రులు సిఫారసు చేసేవారని, ఇప్పుడు ప్రజలే నేరుగా సిఫారసు చేసే అవకాశం కల్పించామని, ఇది కేవలం చిన్న మార్పని తెలిపారు.

ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తల ప్రజెంటేషన్

సాఫ్ట్ పవర్: ఇన్‌క్రెడిబుల్ ఇండియా 2.0; విద్య-నైపుణ్యాభివృద్ధి; ఆరోగ్యం-పౌష్టికాహారం; రేపటి ప్రగతికి నూతనోత్తేజం; డిజిటల్ ఇండియా; 2022కల్లా నవభారతం అనే ఆరు అంశాలపై ఆరు గ్రూపులుగా ఏర్పాటైన ఔత్సాహిక యువ పారిశ్రామివేత్తలు ప్రధాని ముందు నవీన ఆలోచనలతో కూడిన తమ తమ ప్రజెంటేషన్లను సమర్పించారు. గత రెండ్రోజుల్లో ఆయన యువపారిశ్రామికవేత్తలతో భేటీ కావడం ఇది రెండోసారి. తన 45 నిమిషాల ప్రసంగంలో.. వారి కొత్త ఆలోచనలను, ఆవిష్కరణలను, సమస్యలకు సూచించిన పరిష్కారాలను మోదీ ప్రశంసించారు. 'చాంపియన్స్ ఆఫ్ చేంజ్' కార్యక్రమాన్ని ఏటా నిర్వహించాలని సూచించారు. ఈ ఆరు గ్రూపులను కేంద్రంలోని సంబంధిత మంత్రిత్వ శాఖలకు, ప్రభుత్వ విభాగాలకు అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ సామాజిక సంక్షేమ పథకాల ప్రచారానికి పారిశ్రామికవేత్తలు తమ ఉద్యోగులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, నీతిఆయోగ్ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగడియా, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



'సచ్ భారత్' కావాలి!

- ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలే: రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: 'ప్రస్తుతం ప్రధాని మోదీ ఎక్కడకు వెళ్లినా 'స్వచ్ఛ భారత్' గురించి మాట్లాడుతున్నారు.. కానీ ప్రజలకు కావాల్సింది 'స్వచ్ఛ భారత్' కాదు.. 'సచ్ (నిజాయితీ) భారత్" అని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీ అన్నిచోట్లా అబద్ధాలే చెబుతున్నారని జేడీయూ అధినేత శరద్ యాదవ్ ఏర్పాటు చేసిన ప్రతిపక్షాల సమావేశంలో రాహుల్ విమర్శించారు. అలాగే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తామని, యువతకు ఉద్యోగాలు సృష్టిస్తామన్న ప్రధాని హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని అన్నారు.



సింగపూర్‌కు డైరెక్ట్ ఫ్లైట్!?

- నడిపేందుకు సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంసిద్ధత

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాజధాని వాసులకు శుభవార్త! గన్నవరం విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు నేరుగా విమాన సర్వీసు త్వరలోనే అందుబాటులోకి రానుంది! సుప్రసిద్ధ సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు అనుబంధ సంస్థ అయిన 'సిల్క్ ఎయిర్' ఈ విమానాన్ని నడిపేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించుకుందని విశ్వసనీయ సమాచారం. రాజధానిలోని 1691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియాను స్విస్ చాలెంజ్ విధానంలో అభివృద్ధి పరచే అవకాశాన్ని పొందిన సింగపూర్ కన్సార్షియం ప్రతినిధులతో ఏపీసీఆర్డీయే ఉన్నతాధికారులు బుధ, గురువారాల్లో జరిపిన సమావేశాల్లో సింగపూర్ ప్రతినిధులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. వందల కోట్ల రూపాయల భారీ వ్యయంతో రాజధానిలోని కీలక ప్రదేశాల్లో ఒకటిగా, అమరావతి ప్రగతికి దోహదపడే ప్రాజెక్టుగా రూపుదిద్దుకోనున్న స్టార్టప్ ఏరియా పనులను అతి త్వరలోనే ప్రారంభించేందుకు సింగపూర్ కన్సార్షియం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విజయవాడలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడంతోపాటు అవసరమైన స్థానిక నిపుణుల నియామకానికీ చురుగ్గా చర్యలు తీసుకుంటోంది. ఇదే సమయంలో క్రమంగా ఊపందుకుంటున్న స్టార్టప్ ఏరియా అభివృద్ధి పనుల్లో పాలుపంచుకునే సింగపూర్ నిపుణులు, ఉద్యోగుల సంఖ్య కూడా పెరుగుతోంది. మరొకపక్క అత్యాధునిక నిర్మాణ పద్ధతులు, స్మార్ట్ సిటీ రూపకల్పన తదితర అంశాలకు సంబంధించి సింగపూర్ నిపుణులతో సంప్రదింపులు జరిపేందుకు, అక్కడి ప్రముఖ సంస్థలు ఇచ్చే శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏపీసీఆర్డీయే, ఏడీసీల అధికారులు కూడా తరచూ అక్కడికి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో 'సిల్క్ ఎయిర్' గన్నవరానికి సింగపూర్ నుంచి నేరుగా విమానాన్ని నడిపేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

త్వరలోనే డిజైన్ సంస్థ

రాజధానిని అగ్రశ్రేణి నగరంగా తీర్చిదిద్దడంలో సహకరించేందుకు సింగపూర్ సహకారంతో అమరావతిలో నెలకొల్పదలచిన 'అమరావతి డిజైన్ అండ్ ప్లానింగ్ ఇన్‌స్టిట్యూట్'పై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అత్యుత్తమ జీవనానికి భరోసానిచ్చే మౌలిక వసతుల కల్పనలో పేరొందిన సింగపూర్‌లోని 'సెంటర్ ఫర్ లివబుల్ సిటీస్' తోడ్పాటుతో ఈ సంస్థ ఏర్పాటు కానుంది. సీఆర్డీయే, ఏపీఈడీబీలతోపాటు సింగపూర్ కన్సార్షియం ఇందుకోసం సంయుక్తంగా ప్రయత్నాలు జరపాలని భావించారని సమాచారం.



మణిపూర్‌కు చెందిన హక్కుల ఉద్యమ నాయకురాలు 'ఉక్కు మహిళ' ఇరోమ్ షర్మిల(45), బ్రిటిష్ పౌరుడైన డెస్మండ్ కౌటిన్హో పెళ్లి కొడైకెనాల్‌లో గురువారం నిరాడంబరంగా జరిగింది. – చెన్నై, ఆంధ్రజ్యోతి

ఫెయిల్ అవుతానేమో..

- అనంతలో వైద్య విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం వైద్యం, ఆగస్టు 17 : పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో.. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థి గుజ్జల యశ్వంత్ మహేంద్రకుమార్ (20) ఆత్మహత్య చేసుకొన్నాడు. అనంతపురంలో రైలు పట్టాలపై అతని మృతదేహం కనిపించింది. పరీక్షలు రాయలేకపోతున్నానని..ఫెయిలవుతానేమోనని భయంగా ఉన్నదని చెప్పడంతో..తాము అనంతపురంలో రెండు రోజుల పాటు యశ్వంత్‌తో గడిపి, ధైర్యం చెప్పినట్టు తల్లిదండ్రులు చంద్రశేఖర్, సుమలత వాపోయారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.